ప్రపంచానిక ఆఖరు ఘడియలు
రూ॥140/- పేజీలు:154



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపుపై స్పష్టత ఇవ్వాలి 08

భూసేకరణ అధికారి తీరుపై హైకోర్టు ఆగ్రహం

సంపుటి 09, సంచిక: 155 | మంగళవారం | 05-05-2026 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

| పశ్చిమ బెంగాల్(293/293) | |
|---|---|
| పార్టీ | గెలుపు |
| తృణమూల్+ | 77 |
| బిజెపి | 206 |
| కాంగ్రెస్ | 2 |
| వామపక్ష కూటమి | 2 |
| ఇతరులు | 2 |

| తమిళనాడు(234/234) | |
|---|---|
| పార్టీ | గెలుపు |
| డిఎంకె+ | 74 |
| అన్నాడిఎంకె+ | 53 |
| టివికె | 107 |
| సిపిఐ | 2 |
| ఇతరులు | – |

| కేరళ (140/140) | |
|---|---|
| పార్టీ | గెలుపు |
| ఎల్‌డిఎఫ్ | 35 |
| యూడిఎఫ్ | 102 |
| ఎన్‌డిఎ | 3 |
| సిపిఐ | 8 |
| ఇతరులు | – |

| అసోం (126/126) | |
|---|---|
| పార్టీ | గెలుపు |
| బిజెపి+ | 102 |
| కాంగ్రెస్+ | 21 |
| ఎఐయుడిఎఫ్ | 2 |
| ఇతరులు | 1 |

| పుదుచ్చేరి (30/30) | |
|---|---|
| పార్టీ | గెలుపు |
| ఎన్ఆర్ కాంగ్రెస్+ | 18 |
| కాంగ్రెస్+ | 6 |
| టివికె+ | 3 |
| ఇతరులు | 3 |

# ఐదు అసెంబ్లీ ఎన్నికల్లో భిన్న ఫలితాలు



స్టాలిన్ ఓటమి



మమత బెనర్జీ ఓటమి



పినరయ్ విజయన్ విజయం

## తమిళనాడులో ‘హీరో’ విజయ్



## పశ్చిమ బెంగాల్ బిజెపి వశం




## కేరళ ‘హస్త’ గతం



## అసోం, పుదుచ్చేరిలో తిరిగి ఎన్‌డిఎ ప్రభుత్వాలు





### ఓటమి పాలైన తమిళనాడు సిఎం స్టాలిన్, పశ్చిమ బెంగాల్ సిఎం మమతా బెనర్జీ

**కోల్‌కతా/చెన్నై:** ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ఓటర్లు భిన్నమైన ఫలితాలను ఇచ్చారు. కేంద్రంలో బిజెపి నాయకత్వానగల ఎన్‌డిఎకు ప్రతిపక్షాలుగా ఉన్న తమిళనాడు,పశ్చిమబెంగాల్,కేరళ రాష్ట్రాలలోని అధికారపార్టీలు ఓటమి చవిచూశాయి. అసోంలో ఎన్‌డిఎ నేత, ముఖ్యమంత్రి హిమంత బిశ్వాస్ శర్మ మరోసారి అధికారం నిలబెట్టుకున్నారు. తమిళనాట ఆరు దశాబ్దాలుగా కొనసాగుతున్న ద్రవిడియన్ సిద్ధాంత సంప్రదాయాన్ని మొట్టమొదటి ప్రయత్నంలోనే నటుడు విజయ్ దాటుకుని సినీ భాషలో బ్లాక్‌బస్టర్ సాధించినప్పటికీ పూర్తి మెజార్టీ సాధించకుండా అధికారానికి అడుగు దూరంలో ఆగిపోయారు. ఇక ‘సర్’ ప్రక్రియ వివాదం మధ్య పశ్చిమ బెంగాల్ చరిత్రలో మొదటిసారి బిజెపిఅధికారం స్వాధీనం చేసుకుంది. కేరళలో యుడిఎఫ్ విజయం సాధించగా, ముందుగా ఊహించిన విధంగానే అసోంలో బిజెపి అధికారం నిలబెట్టుకుంది. పుదుచ్చేరిలో ఎన్‌డిఎ కూటమి సారథ్యంలో ఎఐఎన్ఆర్‌సి నాయకుడు ఎ.రంగస్వామి ఐదోసారి ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణం చేసేందుకు సిద్ధమవుతున్నారు. కంచుకోటలుగా భావించిన నియోజకవర్గాల నుండి రెండు రాష్ట్రాలలో ముఖ్యమంత్రులు మమతా బెనర్జీ,ఎం.కె.స్టాలిన్ ఓడిపోయారు. పశ్చిమ బెంగాల్‌లో బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని సువేందు అధికారి ప్రకటించారు. బెంగాల్‌లో భవానీపూర్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఓటమిపాలుకాగా, కొళత్తూర్ నియోజకవర్గం నుండి తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ పరాజయం పాలయ్యారు.భవానీపూర్ నియోజకవర్గంలో బిజెపి ముఖ్యమంత్రి అభ్యర్థి సువేందు అధికారి చేతిలో మమతా బెనర్జీ 15,114 ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఈ నియోజకవర్గంలో ఇలా రెండోసారి మళ్ళీ ఆమె సువేందు అధికార చేతుల్లో ఓడిపోయారు. పోలింగ్ పూర్తయిన వెంటనే ముఖ్యమంత్రి పదవికోసం కేరళ కాంగ్రెస్‌పార్టీలో అంతర్గత సంఘర్షణలు ప్రారంభం కావడం ఓటర్లకు ఆశ్చర్యం కలిగిస్తోంది. దిగ్భ్రాంతికరమైన ఈ ఎన్నికల ఫలితాలు రావడంలో సోషల్ తరువాయి 8లో

## అభివృద్ధికి నాదీ హామీ : మోదీ

బెంగాల్, అసోం, పుదుచ్చేరిలో బిజెపి ఘనవిజయం సాధించడంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు ట్విట్టర్ వేదికగా అభినందనలు తెలిపారు. అలాగే కేరళలో గెలిచిన యుడిఎఫ్‌నకు, తమిళనాడులో ఘనవిజయం సాధించిన టివికె పార్టీకి శుభాకాంక్షలు తెలిపారు. ‘2026 బంగాల్ అసెంబ్లీ ఎన్నికలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి. ప్రజాశక్తి గెలిచింది. బిజెపి సుపరిపాలన రాజకీయాలు విజయం సాధించాయి. బెంగాల్‌లోని ప్రతి ఒక్కరికీ నేను తలవంచి నమస్కరిస్తున్నాను. మీరు బిజెపికి అనుకూలంగా అద్భుతమైన తీర్పును ఇచ్చారు. అందుకే బెంగాల్ ప్రజల కలలను, ఆకాంక్షలను నెరవేర్చడానికి మా పార్టీ సాధ్యమైన ప్రతి ప్రయత్నం చేస్తుందని హామీ ఇస్తున్నాను. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు, గౌరవాన్ని అందించే ప్రభుత్వాన్ని మేము అందిస్తాం. ఎన్నో ఏళ్లుగా కార్యకర్తలు చేసిన కృషి, పోరాటాలు లేకుంటే, నేడు బంగాల్‌లో బిజెపి సాధించిన ఈ రికార్డు సాధ్యమయ్యేది కాదు. వారందరికీ నేను సెల్యూట్ చేస్తున్నాను. ఎన్నో ఏళ్లుగా వారు క్షేత్రస్థాయిలో కష్టపడి పని చేసి, అన్ని రకాల ప్రతికూలతలను అధిగమించి మా అభివృద్ధి జెండాను ప్రజల్లోకి తీసుకెళ్లారు. అని మోదీ అన్నారు.

## ఇసి మద్దతుతో గెలిచిన బిజెపి:రాహుల్

ఎన్నికల కమిషన్ మద్దతుతో బిజెపి ఎన్నికల చోరీకి అస్సాం, పశ్చిమ బెంగాల్‌లు స్పష్టమైన ఉదాహరణలు. మమతా జీతో మేము ఏకీభవిస్తున్నాము. బెంగాల్లో 100కి పైగా స్థానాలు చోరీ చేయబడ్డాయి. ఈ వ్యూహాన్ని మధ్యప్రదేశ్, హర్యానా, మహారాష్ట్ర, లోక్‌సభ –2024 ఎన్నిలలో మేము గతంలోనే చూశాం. ఎన్నికల చోరీ, వ్యవస్థల చోరీ.. ఇంకా ఏమి మార్గం మిగిలి ఉంది. కేరళ ఓటర్లు నిర్ణయాత్మక తీర్పు అందించారు. కాంగ్రెస్‌కు కేరళలో ప్రతిభ, సామర్థ్యాలు ఉన్నాయి. ఇప్పుడు, ఆ రెండింటినీ సద్వినియోగం చేసుకునే యూడీఎఫ్ ప్రభుత్వం ఏర్పడనుంది. త్వరలోనే కేరళకు వెళ్తాను. తమిళనాడు ఫలితాల్లో టివికె అతిపెద్ద పార్టీగా అవతరించిన నేపథ్యంలో.. విజయ్‌కు రాహుల్ గాంధీ ఫోన్ చేసి అభినందించారు. ‘టివికె అద్భుతమైన విజయం సాధించింది.

## ఆదర్శాలు, సిద్ధాంతాలే ముఖ్యం : స్టాలిన్

‘గత ఐదేళ్లలో మేం ఎన్నో పథకాలు, సుపరిపాలనను ప్రజలకు అందించాం. తమిళనాడును అన్ని విధాలుగా ఉన్నత స్థాయికి తీసుకెళ్లాం. మేం చేసిన పనులనే ప్రధానంగా చూపించి ఓట్లు అభ్యర్థించాం. సంక్షేమ పథకాలను నిరంతరాయంగా కొనసాగిస్తామనే నిర్దిష్టమైన హామీలతోనే ప్రచారం చేశాం’ అని తమిళనాడు సిఎం స్టాలిన అన్నారు. కేవలం గెలుపోటముల కన్నా ఆదర్శాలు, సిద్ధాంతాలే ముఖ్యమన్నారు. అన్ని వర్గాల ప్రజలకు నిజాయతీగా, నా మనఃసాక్షికి అనుగుణంగానే సేవలందించాను. నా శక్తికి మించి పనిచేశాను. నాతో పాటే పార్టీ కార్యకర్తలూ భుజం భుజం కలిపి పనిచేశారు.. వారందరికీ కృతజ్ఞతలు. నా రాజకీయ జీవితంలో గొప్ప విజయాలను చూసినట్లే అపజయాలనూ ఎదుర్కొన్నాను. డిఎంకె రాజకీయ ప్రస్థానం నిర్విరామంగా కొనసాగుతుంది. ఇప్పటివరకు ఆదర్శవంతమైన పాలక పార్టీగా పనిచే సిన ఇఎంకె.. ఇకపై అదే తరహాలో ప్రతిపక్షంగా తన బాధ్యతను నిర్వర్తిస్తుంది’’ అని పేర్కొన్నారు

## ఇది గెలుపు కాదు లూటీ.. :మమతా బెనర్జీ

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై మమతా బెనర్జీ స్పందించారు. ఇది ప్రజాస్వామ్యబద్ధంగా వచ్చిన గెలుపు కాదని, పూర్తిగా ‘లూటీ’ అని ఆమె ఆరోపించారు. బిజెపి సుమారు 100కు పైగా స్థానాలను లూటీ చేసిందని, దీనిపై తాము చేసిన ఫిర్యాదులను అధికారులు పట్టించుకోలేదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది అనైతిక విజయమని, సెంట్రల్ ఫోర్సెస్, కేంద్ర మంత్రుల అండతో చేసిన అక్రమమని ఆమె పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలు ప్రతికూలంగా ఉన్నప్పటికీ, తృణమూల్ కాంగ్రెస్ మళ్లీ బలంగా పుంజుకుంటుందని మమతా బెనర్జీ ఆశాభావం వ్యక్తం చేశారు. అక్రమాలకు వ్యతిరేకంగా తమ పోరాటం కొనసాగుతుందని ఆమె స్పష్టం చేశారు.

పెట్రోల్, డీజిల్ కొరత గ్యాస్ అధిక ధరలను నిరసిస్తూ

## రేపు రాష్ట్రవ్యాప్త నిరసనలు

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రకటన

ప్రజాపక్షం/హైదరాబాద్

పెట్రోల్, డీజిల్ కొరతకు తోడు పెంచిన గ్యాస్ ధరలను నిరసిస్తూ సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీన నిర్వహించనున్న రాష్ట్ర నిరసన కార్యక్రమంలో పార్టీ శ్రేణులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పంట కోతల సమయంలో డీజిల్ లేకపోవడంతో రైతాంగం తరువాయి 12లో

## కేరళలో గెలుపొందిన సిపిఐ అభ్యర్థులు



సి.అజయ్ ప్రసాద్ పునలూర్



జి.ఆర్.అనీల్ నెడమంగడ్



గీతాగోపి నట్టిక



గోవిందన్ పల్లికప్పిల్ కన్హన్‌గడ్



కె. రాజన్ ఒల్లూరు



కె.కె.వల్సరాజ్ కైపమంగళం



ముహమ్మద్ ముహసిన్ పట్టంబి



పి.ప్రసాద్ చెర్తాల

07 తమిళనాడులో గెలుపొందిన సిపిఐ అభ్యర్థులు



కె.మారిముత్తు తిరుత్తరైపూండీ



టి.రామచంద్రన్ థళి

జస్టిస్ బి.లోకూర్ కమిషన్ నివేదిక

## సిబిఐకి అప్పగింత

- మంత్రి వర్గం ఆమోదం
- రాష్ట్రంలో భూముల ధరల సవరణ, క్రమబద్ధీకరించాలని కేబినెట్ నిర్ణయం
- మార్కెట్ విలువల రేషనలైజేషన్ చేయడానికి రిజిస్ట్రేషన్ శాఖకు అనుమతి
- మే 26వ తేదీ అనంతరం అమల్లోకి సవరించిన భూమి విలువలు
- మంత్రి వర్గ నిర్ణయాలను మీడియాకు వివరించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి





ప్రజాపక్షం/హైదరాబాద్

విద్యుత్ కొనుగోలు, భద్రాద్రి, యాదాద్రి థర్మల్ ప్రాజెక్టులలో జరిగిన అక్రమాలపై విచారణకు సంబంధించిన జస్టిస్ బి.లోకూర్ కమిషన్ నివేదికను కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ)కు అప్పగించేందుకు తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ కేసులో అంతర్రాష్ట్ర అంశాలు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల పాత్ర ఉన్నందున ఈ వ్యవహారాన్ని సిబిఐకి అప్పగిస్తూ మంత్రి వర్గం నిర్ణయతం తీసుకుంది. రాష్ట్రంలో భూముల ధరలను సవరించాలని, కొన్ని ప్రాంతాల్లో వాస్తవ ధరలతో పోలిస్తే భారీగా హెచ్చుతగ్గులున్న తరువాయి 8లో





## రూ.కోట్లు కాజేసిన తండ్రీకొడుకులు

పంజాగుట్టలో గోల్డ్‌సిల్వర్ మోసం

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ నగరంలో మరో భారీ గోల్డ్‌సిల్వర్ మోసం వెలుగులోకి వచ్చింది. నమ్మకాన్ని ఆయుధంగా చేసుకుని వ్యాపారుల రూపంలో వ్యవహరించిన ఇద్దరు వ్యక్తులు కోట్ల రూపాయల మోసానికి పాల్పడిన ఘటన కలకలం రేపుతోంది. ఒక్క ఘటనలోనే నిందితులైన తండ్రికొడుకులు రూ.50 లక్షలు కాజేశారు. ఇదే పద్ధతిలో తరువాయి 12లో

## హోర్ముజ్‌లో ‘ప్రాజెక్ట్ ఫ్రీడమ్’

- 15వేల సేనలు,100 విమానాలు మోహరించిన సెంట్‌కామ్
- అడ్డుకుంటే అణచేస్తాం : ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక
- జలసంధి దాటి వెళ్ళిన రెండు అమెరికా జెండా నౌకలు




**దుబాయ్:** హోర్ముజ్ జలసంధిలో స్తంభించిపోయిన అంతర్జాతీయ నౌకలను సురక్షితంగా బయటకు పంపించేందుకు ‘‘ప్రాజెక్ట్ ఫ్రీడమ్’’ను ట్రంప్ ప్రారంభించారు. దీనిని అమెరికా సైనికదళం (సెంట్‌కామ్) ‘ప్రాజెక్ట్ లిబర్టీ’గా పేర్కొంది. యుద్ధం ప్రారంభమయ్యాక హోర్ముజ్ జలసంధిలో ఇప్పటివరకూ అనేక అంతర్జాతీయస్థాయీ వాణిజ్య నౌకలు స్తంభించిపోయాయి. వందల నౌకలలో ఉన్న సిబ్బంది దగ్గరున్న ఆహార నిల్వలు కూడా ఖాళీ అయిపోవడంతో వారు ఆకలితో అలమటిస్తున్నారు. ఈ యుద్ధంతో సంబంధంలేని నౌకలు బాధితులుగా మారాయని, ఈ నౌకలను సురక్షితంగా జలసంధి దాటించి పంపించాలని అనేక తటస్థ దేశాల నాయకులు తనను కోరారని, అందువల్లనే మానవతాదృక్పథంతో ‘ప్రాజెక్ట్ ఫ్రీడమ్’ ని సోమవారం ఉదయం ప్రారంభించామని, నౌకలకు మార్గదర్శనం చేస్తామని సోషల్ మీడియా వేదికగా ట్రంప్ ప్రకటించారు. వందల నౌకలతో హోర్ముజ్ స్తంభించిపోయిందని, వీటిని బయటకు పంపేసి జలసంధిని ఖాళీ చేస్తామన్నారు. ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసేందుకు, నౌకలు తరువాయి 12లో

## మొక్కజొన్న, జొన్నను ‘పిఎస్‌ఎస్ స్కీంలో చేర్చాలి’

కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్



మొక్కజొన్న, జొన్న పంటలను పిఎస్‌ఎస్ స్కీంలో చేర్చి, శనగ, పొద్దుతిరుగుడు పంటలపై ఉన్న 25శాతం కొనుగోలు పరిమితిని ఎత్తివేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం కేంద్ర మంత్రికి రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరోమారు లేఖ రాశారు. రాష్ట్రంలో యాసంగిలో పండించిన వేరుశనగ, పొద్దుతిరుగుడు వంటి పంటలను 25 శాతంమాత్రమే కొనగోలు చేసేలా కేంద్రం పరిమితులను విధించడంతో రైతులు తీవ్రఇబ్బందులు పడుతున్నారన్నారు. మిగిలిన పంటను రాష్ట్ర ప్రభుత్వం కోనుగోలు తరువాయి 12లో

02 ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
మంగళవారం
05-05-2026
www.prajapaksham.in



# మార్పుకోసం తీర్పు

ఐదు శాసనసభలకు జరిగిన ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రధాన రాష్ట్రాలైన కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌ల్లో అనూహ్యమైన ఫలితాలను వెల్లడించాయి. అసోం, కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో ముందునుంచి ఊహిస్తున్నట్లే అధికారంలోని ఎన్‌డిఎ తిరిగి అధికారం దక్కించుకుంది. కాగా కేరళలో ముందునుంచీ రాజకీయ పరిశీలకులు ఊహిస్తున్నట్లే అధికారం ఎల్‌డిఎఫ్ నుంచి యుడిఎఫ్ చేతిలోకి మారింది. తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లలో ఓటర్లు అనూహ్యమైన తీర్పు ఇచ్చారు. తమిళనాడులో డిఎంకె అధికారం నిలబెట్టుకుంటుందన్న అంచనాలకు భిన్నంగా ద్రవిడ పార్టీలైన డిఎంకె, ఎఐఎడిఎంకెలను త్రోసివేసి సినీమా హీరో జోసఫ్ విజయ్ నెలకొల్పిన టివికె పార్టీ అధికారానికి అతి చేరువలో ఉంది. సైలెంట్ ఓటర్లు ముఖ్యంగా యువత, మహిళలు, దళితులు విజయ్‌ను ముఖ్యమంత్రి పీఠానికి చేర్చారు. డిఎంకె ఓడిపోవటమే కాదు, ముఖ్యమంత్రి ఎం.కె స్టాలిన్ రెండుసార్లు గెలిచి, మూడవసారి ఓటర్ల తీర్పు కోరిన కొలత్తూర్ నియోజకవర్గంలో ఓటమి పొందారు. దీర్ఘకాలం డిఎంకెలో ఉండి, గత ఫిబ్రవరిలో విజయ్ పార్టీలో చేరిన విఎస్ బాబు చేతిలో స్టాలిన్ 9వేల ఓట్ల తేడాతో ఓటమి పొందారు. పోటీ నువ్వానేనా అన్నట్లు సాగిన పశ్చిమ బెంగాల్‌లో బిజెపి పదేళ్ల ఏకాంశ ఎజండా నెరవేరింది. 15 ఏళ్లుగా అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించి అధికారం కైవసం చేసుకుంది. అసోంలో ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ (బిజెపి) హ్యాట్రిక్ కొట్టబోతున్నారు. పుదుచ్చేరిలో రంగస్వామి కాంగ్రెస్‌తో పొత్తులో బిజెపి జూనియర్ భాగస్వామి. రంగస్వామి తిరిగి ముఖ్యమంత్రి పీఠం అధిరోహిస్తున్నారు. అయితే తమిళనాడు, కేరళలలో బిజెపి ఎప్పటివలె ఈ ఎన్నికల్లో కూడా ప్రాతినిధ్యం కోసం పోరాటంలోనే ఉంది. కేరళలో 3 సీట్లు గెలుపొందటం ఆత్మసంతృప్తి. తమిళనాడులో విజయ్‌తో పొత్తుకోసం విఫలయత్నం చేసింది. ఆతనికి డిప్యూటీ ముఖ్యమంత్రి ఇస్తామంది. అన్నా డిఎంకెతో పొత్తు కోసం తమ రాష్ట్ర ఫైర్‌బ్రాండ్ అధ్యక్షుడు అన్నామలైని తొలగించింది. మొత్తం మీద 27 సీట్లకు పోటీచేసినా 2సీట్లు మాత్రమే గెలిచినట్లు ప్రాథమిక సమాచారం. ఇక బిజెపి నిస్సందేహంగా దక్షిణాదిపై కేంద్రీకరిస్తుంది. కర్నాటక, తెలంగాణల్లో కాంగ్రెస్ ఇప్పటినుంచే జాగ్రత్తలు తీసుకోకపోతే నష్టపోతుంది.

కేరళలో సిపిఐ(ఎం) నాయకత్వంలోని వామపక్ష ప్రజాతంత్ర సంఘటన (ఎల్‌డిఎఫ్) 2021 ఎన్నికల్లో వరుసగా రెండవసారి అధికారంలోకి రావటమే చరిత్ర. ఆ ఉత్సాహంతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి, హ్యాట్రిక్ కొడతామని గట్టిగా భావించారు. అయితే అభివృద్ధి సమస్యలకన్నా కొన్ని భావోద్వేగ సమస్యలు, అవినీతి ఆరోపణలు ప్రభుత్వ ప్రతిష్టను మసకబార్చాయి. కొద్దినెలల క్రితం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో గట్టి ఎదురుదెబ్బలు తగిలాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఎల్‌డిఎఫ్ ఓటమి పొందినా, 35సీట్లకు పడిపోవటం, కాంగ్రెస్ కూటమి యుడిఎఫ్ 100స్థానాలకు పైగా గెలుపొందటం లోతైన ఆత్మపరిశీలనను డిమాండ్ చేస్తున్నది.
తమిళనాడులో త్రిముఖ పోటీలో డిఎంకె కూటమి విజయం నల్లేరు మీద నడక అనుకున్నారు. ఆ ధీమాతోనే అదనపు సీట్లకోసం భాగస్వామ్య పక్షాల డిమాండ్‌ను డిఎంకె నిరాకరించింది. దాని ప్రధాన ప్రత్యర్థి ఎఐఎడిఎంకె, జయలలిత మరణానంతరం నాయకత్వ లోపంతో కొట్టుమిట్టాడుతుండగా, బిజెపి దాన్ని ఆడించే ప్రయత్నం చేసింది. అయితే ఎడప్పాడి పళనిస్వామి దృఢంగా నిలబడటంతో దాని ప్రయత్నాలు ఫలించలేదు. మరోవైపున కొత్తగా రాజకీయ ప్రవేశం చేసిన సినీమా హీరో విజయ్‌తో బిజెపి బేరసారాలు సాగించింది. అయినా అతడు పొత్తుకు సిద్ధం కాలేదు. ఎఐఎడిఎంకె కూటమిలో భాగస్వామి అయినప్పటికీ బిజెపి ఆశలు ఫలించలేదు. ముఖ్యంగా హోంమంత్రి అమిత్ షా వ్యూహాలకు ఎదురుదెబ్బ తగిలింది. డిఎంకె అధినేత స్టాలిన్ ఓటమి ఆ పార్టీకి పెద్ద దెబ్బకాగా, ఆయన కుమారుడు ఉదయనిధి గెలుపు స్వల్ప ఊరట. కాగా సినీ హీరో రాజకీయ ప్రవేశాన్ని, ఎన్నికల ప్రచారాన్ని, జనాకర్షణను ప్రత్యర్థి పార్టీలు అతి తక్కువ అంచనా వేశాయి. ద్రవిడ రాజకీయాలన్నీ అన్నాదురై మొదలు కరుణానిధి, ఎంజి రామచంద్రన్, జయలలిత వరకు సినీ గ్లామర్‌తో ముడిపడి ఉన్నాయి. డిఎంకె, ఎఐఎడిఎంకె పరిపాలన చూసిన ఓటర్లు – ముఖ్యంగా యువతరం మార్పును కోరుకున్నారు. విజయ్ ఆ ధీమాతోనే ఎవరితో పొత్తు కోరుకోలేదు. ఇప్పుడు ముఖ్యమంత్రి పీఠానికి 10–12 సీట్ల దూరంలో ఉన్నారు. మిత్రులను చేరదీయక తప్పని అనివార్యత ఎదురైంది.

ఈ దఫా ఎన్నికల్లో మహాపోరాటం పశ్చిమ బెంగాల్‌లో జరిగింది. బెంగాల్‌లో మమతా బెనర్జీని ఓడించి అధికారం చేజిక్కించుకోవటం గంగా ప్రవాహ ప్రాంతంలో తమ భవిష్యత్ రాజకీయాలకు కీలకంగా భావించిన బిజెపి ఎన్నికల కమిషన్ ద్వారా ఓట్ల ఏరివేత మొదలు కేంద్రబలగాల నియోగం, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల తొలగింపు, ఓట్ల లెక్కింపు అధికారుల నియామకం వరకు యావత్ ఎన్నికల యంత్రాంగాన్ని చేతికి తీసుకుని టిఎంసిని ఉక్కిరిబిక్కిరి చేసింది. పైచేయి సాధించింది. అయితే వ్యక్తి అహంభావ, అరాచక, గుండాగిరి పాలనకు, అవినీతి కుంభకోణాలకు, అభివృద్ధి లేమికి ఆలవాలమైన మమత పార్టీ చిత్తుగా ఓడినందుకు చింతించే వారెవ్వరూ లేకపోవటం, జాతీయ రాజకీయాల్లో బిజెపి వ్యతిరేక పోరాటంలో ముఖ్యపాత్రధారిగా ఉన్న ఆమెకు సానుభూతి చూపేవారు లేకపోవటం స్వయంకృతం. 15 సంవత్సరాల బెంగాల్ పాలనలో ప్రతిపక్ష కాంగ్రెస్, వామపక్షాలను అతి దారుణంగా అణచివేసిన అహంభావి ఆమె. అయితే ఆమెకు ప్రతిపక్షంగా పచ్చి మతవాద, మితవాద పక్షమైన బిజెపి ఎదుగుదల ఆందోళనకరం.

గత లోక్‌సభ ఎన్నికల్లో 400 సీట్లు ఆశించి 240 సీట్లకు పరిమితమైన బిజెపి, మిత్రపక్షాల సహాయంతో మూడవసారి అధికారం చేబట్టిన తర్వాత వరుసగా హర్యానా, ఢిల్లీ, మహారాష్ట్ర, ఇప్పుడు పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలను వ్యూహాత్మకంగా గెలుచుకోవటం, అసోం, పుదుచ్చేరి నిలుపుకోవటం భవిష్యత్ ఎన్నికలకు సంకేతాలు. దాని నినాదాలు, అభివృద్ధి వ్యూహాలు. రామభజన ప్రధానంగా మెజారిటీ మతాధిక్య రాజకీయాలు, ఎన్నికల తాయిలాలు, మహిళా రిజర్వేషన్ బిల్లును ఎరగా ప్రయోగిస్తూ, ప్రతిపక్షాలను నిందిస్తున్న తీరు, వీటన్నిటితోపాటు, ఆ పార్టీ వెనుక చాపకింద నీరులా ఆర్‌ఎస్‌ఎస్ యంత్రాంగం పనిచేస్తున్న తీరు వగైరాలను జాగ్రత్తగా అధ్యయనం చేసి వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు సమైక్యంగా ఎదిరించాల్సిన అవసరాన్ని ఈ ఎన్నికలు మరోసారి గుర్తు చేస్తున్నాయి. ●



## ఒక తండ్రిగా ఎంతో గర్వంగా ఉంది

ఒక తండ్రిగా తనకు ఎంతో గర్వంగా ఉంది. విజయ్‌కు అతడిపై ఉన్న విశ్వాసం అద్భుతం. ఆ నమ్మకమే అతడిని సిఎం కుర్చీకి చేరువ చేసింది. విజయ్ యాటిట్యూడ్‌ను అభినందిస్తున్నాను. ఎవరితోనూ పొత్తుల్లేకుండా ఒంటరిగా నిలబడి.. పార్టీని నిలబెట్టాడు. ఇది విజయ్‌కి మాత్రమే గొప్ప విజయం కాదు. తమిళనాడులోనూ ఇది చారిత్రక విజయం.

- విజయ్ తండ్రి ఎస్ఎ చంద్రశేఖర్



# ఊపిరి సలపనివ్వని ఆస్థమా.. అప్రమత్తతే రక్షణ!

'శిశువుల నుంచి వృద్ధుల వరకు ఎవరినైనా ఉక్కిరిబిక్కిరి చేసే సమస్య ఆస్థమా. కాలుష్యం, అలర్జీలు, మారుతున్న జీవనశైలి కారణాలతో దేశంలో ఆస్థమా కేసులు వేగంగా పెరుగుతున్నాయి. 'వరల్డ్ ఆస్థమా డే' (మే 5) సందర్భంగా ఆస్థమాపై అవగాహన కోసం ప్రత్యేక కథనం.'

ఆస్థమా (ఉబ్బసం) దీర్ఘకాలిక సమస్యే అయినప్పటికీ, సరైన చికిత్సతో నియంత్రణలో ఉంచుకోవచ్చు. అయితే మన దేశంలో ఆస్థమాపై సరైన అవగాహన లేకపోవడం, ముఖ్యంగా ఇన్హేలర్లపై భయాలు ఇంకా పెద్ద సమస్యగానే ఉన్నాయి. ఇలాంటి పరిస్థితులను మార్చాలనే ఉద్దేశంతోనే ఈ ఏడాది వరల్డ్ ఆస్థమా డే 'ఆస్థమా బాధితులందరికీ యాంటీ ఇన్‌ఫ్లమేటరీ ఇన్‌హేలర్లు అందించడం: నేటికీ ఒక అత్యవసర అవసరం' అనే సందేశాన్ని ఇస్తోంది. ఈ నేపథ్యంలో ఆస్థమా ఎందుకు వస్తుంది? దాన్ని ఎలా గుర్తించాలి? ఎలా నియంత్రించుకోవాలి? ఆధునిక చికిత్సలు ఎంతవరకు ఉపయోగపడుతున్నాయి? అనే అంశాలను బంజారాహిల్స్‌లోని రెనోవా సెంచరీ హాస్పిటల్స్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ టి. వివేక్ వివరించారు.

**ఆందోళన కలిగిస్తున్న గణాంకాలు!**
ప్రపంచవ్యాప్తంగా సుమారు 26 కోట్లకు పైగా మంది ఆస్థమాతో బాధపడుతున్నట్లు అంచనా. ప్రతి సంవత్సరం 4.5 లక్షలకుపైగా మరణాలు నమోదవుతున్నాయి. ప్రపంచ ఆస్థమా కేసుల్లో భారత్ వాటా దాదాపు 13 శాతం. ప్రపంచ సగటుతో పోలిస్తే భారత్‌లో ఆస్థమా కారణంగా మరణాల రేటు మూడు రెట్లు ఎక్కువగా ఉన్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. ముఖ్యంగా పిల్లల్లో ఈ సమస్య వేగంగా పెరుగుతోంది. కొన్ని ప్రాంతాల్లో 3 నుంచి 20 శాతం మంది చిన్నారులు ఆస్థమా లక్షణాలతో బాధపడుతున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. హైదరాబాద్ వంటి నగరాల్లో పెరుగుతున్న కాలుష్యం, ధూళి, ట్రాఫిక్, జీవనశైలి మార్పుల కారణంగా కేసులు మరింత పెరుగుతున్నాయి.

**ఆస్థమా అంటే :** ఆస్థమా అనేది ఊపిరితిత్తుల్లోని గాలిగొట్టాలకు సంబంధించిన దీర్ఘకాలిక వ్యాధి. దుమ్ము, ధూళి, చల్లని గాలి, పొగ వంటి వాటి ప్రభావంతో గాలిగొట్టాలు అతిగా స్పందిస్తాయి. అలర్జీ లేదా ఇతర ప్రేరక కారణాల వల్ల గాలి గొట్టాల్లో వాపు ఏర్పడి శ్వాస మార్గం ఇరుకవుతుంది. అదే సమయంలో జిగురు ద్రవం (శ్లేష్మం) అధికంగా ఉత్పత్తి కావడంతో శ్వాస తీసుకోవడం, వదలడం కష్టమవుతుంది.ఫలితంగా దగ్గు, ఆయాసం, ఛాతీ బిగుసుకుపోవడం, గొంతులో పిల్లి కూతల మాదిరిగా శబ్దం (వీజింగ్) రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

**కారణాలివే :** వంశపారంపర్యం, దుమ్ము, ధూళి, బూజు,వాతావరణ కాలుష్యం, సిగరెట్ పొగ, అలర్జీలు, వైరల్ ఇన్ఫెక్షన్లు, చల్లని వాతావరణం, మానసిక ఒత్తిడి, పెంపుడు జంతువుల వెంట్రుకలు, కొన్ని రకాల సువాసనలు, రసాయనాలు

**ఈ లక్షణాలను నిర్లక్ష్యం చేయొద్దు**
తరచూ దగ్గు రావడం, రాత్రిళ్లు, తెల్లవారుజామున దగ్గు ఎక్కువ కావడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఆయాసం, ఛాతీ బిగుసుకుపోయినట్లు అనిపించడం, గొంతులో పిల్లికూతల మాదిరిగా శబ్దం రావడం, వ్యాయామం చేసినప్పుడు ఊపిరి ఆడకపోవడం, అలసట, నిద్రలేమి

**ఆస్థమాను నిర్ధారించేందుకు వైద్యులు కొన్ని పరీక్షలు సూచిస్తారు. వాటిలో:**
స్పైరోమెట్రీ, పీక్ ఫ్లో మీటర్ పరీక్ష, అలర్జీ పరీక్షలు, ఛాతీ ఎక్స్‌రే
ఫీనో (FeNO) పరీక్ష, వ్యాయామ పరీక్ష, రక్త పరీక్షలు, స్పుటం పరీక్ష

**ఇన్హేలర్లపై భయాలు వద్దు**
ఆస్థమా శాశ్వతంగా నయం కాకపోయినా, సరైన చికిత్సతో నియంత్రణలో ఉంచుకోవచ్చు. ఆస్థమా నియంత్రణలో ఇన్హేలర్లు కీలక పాత్ర పోషిస్తాయి. చాలా మంది ఇన్హేలర్లకు అలవాటు పడిపోతామని భావిస్తారు. కానీ అది కేవలం అపోహ మాత్రమే. ఇన్హేల్డ్ కార్టికోస్టెరాయిడ్స్ గాలిగొట్టాల్లోని వాపును నేరుగా తగ్గించి శ్వాస తీసుకోవడం సులభం అయ్యేలా చేస్తాయి. వైద్యులు సూచించిన విధంగా వాడితే ఆస్థమాను అదుపులో ఉంచడంలో ఇవి ఎంతో ఉపయోగపడతాయి.

**ఇన్హేలర్లే ఎందుకు ప్రభావవంతం?**
మందు నేరుగా ఊపిరితిత్తులకు చేరుతుంది, త్వరగా ఉపశమనం లభిస్తుంది, దుష్ప్రభావాలు తక్కువగా ఉంటాయి

**ఈ జాగ్రత్తలు తప్పనిసరి**
* ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలి * ధూమపానానికి పూర్తిగా దూరంగా ఉండాలి * కాలుష్య ప్రాంతాల్లో మాస్క్ వాడాలి
* చల్లని గాలిలో జాగ్రత్తలు తీసుకోవాలి
* అలర్జీ కలిగించే పదార్థాలను నివారించాలి
* వైద్యులు సూచించిన మందులు క్రమం తప్పకుండా వాడాలి
* ఇన్హేలర్లను సరైన పద్ధతిలో వినియోగించాలి

ఆస్థమా ఉందని భయపడాల్సిన అవసరం లేదు. సరైన చికిత్స, అవగాహన, జాగ్రత్తలతో సాధారణ జీవితం గడపవచ్చు. తరచూ దగ్గు లేదా శ్వాస ఇబ్బందిని నిర్లక్ష్యం చేయకుండా సమయానికి వైద్యులను సంప్రదించాలి. క్రమం తప్పకుండా మందులు వాడటం, వైద్యుల సూచనలు పాటించడం ద్వారా అత్యవసర పరిస్థితులను చాలావరకు నివారించవచ్చు.

డాక్టర్ టి. వివేక్
కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్
రెనోవా సెంచరీ హాస్పిటల్స్, బంజారా హిల్స్, హైదరాబాద్.

# నాటోతో క్షీణిస్తున్న అమెరికా సంబంధాలు

సాత్యకి చక్రవర్తి

ఇరాన్ యుద్ధం, అలాగే ఉక్రేన్‌లో రష్యా యుద్ధం నేపథ్యంలో జర్మనీ నుంచి 5,000 మంది సైనికులను ఉపసంహరించుకోవాలన్న అమెరికా నిర్ణయం.. యూరప్, నాటోలతో అమెరికా సంబంధాలు మరింత క్షీణించడాన్ని సూచిస్తోంది. జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడ్రిక్ మెర్జ్, నాటోలపై ట్రంప్ తన అసంతృప్తిని ముందే వ్యక్తం చేసినప్పటికీ, ఇరాన్ విషయంలో అమెరికా పాత్రపై మెర్జ్ చేసిన కఠోర వ్యాఖ్యల కారణంగానే ఆయన సైనికుల ఉపసంహరణను వేగవంతం చేశారు. యుద్ధంలో అమెరికా మీద టెహ్రాన్ పైచేయి సాధించిందని, జరుగుతున్నదంతా అమెరికాకు అవమానం తప్ప మరేమీ కాదని జర్మన్ ఛాన్సలర్ అన్నారు.

ట్రంప్ ఈ వ్యాఖ్యల ను వ్యక్తిగతంగా తీసుకున్నారు. నాటోతో సంబంధాలను దెబ్బతీసే ఎలాంటి తీవ్రమైన చర్యలు తీసుకోకుండా ట్రంప్‌ను నిరోధించడానికి పెంటగాన్ అధికారులు ప్రయత్నిస్తున్నారు. అయినప్పటికీ, 2026 ప్రారంభం నుండి తాను విభేదిస్తున్న జర్మన్ ఛాన్సలర్‌ను ఇబ్బంది పెట్టడానికే ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ట్రంప్‌కు జర్మన్ మూలాలు ఉన్నాయి. ఆయన తాత అదృష్టాన్ని వెతుక్కుంటూ అమెరికాకు వెళ్ళారు. ఆయన పూర్వీకులు జర్మనీలో మోసం, అవకతవకల ఆరోపణలపై విచారణ ఎదుర్కొన్నారని జర్మన్ మీడియాలో వ్యాఖ్యానాలలో కూడా వచ్చాయి. తనపై కుటుంబం చేస్తున్న ఇటువంటి దాడుల పట్ల ట్రంప్ గతంలో అసహనం వ్యక్తం చేశారు.







జర్మనీ యూరప్‌లోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. నాటోలో కూడా భద్రతను కాపాడటంలో జర్మనీ బలమైన సహకారిగా ఉంది. వాస్తవానికి, నాటో సభ్యులందరూ తమ రక్షణ వ్యయాన్ని పెంచి, నాటో మొత్తం ఖర్చులను మరింతగా పంచుకోవాలని ట్రంప్ కోరిన తర్వాత, ఛాన్సలర్ మెర్జ్ రాబోయే మూడేళ్లకు అధిక రక్షణ బడ్జెట్‌ను ఆమోదించారు. యూరప్‌లో భాగం కాకపోయినా నాటో నిర్వహణ ఖర్చును అమెరికా ఎక్కువగా పంచుకుంటోందన్నది ట్రంప్ వాదన.

జర్మనీలో అమెరికా సైనిక ఉనికి 1945లో రెండవ ప్రపంచ యుద్ధం నాటిది. 1945 మే నెలలో జర్మనీలోని నాజీ పాలన లొంగిపోయినప్పుడు, యుద్ధంతో నాశనమైన జర్మనీలో 16 లక్షల మంది అమెరికా సైనికులు ఉండేవారు. కానీ ఆ సంఖ్య తరువాత కేవలం మూడు లక్షలకు తగ్గిపోయింది. అమెరికా రక్షణ శాఖ గణాంకాల ప్రకారం, 2025 చివరి నాటికి, జర్మనీలో 36,400 మంది అమెరికా సైనికులు మోహరించి ఉన్నారు. ఇది యూరప్‌లోని వివిధ స్థావరాలలో ఉన్న మొత్తం 68,000 మంది క్రియాశీల సిబ్బందిలో సగం. అంటే, జర్మనీ నుండి 5,000 మంది సైనికులను ఉపసంహరించుకున్న తర్వాత కూడా, అమెరికాకు చెందిన 31,400 మంది క్రియాశీల సైనికులు వివిధ స్థావరాలలో మోహరించి ఉంటారు.

ది గార్డియన్‌లో పేర్కొన్న పెంటగాన్ గణాంకాల ప్రకారం, యూరప్‌లోని ఏడు అమెరికా సైనిక స్థావరాలలో ఐదు జర్మనీలో ఉన్నాయి (మిగిలినవి బెల్జియం, ఇటలీలో ఉన్నాయి). స్టట్‌గర్ట్‌తో పాటు, అతిపెద్ద అమెరికా స్థావరాలలో భారీ రాంస్టెయిన్ వైమానిక స్థావరం కూడా ఉంది. ఇది యూరప్‌లోని అమెరికా వైమానిక దళాలకు ప్రధాన కార్యాలయంగా పనిచేస్తూ, 8,500 మంది వైమానిక దళ సిబ్బందికి ఆశ్రయం కల్పిస్తోంది.

బవేరియా సైనిక స్థావరం ఆధ్వర్యంలో నడిచే గ్రాఫెన్‌వోర్, విల్సెక్, హోహెన్‌ఫెల్స్, యూరప్‌లోని అమెరికా సైనిక అతిపెద్ద శిక్షణా ప్రాంతంలో భాగంగా ఉన్నాయి. కాగా, వీస్బాడెన్ సైనిక స్థావరం యూఎస్ ఆర్మీ యూరప్ అండ్ ఆఫ్రికాకు ప్రధాన కార్యాలయంగా ఉంది. లాండ్‌స్టహుల్ వైద్య కేంద్రం, అమెరికా వెలుపల ఉన్న అతిపెద్ద అమెరికా సైనిక ఆసుపత్రి. వాస్తవం ఏమిటంటే, యూరప్‌లోని స్థావరాలను ఉపయోగించడం వల్ల, ఇరాన్, ఇరాక్ లేదా ఆఫ్ఘనిస్తాన్‌తో సహా ప్రపంచంలోని ఇతర ప్రాంతాలలో అమెరికా సైనిక కార్యకలాపాలు తక్కువ ఖర్చుతో జరుగుతున్నాయి.

ఆ విధంగా, అమెరికా సైనికుల ఉనికి ద్వారా యూరప్ భద్రత పరంగా లాభపడగా, యూరప్‌లోని స్థావరాలను తన ప్రపంచవ్యాప్త కార్యకలాపాలకు ఉపయోగించడం ద్వారా అమెరికా కూడా ఎంతో ప్రయోజనం పొందింది. ఈ అమెరికా స్థావరాలు, అమెరికా సైనిక వ్యూహకర్తలకు లాజిస్టికల్‌గా మరింత సౌకర్యవంతంగా ఉన్నాయి. కాబట్టి, ట్రంప్ చెబుతున్నట్లుగా అమెరికాకు ఇది ఏకపక్ష వ్యవహారం కాదు.

యూరోపియన్ రక్షణ విశ్లేషకుల ప్రకారం, జర్మనీలో మోహరించిన మొత్తం 36,400 మంది సైనికులలో 5,000 మందిని ఉపసంహరించుకోవడం ద్వారా దారికి రావాలని ట్రంప్ కేవలం జర్మనీపై అధిక ఒత్తిడి తెస్తున్నారు. నిజానికి, ప్రస్తుత సైబర్‌టెక్ యుద్ధ యుగంలో, కేవలం సైనికుల సంఖ్య ముఖ్యం కాదు, స్థావరం, అత్యాధునిక ఆయుధాలు ముఖ్యం. కాబట్టి, తన ప్రపంచవ్యాప్త కార్యకలాపాల కోసం జర్మనీలోని స్థావరాన్ని ఉపయోగించుకోవడానికి అమెరికా ఇప్పటికీ సౌకర్యవంతమైన స్థితిలోనే ఉంది.

ఇరాన్ యుద్ధం కోసం అమెరికా తన స్పానిష్ స్థావరాన్ని ఏ మాత్రం ఉపయోగించరాదని స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్ స్పష్టం చేయడం పట్ల ట్రంప్ నిజానికి ఆందోళన చెందుతున్నారని పరిశీలకులు అంటున్నారు. స్పెయిన్ నాటోలో సభ్య దేశం. అమెరికా అవసరాల పట్ల స్పెయిన్ నిర్లక్ష్యం, అమెరికాతో నాటో సంబంధాలను ప్రభావితం చేయకూడదని ట్రంప్ కోరుకుంటున్నారు. అమెరికా–నాటో సంబంధాలలో ఒడిదుడుకులు కొనసాగుతాయి.

(ఐపిఎ సర్వీస్)

# వ్యవస్థల జడత్వానికి అస్థిపంజర సాక్ష్యం!

ఒడిశా రాష్ట్రంలోని కేంఝర్ జిల్లాలో ఒక నిరుపేద గిరిజనుడు తన సోదరి అస్థిపంజరాన్ని భుజాన వేసుకుని బ్యాంకు మెట్లెక్కిన దృశ్యం ఆధునిక భారతదేశపు వ్యవస్థాగత వైఫల్యాలకు నిలువుటద్దంలా నిలుస్తోంది. కేవలం పందొమ్మిది వేల రూపాయల కోసం ఒక మనిషి తన రక్తసంబంధీకురాలి సమాధిని తవ్వి, కుళ్లిపోయిన అస్థిపంజరాన్ని బహిరంగంగా ప్రదర్శించాల్సి వచ్చిందంటే, మన బ్యాంకింగ్ నిబంధనలు, ప్రభుత్వ యంత్రాంగం ఎంతటి సంవేదనా రాహిత్యంతో ఉన్నాయో స్పష్టమవుతోంది. ఇది కేవలం ఒక పేదవాడి ఆవేదన మాత్రమే కాదు, ప్రజాస్వామ్య వ్యవస్థల్లో మనిషి కంటే కాగితానికే ప్రాముఖ్యత పెరిగిపోయిందనే చేదు నిజానికి పరాకాష్ఠ.

ప్రస్తుత బ్యాంకింగ్ వ్యవస్థలో భద్రత పేరుతో రూపొందించిన నిబంధనలు మోసాలను అరికట్టడానికి ఉద్దేశించినవే అయినప్పటికీ, అవి క్షేత్రస్థాయిలో సామాన్యులకు ఉరితాళ్లుగా మారుతున్నాయి. జీతూ ముండా అనే నిరక్షరాస్యుడు తన సోదరి మరణాన్ని ధ్రువీకరించడానికి బ్యాంకు అధికారుల చుట్టూ తిరిగినప్పుడు, వారికి కేవలం 'డెత్ సర్టిఫికేట్' మాత్రమే కనిపించింది తప్ప, ఎదురుగా ఉన్న మనిషి కళ్లలోని నిజాయితీ గానీ, అతని పేదరికం గానీ కనిపించలేదు. గిరిజన ప్రాంతాల్లో మరణ ధ్రువీకరణ పత్రాలు పొందడం ఎంత కష్టంతో కూడుకున్నదో, అక్కడ వ్యవస్థలు ఎంత మందకొడిగా సాగుతాయో అధికారులకు తెలియనిది కాదు. అయినప్పటికీ, నిబంధనలను సాకుగా చూపి అతడిని పదేపదే తిప్పించుకోవడం ద్వారా వారు అతనిని మానసిక క్షోభకు గురిచేశారు.

లక్షల కోట్ల రూపాయల రుణాలను ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయే సంపన్నుల విషయంలో మృదువుగా వ్యవహరించే బ్యాంకింగ్ వ్యవస్థలు, ఒక నిరుపేద తన సొంత డబ్బు కోసం వస్తే మాత్రం కఠినమైన నిబంధనలను అస్త్రాలుగా ప్రయోగిస్తాయి. ఇక్కడ విచిత్రం ఏమిటంటే, అధికారులు కోరినట్టుగా ఆ వ్యక్తి అస్థిపంజరాన్ని తీసుకువచ్చిన తర్వాతే యంత్రాంగం కదిలింది. అంటే, ఒక సామాన్యుడు తన గోడును వినిపించుకోవడానికి ఇంతటి విపరీతమైన చర్యకు పాల్పడితే తప్ప వ్యవస్థలకు కనువిప్పు కలగదా అనే ప్రశ్న ఇక్కడ ఉదయిస్తుంది. అస్థిపంజరం బ్యాంకు గడప తొక్కిన తర్వాత నిమిషాల వ్యవధిలో పరిష్కారమైన సమస్య, అంతకుముందు నెలల తరబడి ఎందుకు పెండింగ్‌లో ఉందో ఎవరూ సమాధానం చెప్పలేని పరిస్థితి.

ప్రభుత్వాలు ప్రవేశపెట్టే పథకాలు, నిబంధనలు ప్రజల సౌకర్యం కోసం ఉండాలి కానీ వారిని వేధించడానికి కావు. ఒక వ్యక్తి మరణిస్తే ఆ వివరాలు ఆటోమేటిక్‌గా ప్రభుత్వ రికార్డుల్లో నమోదై, బ్యాంకులకు సమాచారం వెళ్లేలా సాంకేతికతను అభివృద్ధి చేశామని చెప్పుకుంటున్న తరుణంలో ఇలాంటి సంఘటనలు జరగడం సిగ్గుచేటు. క్షేత్రస్థాయిలో ఉన్న రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తమ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించి ఉంటే, జీతూ ముండాకు సకాలంలో మరణ ధ్రువీకరణ పత్రం అంది ఉండేది. ప్రభుత్వ యంత్రాంగంలో ఉన్న సమన్వయ లోపం పేదవాడిని అనాథగా మార్చేసింది.

అధికారులకు కేవలం చట్టాల మీద, సెక్షన్ల మీద ఉన్న అవగాహన మానవత్వం మీద లేకపోవడమే అసలు సమస్య. ఒక గిరిజన పల్లె నుండి వచ్చిన వ్యక్తికి డెత్ సర్టిఫికేట్ లేదా లీగల్ హెయిర్ సర్టిఫికేట్ వంటి సాంకేతిక పదాలు అర్థం కావని గ్రహించలేకపోవడం వారి అజ్ఞానానికి నిదర్శనం. ఆ అస్థిపంజరం కేవలం ఒక ఎముకల గూడు కాదు, అది మన వ్యవస్థలలోని కుళ్లిపోయిన ఆలోచనా ధోరణికి ప్రతిరూపం. నిబంధనల పేరుతో సామాన్యుడిని అవమానించడం మానుకొని, సేవలో మానవీయ కోణాన్ని జోడించినప్పుడే ఇలాంటి ఘటనలకు స్వస్తి పలకగలం.

చివరగా, ఈ సంఘటన బ్యాంకు అధికారులకు, ప్రభుత్వానికి ఒక గట్టి హెచ్చరిక కావాలి. నిబంధనలు అనేవి మార్గదర్శకాలుగా ఉండాలి తప్ప, అవి మనిషి ప్రాణం కంటే, గౌరవం కంటే గొప్పవి కావు. సాంకేతికత ఎంత పెరిగి నా, వ్యవస్థలు ఎంత ఆధునీకరించబడినా.. అట్టడుగున ఉన్న మనిషి కన్నీటిని తుడవలేని ఏ సంస్కరణ అయినా విఫలమైనట్టే లెక్క. ఆ అస్థిపంజరం రేపిన ప్రకంపనలు భవిష్యత్తులో నైనా నిబంధనల కంటే మానవత్వానికే పెద్దపీట వేసేలా వ్యవస్థలను మారుస్తాయని ఆశిద్దాం. సామాన్యుడి ఆవేదన సమాధిని దాటి రోడ్డు మీదకు వచ్చే వరకు వేచి చూడకుండా, ముందుగానే స్పందించే బాధ్యతాయుతమైన యంత్రాంగం నేటి అవసరం.

వెంకగారి భూమయ్య,
9848559863

# సహేతుక విమర్శలేవి?

లేఖ

ఇటీవల తరచుగా రాజకీయ నాయకులు పరస్పరం చేసుకునే విమర్శలలో అసభ్య పదజాలం కన్పిస్తుంది.చట్ట సభల్లో కూడా ఇదే ధోరణి కన్పిస్తుంది.ఇందువల్ల ప్రజా సమస్యలపై సరైన చర్చ జరగడం లేదు. ఒకప్పుడు విమర్శలు చేసేవారు హుందాగా,నిర్మాణాత్మకంగా చేసేవారు.అందులో ఎక్కడా వ్యక్తిగత దూషణలు ఉండేవి కావు.విమర్శలు కూడా వాస్తవానికి దగ్గరగా ఉండేవి. పాలక వర్గాలు తమ లోపాలని తెలుసుకోవడానికి విమర్శలు ఉపయోగపడేవి.

దేశ ప్రథమ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూఎటువంటి విమర్శలనైనా నవ్వుతూ స్వీకరించేవారు. ఆంగ్ల సాహిత్యంలో విమర్శ అంటే మంచి, చెడుని తెలియజేయడమనే అర్థంలో విమర్శకులు వాడతారు.

అంబేద్కర్, గాంధీలు కూడా ఆయా విషయాలపై సిద్ధాంతం రీత్యా భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారే తప్ప, వారి మధ్య ఎటువంటి అసూయ, ద్వేషాలు ఉండేవి కావు. పైగా గాంధీ విషయంలో అంబేద్కర్ చాలాసార్లు విశాల దృక్పథంతో ఆలోచన చేశారు.

ఇప్పుడు సామాన్యులు మొదలుకొని రాజకీయ నాయకులు వరకు అనేకమంది వారు చేసే విమర్శలలో ఎక్కువగా వ్యక్తిగత విషయాలే ఉంటున్నాయి. పరస్పర దూషణలు కన్పిస్తున్నాయి.. మీడియా కూడా ఇటువంటి విషయాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుంది. ఇటువంటి వాటి వల్ల ప్రజలు కూడా భావోద్వేగాలకు గురౌతున్నారు. తమ తమ నాయకులను గుడ్డిగా అనుసరించడం వల్ల ఇటువంటి ధోరణులు సమాజంలో ఎక్కువగా పెరుగుతున్నాయి.

పదేపదే విమర్శించే గుణం ఉన్నవారికి ఒక ప్రధాన లోపం ఉంటుంది. తమకు నచ్చని వారు ఎంత మంచి పని చేసి నా, అందులో లోపాలు వెతుకుతారు. కరోనా కాలంలో కేరళలో అధికార, ప్రతిపక్ష నాయకులు కల్సి ప్రజలకు ఏ విధంగా మేలు చేయాలనే విషయాన్ని చర్చించారు. ఇటువంటి ధోరణి మిగతా ప్రాంతాల్లో కనిపించడం లేదు. ప్రజాస్వామ్యంలో ఎవరు ఎవరినైనా విధానపరంగా విమర్శించవచ్చు. లోపాలను తెలియజేయవచ్చు. వ్యక్తిగత దూషణల వల్ల లాభం లేకపోగా, అది ప్రజలకు మరింత నష్టం కల్గిస్తుంది. అదేపనిగా విమర్శించే వారిని చట్టపరంగా ఎదుర్కోవాలే తప్ప, వారిపై దాడులకు దిగటం కూడా సరికాదు. సద్విమర్శలని తీసుకునే గుణం ఏ స్థాయిలో ఉన్నవారికైనా ఉండాలి.

ఎం.రాం ప్రదీప్, 9492712836



## బెంగాల్‌లో బిజెపి మొదటి నుంచి కుట్రపూరిత రాజకీయాలు చేసింది

కేరళం ఫలితాలు – టిపిసిసి అధ్యక్షుడు
బి.మహేష్ కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పశ్చిమ బెంగాల్‌లో బిజెపి మొదటి నుంచి ఒక కుట్ర పూరిత రాజకీయాలు చేసిందని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. 'సర్' పేరుతో టిఎంసి అనుకూల ఓట్లను తొలగించడం, వ్యవస్థలను బిజెపి దుర్వినియోగం చేయడం లాంటి చర్యలు ప్రజాస్వామ్య విరుద్ధంగా ఒక దుర్మార్గపు రాజకీయాలతో అధికారంలోకి వచ్చేలా కుట్రలు చేశారని తెలిపారు. తాజాగా వెలువడిన ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలను సమీక్షించుకుని ఇండియా కూటమిని మరింత బలోపేతం అయ్యేందుకు, అంతా కలిసి బిజెపి కుట్ర రాజకీయాలపై పోరాటం చేసేందుకు ప్రణాళికలు చేయాలని సూచించారు. తమిళనాడులో ప్రజలు విజయ్ నేతృత్వంలోని టివికె పార్టీని గెలిపించడం పట్ల విజయ్‌కి ఆయన అభినందనలు తెలిపారు. ఇదిలా ఉండగా, కేరళం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని యుడిఎఫ్ ఘన విజయాన్ని సాధించడం పట్ల మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్, ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కేరళంలో ఉన్న 140 సీట్లలో దాదాపు 100 సీట్లలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం చరిత్రాత్మక విజయమని ఆయన పేర్కొన్నారు. కేరళంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు పలువురు మంత్రులు నాయకులు ప్రచారం నిర్వహించడం, తెలంగాణలో పాలన చూసి ఓట్లు వేయాలని కోరడం చాలా ప్రభావం చూపించిందని ఆయన తెలిపారు. కేరళం రాష్ట్రంలో విజయం తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి మరింత బలాన్ని, మరోసారి విజయం సాధిస్తామన్న నమ్మకాన్ని కలిగించిందన్నారు. కేరళంలో కాంగ్రెస్ విజయం సందర్భంగా హైదరాబాద్‌లోని టిపిసిసి కార్యాలయం గాంధీభవన్‌లో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు.

### ఐదు రాష్ట్రాల ఫలితాలు

# దేశ రాజకీయాలకు స్పష్టమైన సందేశం

మంత్రి శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అయిదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు దేశ రాజకీయాల్లో స్పష్టమైన మార్గదర్శకత్వాన్ని చూపించాయని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. అధికారం ఉన్నా, లేకున్నా కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ రాజ్యాంగబద్ధ విలువల పరిరక్షణకే కట్టుబడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. కేరళంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ కూటమి సాధించిన విజయం ప్రజాస్వామ్య విలువలపై ప్రజల విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. విద్వేష రాజకీయాలపై వివేకం గెలిచిందని, అభివృద్ధి, ఐక్యత, లౌకికతకు ప్రజలు పెద్దపీట వేసినట్లు ఈ ఫలితాలు సూచిస్తున్నాయని చెప్పారు. కేరళ ప్రజలు దేశానికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఇతర రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్ శ్రేణులు ప్రదర్శించిన పోరాట పటిమ అభినందనీయమని, పార్టీ విజయానికి కృషి చేసిన ప్రతి కార్యకర్తకు, మద్దతు తెలిపిన ప్రతి ఓటరుకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ సిద్ధాంతం మనుషులను కలపడం మాత్రమేనని, ప్రజల హితమే పార్టీ లక్ష్యమని ఆయన అన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో 'ప్రేమ–సామాజిక న్యాయం' మార్గమే సరైనదని కేరళ తీర్పు బలపరిచిందని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతామని చెప్పారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో మళ్లీ అధికారంలోకి వస్తామని విశ్వాసం వ్యక్తం చేసిన మంత్రి, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ దశలవారీగా అమలు చేస్తామని తెలిపారు. 2029లో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమి ఘన విజయం సాధించి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.



## యుపిఎస్‌సి అభ్యర్థులకు వరంగా 'ప్రెప్‌మంకీ' యాప్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు సాంకేతిక సహకారం అందించేందుకు రూపొందించిన కృత్రిమ మేధస్సు ఆధారిత 'ప్రెప్‌మంకీ' యాప్‌ను తెలంగాణ ఐటి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఘనంగా ప్రారంభించారు. యుపిఎస్‌సి సహా వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఈ యాప్ సమగ్ర మార్గదర్శకంగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాంకేతికతను విద్యా రంగంతో అనుసంధానం చేయడం ద్వారా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు కూడా సమాన అవకాశాలు కల్పించవచ్చని తెలిపారు.
సరైన మార్గదర్శకత్వం ఉంటే ప్రతిభావంతులైన యువత ఉన్నత స్థానాలను అధిరోహించగలరని అన్నారు. డిజిటల్ విద్యా విప్లవంలో భాగంగా ఇలాంటి వినూత్న యాప్‌లు మరింతగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. 'ప్రెప్ మంకీ' వ్యవస్థాపక బృందంలో తలశిల రంజిత్, సుధాకర్, రామ్ అభినవ్ తేజ్, పావని, ఆకాశ్, మేఘనా రెడ్డి ఉన్నారు.

# ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం

మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులుపడకుండా చూడాలని ఇందుకు అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. సోమవారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుండి ఆయన జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కలెక్టర్లు ఇతర ఉన్నతాధికారులతో సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరిలతో కలసి అత్యవసర వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర,రవాణా శాఖా కమిషనర్ కె.ఇలంభర్తీ, కార్మిక ,ఉపాధి, విపత్తు నిర్వహణ శాఖా కార్యదర్శి హరిచందన తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 1.84లక్షల మంది రైతుల నుండి 14.80లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు ఆయన వెల్లడించారు. అంతేగాకుండా కొనుగోలు చేసిన ధాన్యానికి గాను ఇప్పటి వరకు రైతుల ఖాతాలో రూ.2001.96 కోట్లు జమ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. నల్లగొండ, నిజామాబాద్ జిల్లాలో ఇబ్బడిముబ్బడిగా ధాన్యం వస్తున్నందున అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అయితే రాత్రి పడిన అకాల వర్షాలతో సూర్యాపేట, ఖమ్మం, మహబూబాబాద్ వంటి జిల్లాలో 299 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసి పోయినట్లు ప్రభుత్వ దృష్టికి సమాచారం వచ్చిందని,ఈ ధాన్యాన్ని తక్షణమే మిల్లులకు తరలించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. రాబోయే మూడు రోజులు పాటు అకాల వర్షాలు సంభవించే అవకాశం ఉందంటూ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చేసిన సూచనను అధికారులు తీవ్రంగా పరిగణనలోకి తీసుకుని వాతావరణ పరిస్థితుల కనుగుణంగా కొనుగోలు ప్రక్రియను కొనసాగించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

## అకాల వర్షాలతో ధాన్యం తడవకుండా రక్షణ చర్యలు తీసుకోవాలి

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అకాల వర్షాల నేపథ్యంలో కొనుగోలు సెంటర్లలో ధాన్యం, మొక్కజొన్న, జొన్న పంటలు తడవకుండా తక్షణ రక్షణ చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డిమాండ్ చేసింది. అకాల వర్షాలకు ఒక వేళ ధాన్యం తడిసినా పూర్తి మద్దతు ధరకే కొనుగోలు చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు, ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు ఆలస్యం కావడంతో ఎక్కడికక్కడ కొనుగోలు కేంద్రాలలో కుప్పలుగా పోసుకుని కాంట ఎప్పుడు వేస్తారా అని ఎదురుచూస్తున్న రైతులు ఎండలలో అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ఆదివారం నుంచి వారం రోజులపాటు వర్షాలు కురుస్తాయనే వాతావరణ కేంద్రం హెచ్చరిక నేపథ్యంలో కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని రైతులు ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించి నిరసనలు తెలియజేస్తున్న అంశాన్ని గమనంలోకి తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో వర్షానికి తడవకుండా సదుపాయాలను ఏర్పాటు చేయడంతో పాటు కొనుగోలు చేసిన ధాన్యానికి రైతులకు వెంటనే డబ్బులను వారి బ్యాంక్ ఖాతాలలో జమ చేయాలని డిమాండ్ చేశారు.

## రాష్ట్ర వ్యాప్తంగా 8 నుంచి ఇంటర్మీడియట్ అడ్మిషన్ల ప్రక్రియ షురూ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ 2026–27 విద్యా సంవత్సరం అడ్మిషన్ల ప్రక్రియను ఈనెల 8వ తేదీ నుంచి ప్రారంభించనున్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డ్ సోమవారం అడ్మిషన్ల తొలి షెడ్యూల్‌ను విడుదల చేసింది. అడ్మిషన్ల కోసం కళాశాలలు ఎలాంటి రాత పరీక్షలు నిర్వహించకూడదని, కేవలం మెరిట్ (జిపిఎ) ఆధారంగానే సీట్లు కేటాయించాలని బోర్డ్ స్పష్టం చేసింది. ఈసారి కొత్తగా యాంటీ డ్రగ్ అఫిడవిట్‌ను సమర్పించాలనే నిబంధనల విధించారు. అడ్మిషన్ సమయంలో విద్యార్థులు, తల్లిదండ్రులు ఇద్దరూ తప్పనిసరిగా 'యాంటీ డ్రగ్ అఫిడవిట్'ను సమర్పించాల్సి ఉంటుంది. పదో తరగతి పరీక్ష ఫలితాలు వచ్చిన తర్వాత ఇంటర్‌నెట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న మార్కుల జాబితా ఆధారంగా విద్యార్థులకు తాత్కాలిక ప్రవేశాలు కల్పించనున్నారు. ఒరిజినల్ సర్టిఫికేట్లు సమర్పించిన తర్వాత సీటును ఖరారు చేస్తారు.ఇంటర్‌లో చేరే ప్రతి విద్యార్థి కూడా తప్పనిసరిగా తమ ఆధార్ నంబర్‌ను నమోదు చేయాలి. జోగిని పిల్లల విషయంలో, వారి క్వాలిఫైయింగ్ పరీక్షా రికార్డుల్లో ఉన్నట్టుగా తండ్రి పేరుకు బదులుగా తల్లి పేరును నమోదు చేయాలని ప్రిన్సి పాల్స్‌ను సూచించింది. చదువు మధ్యలో గ్యాప్ వచ్చిన విద్యార్థులు అడ్మిషన్ పొందాలంటే, స్థానిక తహసీల్దార్ నుంచి నివాస ధ్రువీకరణ పత్రం లేదా లోకల్ క్యాండిడేట్ సర్టిఫికేట్ పొందాల్సి ఉంటుంది. విదేశీయులు లేదా ఓవర్సీస్ సిటీజన్ ఆఫ్ ఇండియా విద్యార్థులు చేరినట్లయితే, అడ్మిషన్ పొందిన 24 గంటల లోపు సబ్‌మిట్ చేసిన ఫారమ్ II కాపీని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తప్పనిసరిగా పంపిస్తారు. విద్యార్థినుల భద్రత కోసం కళాశాల ప్రిన్సిపాల్స్ తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని బోర్డు ఆదేశించింది. కేవలం ఇంటర్ బోర్డు గుర్తించిన కళాశాలల్లోనే ప్రవేశాలు పొందాలని విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఇంటర్ బోర్డ్ సూచించింది. గుర్తింపు పొందిన కళాశాలల జాబితాను www.tgbie.cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

**రిజర్వేషన్ల అమలు :**
ఇంటర్ సీట్లలో ఎస్‌సిలకు 15 శాతం, ఎస్‌టిలకు 10 శాతం, బిసిలకు 29 శాతం( బిసి ఎ7, బి10,సి1,డి7, ఈ4 శాతం), శారీరక వికలాంగులు 5 శాతం, ఎన్‌సిసి, స్పోర్ట్స్‌కు 5 శాతం, ఎక్స్‌సర్వీస్‌మెన్, డిఫెన్స్‌కుచెందినవారికి 3 శాతం, ఈడబ్ల్యూఎస్ లకు 10 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని ఇంటర్‌బోర్డ్ స్పష్టం చేసింది. బాలికల కోసం ప్రత్యేకంగా 33.33 శాతం సీట్లను కేటాయించారు.

**ప్రతిసెక్షన్‌లో కేవలం 88 మందికే అడ్మిషన్లు..**
ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ కళాశాలలు కేవలం తమకు మంజూరైన సెక్షన్లలో మాత్రమే ప్రవేశాలు కల్పించాలని, ప్రతి సెక్షన్‌కు గరిష్టంగా 88 మంది విద్యార్థులకు మించి అడ్మిషన్లు ఇవ్వకూడదని ఇంటర్ బోర్డ్ స్పష్టం చేసింది. అదనపు సెక్షన్లలో ప్రవేశాలు కల్పించాలంటే ముందుగా బోర్డు నుంచి అనుమతి పొందాలని, లేదంటే ఆ కళాశాల గుర్తింపును రద్దు చేసే అవకాశం ఉంటుందని హెచ్చరించింది. అలాగే విద్యార్థులను ఆకర్షించే విధంగా తప్పుడు వాగ్దానాలతో ప్రకటనలు ఇచ్చే కళాశాలలపై 'ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ యాక్ట్ 1997' ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించింది.



## 8న రైల్ నిలయం దిగ్బంధనం

వలి ఉల్లా ఖాద్రీ, ధర్మేంద్ర

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మానవ వనరుల హేతుబద్ధీకరణ పేరుతో రైల్వేలో 29,608 ఉద్యోగాలు (2 శాతం) ఉద్యోగాలను తగ్గించే ప్రయత్నాన్ని కేంద్ర ప్రభుత్వం, రైల్వేశాఖ తక్షణమే విరమించుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు వలిఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎన్.శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఈ నిర్ణయాన్ని ప్రతిఘటించేందుకు మే 5 నుండి 7వ తేదీ వరకు ప్రధాని మోదీతోపాటు కేంద్ర రైల్వే శాఖ మంత్రికి పోస్ట్ కార్డు, ఈ మెయిల్స్ ఉద్యమం, 8న హైదరాబాద్‌లోని రైల్ నిలయాన్ని దిగ్బందించనున్నట్లు వారు ప్రకటించారు. భారత రైల్వే బోర్డు గతనెల 24న విడుదల చేసిన హేతుబద్ధీకరణ పేరుతో రైల్వేలో 2 శాతం ఉద్యోగాలను తగ్గిస్తూ విడుదల చేసిన సర్క్యులర్‌ను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని సత్య నారాయణ రెడ్డి భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. సమావేశంలో కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ భవిష్యత్ కార్యక్రమాల వాల్ పోస్టర్‌ను వారు విడుదల చేశారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నాయకులు అరుణ్, మనోజ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## తెలంగాణలో వాహన్ సేవలు పునరుద్ధరణ

ఇప్పటివరకు 89,722 వాహనాల రిజిస్ట్రేషన్లు పూర్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా వాహన సేవలకు సంబంధించిన వాహన్ పోర్టల్ సాంకేతిక సమస్యలతో కొంతకాలంగా అంతరాయం ఏర్పడిన నేపథ్యంలో అధికారులు తక్షణ చర్యలు తీసుకుని సేవలను పునరుద్ధరించారు. నేషనల్ ఇన్ఫార్మేటిక్స్ సెంటర్(ఎన్ఐసి) ఆధ్వర్యంలో సమస్యను పరిష్కరించి, ప్రజలకు ఇబ్బంది లేకుండా సేవలను తిరిగి అందుబాటులోకి తీసుకువచ్చినట్లు రవాణా శాఖ కమిషనర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3వ తేదీ వరకు వాహన్ పోర్టల్ ద్వారా మొత్తం 89,722 వాహన రిజిస్ట్రేషన్ (టిఆర్) ప్రక్రియలు విజయవంతంగా పూర్తయ్యాయనీ, రాష్ట్రవ్యాప్తంగా రవాణా శాఖ కార్యాలయాల్లో సేవలు సాధారణ స్థితికి చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. సమస్య తలెత్తిన సమయంలో 3,223 ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ సేవలు నిలిచిపోయినప్పటికీ, ప్రస్తుతం వాటిని వేగంగా పరిష్కరిస్తూ ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. అదేవిధంగా సుమారు 58,005 వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియలు కూడా పూర్తయ్యాయనీ తెలిపారు. హెచ్ఎస్ఆర్‌పి (హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు) అమలులో భాగంగా వాహన యజమానులు ఎదుర్కొన్న ఇబ్బందులను కూడా అధిగమించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకుండా వాహన్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చుతున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ప్రజలు ఎవైనా ఇబ్బందులు ఎదుర్కొంటే సమీప రవాణా కార్యాలయాలను సంప్రదించాలని సూచించారు.

# సంక్షేమ పథకాలకు ప్రభుత్వ సహకారం

కేంద్రసామాజిక న్యాయం,సాధికారత శాఖ కార్యదర్శి సుధాంశ్ పంత్ హామీ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎస్‌సి, ఎస్‌టి, బిసి, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్ వర్గాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని కార్యక్రమాలకు పూర్తి సహాయ సహకారాలను అందిస్తామని సామాజిక న్యాయం, సాధికారత శాఖ కార్యదర్శి సుధాంశ్ పంత్ హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు భేష్ అంటూ కితాబు ఇచ్చారు. సోమవారం హైదరాబాద్‌లో పర్యటించిన సుధాంశ్ పంత్ రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ కులాల అభివృద్ధి, బిసి సంక్షేమం దివ్యాంగుల సంక్షేమం, ట్రాన్స్‌జెండర్ సంక్షేమం వంటి రంగాల్లో అమలు చేస్తున్న పలు పథకాలు, కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమీక్షించారు. అంతకు ముందు సుధాంశ్ పంత్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అమలవుతున్న ఎస్‌సి అభివృద్ధి, దివ్యాంగుల సాధికారత, ట్రాన్స్‌జెండర్ సంక్షేమం, వృద్ధుల సంరక్షణ వంటి పథకాలపై మంత్రి సమగ్ర నివేదికను సమర్పించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు, వృద్ధుల సమగ్ర అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ప్రభుత్వం కట్టుదిట్టంగా పనిచేస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలకు కేంద్రం పూర్తి సహకారం అందించాలని మంత్రి కోరగా, సుధాంశ్ పంత్ సానుకూలంగా స్పందించారు. రాష్ట్రం ప్రతిపాదించే ప్రతి వినూత్న పథకానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మసాబ్ ట్యాంక్‌లోని డే కేర్ సెంటర్, ఓల్డ్ ఏజ్ హోమ్, డీఅడిక్షన్ కేంద్రాలను సందర్శించి అక్కడి సదుపాయాలను పరిశీలించిన సుధాంశ్ పంత్ వాటి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. అవసరమైతే కేంద్రం నుంచి మరిన్ని నిధులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి సభ్య సాచి ఘోష్, దివ్యాంగుల సంక్షేమ శాఖ కమిషనర్ అనిత రామచంద్రన్, ఎస్‌సిడిడి విసి అండ్ ఎండి హనుమంత్ నాయక్, డైరెక్టర్ శ్రీధర్, దివ్యాంగుల శాఖ డైరెక్టర్ శైలజ ,టిజిఎస్‌డబ్ల్యూఆర్ఇఐఎస్ జాయింట్ సెక్రెటరీ సక్రు నాయక్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# నకిలీ నోట్ల చలామణి ముఠా అరెస్టు


వివరాలు వెల్లడించిన ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** నకిలీ నోట్లను తయారుచేసి (ప్రింట్ తీసి) మార్కెట్లో చలామణి చేస్తున్న ముగ్గురు వ్యక్తులను, తెలంగాణలో తక్కువ డబ్బులకు, ఎక్కువ డబ్బులను 1:3లో తయారుచేసి ఇస్తామని చెప్పి కోరిన వారికి రూపాయలు 500 నోట్ల పరిమాణంలో నల్ల కాగితలను ఇస్తూ మోసాగిస్తున్న ఐదుగురు వ్యక్తులను వరంగల్ టాస్క్‌ఫోర్స్, నర్సంపేట పోలీసులు సంయుక్తంగా కలిసి అరెస్టు చేశారు. అరెస్టు చేసిన నిందితుల నుండి నకిలీ నోట్లను, అసలు 1,48,000 రూపాయలను, సుమారు 28 లక్షల విలువగల ల్యాప్ టాప్ లు, ప్రింటర్స్, 13 సెల్‌ఫోన్లు, రెండు కార్లులను స్వాధీన పరుచుకున్నారు. పోలీసులు అరెస్టు చేసిన నిందితులలో శాగంటి కిరణ్, నర్సంపేట, నీరటి శివ, నర్సంపేట, నీరటి రంజిత్, నర్సంపేట, గుడికందుల రవి,నర్సంపేట, పోరిక రాజ్‌కుమార్ అలియాస్ రాజు, ఘన్ పూర్ (ములుగు), తనమాల రాజశేఖర్, వేంసూరు, ఖమ్మం, ముదురుకోల యాకంబరం, తాతానగర్, భువనగిరి,చేను సాయికిరణ్, కారకగూడెం(మండలం), కొత్తగూడెం కు చెందినవారిగా పోలీసులు గుర్తించారు.ఈ అరెస్టుకు సంబంధించి ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ వివరాలను వెల్లడిస్తూ, నర్సంపేటకు చెందిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగ వారు అసలు 100 రూపాయలు నోట్లను ల్యాప్ టాప్ మరియు ప్రింటర్ ద్వారా కలర్ ప్రింట్ తీసి మార్కెట్లో అసలు నోట్లుగా చలామణి చేస్తున్నారని, మిగిలిన ఐదుగురు వ్యక్తులను విచారించగ వారు తెలంగాణ రాష్ట్రంలో తక్కువ డబ్బులకు, ఎక్కువ డబ్బులను 1:3లో తయారుచేసి ఇస్తామని చెప్పి వారు బాధితులను నమ్మించడానికి, అసలైన 500 రూపాయల కరెన్సీ నోట్లను అయోడిన్ టింక్చర్ ద్రావణంలో ముంచడం ద్వారా వాటిని నల్లగా మార్చి, ఆపై హైపో (సోడియం థయోసల్ఫేట్) ద్రావణంలో ముంచగ, రసాయన చర్య ఫలితంగా వాటి అసలు రూపాన్ని తిరిగి వచ్చేలా చేసి, వారి ప్రణాళిక ప్రకారం, వారు నల్లటి రంగు కాగితాలను కట్టలుగా కట్టి, కోరినవారికి ఇచ్చి, వారు పైన చెప్పిన విదంగా చేసినట్లయితే, అవి అసలు నోట్లలాగా మారుతాయని నమ్మించి, వారి వద్ద నుండి అసలు నోట్లు తీసుకొని పరారు అవుతారు. ఇదే విధంగా వారు గతంలో ఘనపూర్ (ములుగు), మోండా మార్కెట్ (సికింద్రాబాద్), వెంసూర్, కొత్తగూడెం, కేయూసి, సుబేదారీ పరిధిలో మోసం చేయగా వారిపై కేసులు నమోదు చేసి, జైల్ కు పంపడం జరిగింది. ఈ మద్యకాలంలో వారు తెలంగాణలో చత్రినాక (హైదరాబాద్), నర్సంపేటలలో మోసం చేసినట్లు తెలిపినారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కబరిచిన టాస్క్‌ఫోర్స్ ఏసిపి మదుసూధన్, నర్సంపేట ఏసిపి రవీందర్ రెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఇన్స్పెక్టర్ బాబులాల్, నర్సంపేట ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఎఎఓ సల్మాన్ పాషా, టాస్క్‌ఫోర్స్, నర్సంపేట సిబ్బందిని సిపి అభినందించారు.

## బిసి కులాలలో అవమానకర పదాలను తొలగించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

హర్షం వ్యక్తం చేసిన రాష్ట్ర బిసి కమిషన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో వెనుకబడిన తరగతుల సంక్షేమానికి సంబంధించి రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుందని, బిసి కమిషన్ చేసిన సిఫారసులను కేబినెట్ యథాతథంగా ఆమోదించిందని బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా కులాల పేర్లలో ఉన్న అవమానకర పదాలను తొలగిస్తూ, గౌరవప్రదమైన పేర్లను చేర్చే ప్రతిపాదనలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. దొమ్మర కులాన్ని 'గడవంశీయ'గా, బుడబుక్కల కులాన్ని 'శివక్షత్రియ'గా మార్చడాన్ని ఆమోదించగా, పిచ్చిగుంట్ల, శూద్ర వంటి పదాలను బిసి జాబితా నుంచి తొలగించనున్నట్లు తెలిపారు. అలాగే చాకలి కులానికి 'ధోబి', మేర కులానికి 'మేరు' వంటి పర్యాయపదాలను చేర్చే నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. ఇక సంచార జాతుల (డిఎన్‌డిలు) గుర్తింపుపై కూడా ప్రభుత్వం కీలక ముందడుగు వేసిందని, బిసి ఎ గ్రూప్‌లోని 49 కులాలు, ఇ గ్రూప్‌లోని 2 కులాలను సంచార జాతులుగా గుర్తిస్తూ, వారికి ప్రత్యేక ధృవీకరణ పత్రాలు జారీ చేయాలని నిర్ణయించిందన్నారు. ఈ సర్టిఫికెట్ల జారీ బాధ్యతను రెవెన్యూ డివిజనల్ అధికారులకు అప్పగించాలని సూచించిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సీడ్ పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు ప్రయోజనాలు అందేలా చర్యలు చేపట్టనున్నట్లు వివరించారు. బిసి కమిషన్ సిఫారసులను ఆమోదించినందుకు కమిషన్ చైర్మన్ నిరంజన్‌తో పాటు సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. మొత్తం మీద బిసిల గౌరవం, సంచార జాతుల అభివృద్ధి దిశగా ఇది ఒక కీలక అడుగుగా భావిస్తున్నారు.

## ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి

తెలంగాణ అదనపు సిఇఓ డాక్టర్ వాసం వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డాక్టర్ వాసం వెంకటేశ్వర్లు అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగనున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఓటర్ల జాబితా సవరణ, మ్యాపింగ్ ప్రక్రియపై వెంకటేశ్వర్లు సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్‌లోని సిఈఓ కార్యాలయం నుండి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆరు జిల్లాలకు చెందిన 28 నియోజకవర్గాల ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలతో ఆయన మాట్లాడారు. హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి, నిజామాబాద్, ఖమ్మం జిల్లాల్లో ఓటర్ల మ్యాపింగ్ 50 శాతం కంటే తక్కువగా ఉన్న నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. 2025 ఓటర్ల జాబితాలోని అర్హులైన ఓటర్లందరినీ 2002 ఓటర్ల జాబితాతో తప్పనిసరిగా మ్యాపింగ్ చేయాలని అదనపు సిఇఓ ఆదేశించారు. బూత్ స్థాయి అధికారులు (బిఎల్‌ఓలు) ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించాలని, ఈ ప్రక్రియను అత్యంత వేగంగా పూర్తి చేయాలని సూచించారు. నిర్దేశించిన కార్యాచరణ ప్రణాళిక ప్రకారం రోజువారీ లక్ష్యాలను చేరుకుంటూ మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని ఏఈఆర్‌ఓలను ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సిఈఓ, ఎస్‌టిఎస్‌ఓ, ప్రాజెక్ట్ మేనేజర్, ఇతర సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్**
**సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, మల్కాజ్‌గిరి జోన్, ఎంఎంసి.**

క్ర.సం.1, NIT No. 07/MMC/2026-27, తేది: 02.05.2026, **పని పరిధి:** "ఎంఎంసి, మల్కాజ్‌గిరి జోన్, మౌలాలి సర్కిల్-04 పరిధిలోని వినాయక్‌నగర్ వార్డ్-185లో గల "బండ చెరువు" సమగ్ర అభివృద్ధి మరియు పునరుద్ధరణ పనుల నిమిత్తం డిజైన్లు, ప్రణాళికలు, అంచనాలు, 3D వాక్‌త్రూ, BoQలు, టెండర్ పత్రాలు మరియు డిజైన్ పర్యవేక్షణతో కూడిన DPR (వివరమైన ప్రాజెక్ట్ నివేదిక) తయారీ కోసం ఒక కన్సల్టెంట్‌ను నియమించడానికి ప్రతిపాదనల ఆహ్వానం (RFP)." , **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** ఆర్ఎఫ్‌పి బిడ్ దాఖలు ప్రారంభ తేది & సమయం: 04.05.2026 మ.01.00గం.లకు, బిడ్ దాఖలుకు ఆఖరి తేది : 11.05.2026 మ.01.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** సూపరింటెండింగ్ ఇంజనీర్, మల్కాజ్‌గిరి జోన్, ఎంఎంసి. సెల్ నెం. 9154796465.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, మల్కాజ్‌గిరి జోన్, ఎంఎంసి.
DIPR R.O. No. : 1864-PP/CL/ADVT/2026-27, Date: 04-05-2026

**నగర పాలక సంస్థ – నిజామాబాద్**
వేలం ప్రకటన (మూడవ నోటీసు)
నెం: NMC/REV/TMS/2379,2380/2026 తేది: 30/04/2026

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా 2026-2027 (అనగా 15.05.2026 నుండి 31.04.2027) సంవత్సరమునకు తేది: 11.05.2026 నాడు తైబజార్, స్లాటర్ హౌస్(మేకల వధశాల) బహిరంగ వేలం వేయబడును. కావున ఆసక్తి కలవారు తేది: 08.05.2026 సాయంత్రం 5.00 గంటలోపు రూ.551/- కాస్ట్ అఫ్ టెండర్ షెడ్యూల్ క్రింద సొమ్ము చెల్లించి రసీదుతో పాటు దరఖాస్తు ఫారము పొంది, దరఖాస్తు సొమ్ముతో షెడ్యూల్ చూపిన ప్రకారముగా పూర్తి వివరాలు కొరకు నిజామాబాదు నగరపాలక సంస్థ కార్యాలయం నందు దాఖలు చేసి వేలం నందు పాల్గొనగలరు. పూర్తి వివరాల కొరకు నిజామాబాద్ నగరపాలక సంస్థ కార్యాలయం నందలి ఏ1 సెక్షన్‌ను సంప్రదించగలరు.

సం/- కమీషనర్,
నగరపాలక సంస్థ, నిజామాబాద్.
DIPR R.O. No. : 1869-PP/CL/ADVT/2026-27, Date: 04-05-2026

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



ప్రజాపక్షం /నడికూడ : నడికూడ మండల పరిధిలోని కంఠాత్మకూర్,వరికోల్ గ్రామంలో మాదారం సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ తో కలిసి సర్పంచ్ కొంగంటి తిరుపతి,దోగ్గేలా కుమార స్వామి ప్రారంభించారు.ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని దళారులను నమ్మి మోసపోవద్దని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మురాల భుజంగరావు,కుమారస్వామి,మండల వ్యవసాయ అధికారి జైసింగ్,మాదారం సొసైటీ సిఇఓ. రాజేందర్,ఎఇఓలు రామకృష్ణ,ప్రదీప్,కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 8న మెగా జాబ్ మేళా

ప్రజాపక్షం/జనగామ:ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఇంటర్మీడియట్ నుండి పోస్టు గ్రాడ్యుయేషన్ వరకు విద్యార్హతలు కలిగిన యువతకు మార్కెటింగ్, ఫైనాన్స్, బ్యాంకింగ్, హెల్త్‌కేర్, ఐటి, బిజినెస్ సర్వీస్, కస్టమర్ సర్వీస్, హాస్పిటాలిటీ, డిజిటల్ మీడియా, లాజిస్టిక్స్ తదితర రంగాల్లో ఉపాధి కల్పించేందుకు జిల్లా యువజన, క్రీడల శాఖ, ఇండస్ట్రీయల్, కామర్స్ డిపార్ట్‌మెంట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ డిపార్ట్‌మెంట్ సారథ్యంలో 50కి పైగా కంపెనీలతో ఉద్యోగ అవకాశాల కోసం మెగా జాబ్ మేళా ఈ నెల 8న వరంగల్ నిర్వయించడం జరుగుతుందని జిల్లా యువజన, క్రీడల అధికారి కోదండరాములు తెలిపారు. సోమవారం ఆయనొక ప్రకటన చేస్తూ ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోన వారు ఈ జాబ్ మేళాలో పాల్గొనే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో జనగామలోని నిరుద్యోగ, యువతీ యువకులు అధిక సంఖ్యలో పాల్గొని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## గూడూరు బస్టాండ్ సెంటర్‌లో మొక్కజొన్న రైతుల ధర్నా



ప్రజాపక్షం/గూడూరు;గూడూరు బస్టాండ్ సెంటర్‌లో సోమవారం మొక్కజొన్న రైతులు భారీ ఎత్తున ధర్నా నిర్వహించి రాస్తారోకో చేపట్టారు. గన్నె సంచులు కొరత లారీల లభ్యత లేకపోవడం వర్షాల కారణంగా పంట నష్టపోతుందనే ఆందోళనల మధ్య నెల రోజులుగా కొనుగోలు ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.మొక్కజొన్నలు వెంటనే కొనుగోలు చేయాలని ప్రభుత్వ అధికారులు స్పందించాలని డిమాండ్ చేస్తూ రైతులు నివాదాలు చేశారు. ధర్నా కారణంగా ప్రధాన రహదారిపై వాహనాలు నిలిచిపోయి రహణాకు తీవ్ర అంతరాయంఏర్పండింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. రైతులు తమ మొక్కజొన్నలు కొనుగోలు చేయాలంటూ సిఐ కాళ్ల మీద పడి బ్రతిమిలాడుకున్నారు. సిఐ వర్సు విజమ్ కుమార్ రైతులతో చర్చించి వారి సమస్యలను ఆర్‌డిఓ కలెక్టర్ దృష్టికీ తీసుకెళ్లి పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.అధికారుల హామీతో రైతులు ధర్నాను విరమించారు. ఈధర్నాకు బిఆర్ఎస్ నాయకలు మాజీ జిల్లా కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ ఖాసీం కటార్‌సింగ్ నూకల సేరేందర్ బెజ్జం రమేష్ తదితరులు మద్దతు ప్రకటించి ధర్నాలో పాల్గొన్నారు.

## 21 నుండి జూన్ 1 వరకు సరస్వతి అంత్య పుష్కరాలు: ఎస్‌పి



ప్రజాపక్షం/భూపాలపల్లి :జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాలేశ్వరంలో మే 21 నుండి జూన్ 1 వరకు నిర్వహించనున్న సరస్వతి అంత్య పుష్కరాల నేపథ్యంలో భక్తుల భద్రత, ట్రాఫిక్ నిర్వహణ, మౌలిక సదుపాయాలపై జిల్లా ఎస్‌పి సిరిశెట్టి సంకీర్త్ నోడల్ అధికారితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఘాట్‌ల వద్ద భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని, సిసి కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని, కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను సమర్థవంతంగా నియంత్రించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. పుష్కరాల నిర్వహణ కోసం సుమారు 2500 మంది పోలీసు సిబ్బందిని వినియోగించనున్నట్లు తెలిపారు. వాహనాల పార్కింగ్ కోసం సుమారు 250 ఎకరాల్లో పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో పార్కింగ్ స్థలాలను ప్రత్యక్షంగా పరిశీలించడం జరిగింది. వన్‌వే ట్రాఫిక్ సిస్టమ్ అమలు చేయడం ద్వారా రద్దీని తగ్గించే చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.అదేవిధంగా భక్తులకు సులభంగా రాకపోకలు జరిగేలా రహదారుల అభివృద్ధి, తాగునీటి సదుపాయాల కల్పన చేపడుతున్నామని, వారి భద్రత దృష్ట్యా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. అత్యవసర సేవలు, వైద్య సదుపాయాలు, లైటింగ్, శానిటేషన్ వంటి అంశాలపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పుష్కరాలను విజయవంతంగా నిర్వహించాలని ఎస్‌పి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పినరేష్ కుమార్, డిఎస్‌పి సూర్యనారాయణ, సిఐలు, ఎస్సైలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యమూ విక్రయించాలి

ప్రజాపక్షం/తొర్రూరు : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని వెంటనే ప్రభుత్వం కొనుగోలు చేయాలని బిఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశాల మేరకు మండలంలోని చీకటాయపాలెం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి స్థలం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ బిఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, మాజీ జెడ్‌పిటిసిమంగళపల్లి శ్రీనివాస్, మాజీ ఎంపిపి తూర్పాటి చిన్న అంజయ్య, బిఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నలమాస ప్రమోద్, నాయకులు కాలునాయక్, గ్రామస్తులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పంట స్వతహాగా అమ్ముకునే హక్కు లేదా?

రైతులకు పాలిట శాపంగా మారిన అధికారుల ఇష్టారాజ్యం





ప్రజాపక్షం/ములుగు:దేశానికి రైతే వెన్నుముక అని ప్రభుత్వాలు చెబుతున్నాయి. కానీ రైతులు పండించిన పంట స్వంతంగా అమ్ముకునేందుకు హక్కు లేదా కొనుగోలు కేంద్రాలలో ధాన్యం పోయగా, ఆ ధాన్యాన్ని రైతు స్వంతంగా వాహనం తీసుకొని వాహనంలోధాన్యం బస్తాలు వేసుకొని అమ్ముకునే హక్కు లేదని వ్యవసాయశాఖ అధికారులు రైతులను ఇబ్బంది చేస్తున్నారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పండించిన ప్రతి గింజను కొంటామని కలెక్టర్లు ఆదేశాలు జారీ చేశారు. కానీ రైతులు పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో వేసుకొని ఇప్పటికి దాదాపు 25 రోజులు కావచ్చిన ఇప్పటి వరకు కూడా ఒక లారీ లోడ్ కూడా బయటకు పోలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఆరుగాలం కష్టం చేసి చివరి దశ వరకు లక్షల్లో పెట్టుబడి పెట్టి అమ్ముకునే సమయం వరకు వచ్చిన కానీ అధికారుల రైతులపై పెత్తందారి వ్యవస్థ చేస్తూ రైతులను నానా ఇబ్బందులు పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. పండించిన ధాన్యం మ్యాచర్ రావాలని ధాన్యం తాలు లేకుండా ఉండాలని ఆ ధాన్యాన్ని తూర్పారా పట్టాలని అధికారులు చెబుతున్న రైతులు మాత్రం అధికారుల మాట వింటూ ప్రతి రైతు ధాన్యాన్ని తూర్పారా పడుతున్నారు. అయినప్పటికీ కూడా ధాన్యం బస్తాలు ఎగుమతి కావడం లేదని రైతులు అంటున్నారు. వర్షం పడితే రైతులకు తీరని దెబ్బ తాకుతుందని రైతులంటున్నారు. అయినప్పటికి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు చూస్తూ ,ఇప్పటి వరకు కూడా ఒక లారీ ధాన్యం లోడు బయటకు పోలేదని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో స్వంతంగా వాహనం తీసుకొని రైతు పండించిన పంట బస్తాలలో నింపుకొని పోయి అమ్ముకునే విధంగా చూడాలని, అలాగే కొనుగోలు కేంద్రాలలో ఆ వాహనానికి ట్రక్ షీట్ ఇవ్వాలని రైతులు అంటున్నారు. అలా కాకుండా వ్యవసాయశాఖ అధికారులు మాత్రం ట్రక్ షీట్ ఇవ్వమని మీ స్వంతంగా ధాన్యాన్ని అమ్ముకోవద్దని రైతులను బెదిరిస్తున్నారు. రైతు పండించిన పంటకు స్వంత హక్కు ఇచ్చి వారు అమ్ముకునే విధంగా చూడాలని లేని పక్షంలో కొనుగోలు కేంద్రాలలో కూడా అమ్ముకుంటారని రైతులు అంటున్నారు. వ్యవసాయాధికారి పరిశీలన చేసి మ్యాచర్ రావడం లే దని, మ్యాచర్ వస్తేనే కొనుగోలు చేస్తాం అంటున్నారు.

### ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ఎఇఒ

రైతులు కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం తూర్పార పట్టాలని, మ్యాచర్ వచ్చాక గన్నీ బస్తాలు ఇస్తామని అధికారులు చెప్పారు. కానీ అధికారులు చెప్పిన మాట తుంగలో తొక్కి వ్యవసాయ శాఖ ఎఇఒఇష్టారాజ్యంగా ధాన్యాన్ని తూర్పార పట్టని రైతులకు కూడా గన్నీ బస్తాలు ఇస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. ధాన్యం తూర్పార పట్టిన రైతులుఎఇఒను గన్నీ సంచులు అడిగితే ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఇప్పటికైనా రైతులు పండించిన ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేసి కాంట పెట్టి ఎగుమతి చేయాలని రైతులు అంటున్నారు.

# అభివృద్ధి నిరంతర ప్రక్రియ

అన్ని రంగాల్లో ప్రత్యేక దృష్టి
ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



ప్రజాపక్షం/హనుమకొండ : వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని మౌలిక వసతుల పనులను వేగంగా ముందుకు తీసుకెళ్తున్నామని వరంగల్ పశ్చిమ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. అభివృద్ధి ఒక నిరంతర ప్రక్రియ అని, ప్రజా ప్రభుత్వంలో గడిచిన రెండేళ్లలో గణనీయమైన మార్పులు సాధించామని చెప్పారు.సోమవారం బల్దియా మేయర్ గుండు సుధారాణితో కలిసి 52వ డివిజన్ నైమ్‌నగర్‌లో రూ.110 లక్షలతో, 9వ డివిజన్ రాయపూర్‌లో రూ.50 లక్షలతో చేపట్టనున్న అంతర్గత రహదారులు, సిసి డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే నాయిని, ఆమోదించిన ప్రతి పనిని జాప్యం లేకుండా పూర్తి చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని స్పష్టం చేశారు. ముఖ్యంగా వరద ప్రభావిత ప్రాంతాల్లో వర్షాకాలం వచ్చేలోపు పనులు పూర్తయ్యేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత రెండేళ్లలో నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతమయ్యాయని పేర్కొన్నారు. అన్ని పార్టీలకు చెందిన కార్పొరేటర్లు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం సానుకూల పరిణామమని అన్నారు. మే 6న కార్పొరేటర్ల పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో, వారి సహకారం, సేవలను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు.అభివృద్ధి కార్యక్రమాల్లో ఎక్కడా రాజకీయాలు, కులాలు, మతాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా సమాన దృష్టితో ముందుకు వెళ్లామని ఆయన స్పష్టం చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వం

మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు

ప్రజాపక్షం/వరంగల్ టౌన్ : రాష్ట్రంలో మొక్కజొన్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.సోమవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి,ఆరూరి రమేష్,ఇతర నాయకులతో కలిసి ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించి రైతుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.2400 మద్దతు ధర ప్రకటించినప్పటికీ, సరిపడా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో విఫలమైందన్నారు. దీంతో రైతులు 20 నుంచి 30 రోజులపాటు మార్కెట్ యార్డుల్లో వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.నిబంధనల పేరుతో పరిమితంగా కొనుగోళ్లు జరపడం వల్ల దళారులు తక్కువ ధరలకు ధాన్యం కొనుగోలు చేసి, మళ్లీ అధికారులతో కుమ్మక్కై అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. రవాణా, హమాలీ తదితర ఖర్చుల పేరిట రైతులపై అదనపు భారం మోపుతున్నారని చెప్పారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని అన్నారు.కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రైతులు ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కోలేదని పేర్కొన్నారు. రైతు డిక్లరేషన్ పేరుతో ప్రస్తుత ప్రభుత్వం రైతులను మోసం చేసిందని విమర్శించారు. ఈ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలంటే రైతులంతా ఏకమవ్వాలని పిలుపునిచ్చారు. అలాగే, ఎల్లుండి నిర్వహించనున్న రైతు సంగ్రామ సదస్సుకు పెద్ద ఎత్తున హాజరై నిరసనకు మద్దతు తెలపాలని ఆయన రైతులకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ జిల్లా నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి నాగేశ్వరావు



ప్రజాపక్షం/కురవి:అకాల వర్షానికి నష్టపోయిన రైతులని ప్రభుత్వమే ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు నెల్లూరి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం గాలి వానతో ఉరుములతో కూడిన వర్షం తో వరి మొక్కజొన్న పంట రైతులకు తీవ్రంగా నష్టపోయిన కురవి మండలం రాజోలు గుండ్రాతిమడుగు ఆర్య తండా, లక్ష్మి తండా, పలు గ్రామాలలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోల కేంద్రాలలో మొక్కజొన్న రాశులు కుప్పలుగా ఉండడంతో తడిసి ముద్దయ్యాయని, కొనుగోలు కేంద్రాలలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో కళ్ళాలకు వచ్చిన ధాన్యాన్ని కాపాడుకోవడం కోసం తీవ్ర ప్రయత్నాలు చేయాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత 15 20 రోజుల నుండి మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా ట్రాన్స్పోర్ట్‌కు లోడ్ చేయడానికి సంచులు లేవని ఏవో కుంటి సాకులు చెబుతూ అరకొర కొనుగోలు చేసి ధాన్యాన్ని కల్లాలోనే ఉంచడం వల్ల పంట సగానికి పైగా తడిసి ముద్దయి రైతులు చేతికి వచ్చిన పంటను అమ్ముకోలేక తీవ్రంగా నష్టపోయారని ఆయని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా యుద్ధ ప్రాతిపదికన వ్యవసాయ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తడిసిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ప్రభుత్వానికి ఆయన డిమాండ్ చేశారు. ధాన్యం కళ్ళాలని సందర్శించిన వారిలో రైతు సంఘం నాయకులు ఎలగం సత్యం, రామగాన్ని రవి, వేముల రంగయ్య, రేపాకుల పాపయ్య, బోళ్ళ వీరన్న, మడే ముత్తయ్య, వీరన్న భాస్కర్ తదితర రైతులు పాల్గొన్నారు.

# పిఎస్ఆర్ ఫ్యూయల్ ఫిల్లింగ్ స్టేషన్‌ను ప్రారంభించిన మంత్రి సీతక్క



ప్రజాపక్షం/ములుగు: ములుగు జిల్లా కేంద్రం సమీపంలో తిరుమల్ రెడ్డి బాల్ రెడ్డికి చెందిన పిఎస్ ఆర్ ఫ్యూయల్ ఫిల్లింగ్ స్టేషన్‌ను పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన పెట్రోల్ అందించడం ద్వారా వినియోగదారుల విశ్వాసాన్ని పొందడమే కాకుండా, వ్యాపారం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ ఫ్యూయల్ స్టేషన్ స్థానిక ప్రజలకు సౌకర్యవంతమైన సేవలను అందించడంతో పాటు ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ పల్లె జయపాల్ రెడ్డి, జిల్లా కార్యదర్శి చక్రపు శ్రీనివాస్, వెంకటాపూర్ మాజీ ఎంపిపి బుర్ర రజిత సమ్మయ్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది

కొడవటంచ శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారిని దర్శించుకున్న మహేష్ కుమార్ గౌడ్ దంపతులు, ఎమ్మెల్యే గండ్ర



ప్రజాపక్షం/భూపాలపల్లి/రేగొండ :కోరికలు తీర్చే కొంగు బంగారమైన శ్రీ కొడవటంచ లక్ష్మి నరసింహ స్వామి ఆశీస్సు లు నియోజకవర్గ ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలపై స్వామివారి ఆశీస్సులు ఉండాలని తెలంగాణ పిసిసి అధ్యక్షుడు మహేష్ కు మార్ గౌడ్ ఆకాంక్షించారు. భూపాలపల్లి నియోజకవర్గం రేగొండ మండలంలోని కొడవటంచ గ్రామంలోని శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారిని పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు.అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, ఆలయాల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం అనేక నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తుందన్నారు. మహిమ గల నరసింహ స్వామి ఆలయాన్ని దర్శించడం చాలా సంతోషంగా ఉందని, ఆలయాల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. లక్ష్మి నరసింహస్వామి ఆశీస్సులు ఈ ప్రాంత ప్రజలపై, రాష్ట్ర ప్రజలపై ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు బట్టు కరుణాకర్, ఆలయ చైర్మన్ నాయినేనీ సంపత్ రావు గారు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు

ప్రజాపక్షం/జనగామ:రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా కలెక్ట ర్ సందీప్‌కుమార్ ఝా అధికారులను ఆదేశించా రు. ధాన్యం కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీ హరి, శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మ న్‌కుమార్, ప్ర భుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌరసరఫరాల శాఖ కమీషనర్ స్టీపెన్ రవీంద్ర, రావాణా శాఖ కమీషనర్ ఇలంబర్తిలు సమీక్షించారు. కలెక్ట ర్లు, అదనపు కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా జిల్లా అధికారులతో సమీక్షించారు. కొ నుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు లేకుండా కొ నుగోల్లు నిర్వయించాలన్నారు. వాతావరణ పరిస్థితుల్ని రైతులకు తెలియజేయాలని, హమాలీలు, వాహన కొరత తీర్చాలని, ప్రతి కొనుగోలు కేంద్రా న్ని గ్రామ, మండల స్థాయి అధికారులు పర్యవేక్షించాలన్నారు.గన్నీ ్యగులు సరిపడా ఉన్నాయా. .లేవా అన్నది చూడాలని, ఏ రోజుకు ఆ రోజు ధా న్యం కొనుగోళ్లు జరపాలన్నారు. కొనుగోలు వివరాలు వెంటనే ఓపిఎంఎస్‌లో నమోదు చేయాలని, రైతు ఖాతాలో 24 గంటల్లోనే డబ్బులు పడాలన్నా రు. టోకెన్ పద్ధతి ద్వారా మాత్రమే ధాన్యం కొనుగోలు చేయాలని, లోడింగ్, రవాణా ఏక కాలంలో జరగాలన్నారు. సరిపడా హమాలీలను పెట్టుకోవాలని, రవాణా పరంగా ఇబ్బందులు లేకుండా చూ డాలన్నారు. జడ్‌పి సిఇఒ రంగారావు, డిఆర్‌డిఒ నూరోద్దీన్, డిఎఒఅంబికాసోని, డిఎంఒ రామకృష్ణ, డీడబ్ల్యూ కోదండరాములు, ఆర్‌టిఓ శ్రీనివాసగౌడ్, డిసిఎస్‌ఓ పావని పాల్గొన్నారు.

### మట్టి పరీక్షలు తప్పనిసరి

అధిక దిగుబడులు సాధించాలంటే మట్టి పరీక్షలు తప్పనిసరి అని జిల్లా కలెక్టర్ సందీఫ్‌కుమార్ ఝా అన్నారు. 99 రోజుల ప్రజాపాలనలో భాగంగా రైతు వారోత్సవాల్లో సోమవారం జనగామ మండలంలోని చౌడారం గ్రామ పంచాయతీ పరిధిలోని రైతు వేదికలో రైతు సంక్షేమ వారోత్సవం నిర్వయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు తమ భూమి సారాన్ని తెలుసుకోవడానిక భూమి పరీక్ష తప్పనిసరి అన్నారు. పలువురు రైతులకు మట్టి హెల్త్‌కార్డులు అందజేశారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికార అంబికాసోని, అగ్రికల్చర్ డిప్యూటి డైరెక్టర్ అనితా, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రమాకాంత్, చిటకోడూరు సర్పంచ్ యాదగిరి, ఉప సర్పంచ్ ప్రవీన్ పాల్గొన్నారు.

# రైతుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద



ప్రజాపక్షం/ వరంగల్ : ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 9 9 రోజుల కార్యచరణలో భాగంగా గీసుగొండ మండలం కోనాయిమాకుల గ్రామంలోని రైతు వేదికలో 'రైతు వా రోత్సవం' కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. మే 4 నుంచి 9 వరకు నిర్వహించనున్న రైతు వా రోత్సవాలకు వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన స మావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రైతుల అభివృద్ధియే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన సాంకేతిక పద్ధతులను రైతు లు అందిపుచ్చుకోవాలని, తద్వారా అధిక దిగుబడులు సాధించాలని కలెక్టర్ సూచించారు. భూసార పరీక్షల ప్రాముఖ్యతను వివరిస్తూ, ప్రతి రైతు తప్పనిసరిగా భూసార పరీక్షా పత్రం ఆధారంగానే ఎరువుల యాజమాన్యం చేపట్టాలని సూచించారు. అనంతరం ప్రధాన శాస్త్రవేత్త ఎ. వెంకట్ రెడ్డి మాట్లాడుతూ రైతులు యూరియాను సిఫారసు మేరకు మాత్రమే వాడాలని, పచ్చిరొట్ట ఎరువుల వినియోగాన్ని పెంచి భూమిని సంరక్షించుకోవాలని కోరారు. శాస్త్రవేత్త బి. మాధవి వరి రకాల ఎంపిక, సాగు నీటి పొదుపు పద్ధతులు, పంట మార్పిడి వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు వివరించారు. వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ అనురాధ మాట్లాడుతూ రసాయనిక ఎరువులు, పురుగు మందులను విచక్షణారహితంగా వాడకుండా సేంద్రీయ వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలని విజ్ఞప్తి చేశారు. డిసిఓ నీరజ, వరంగల్ హార్టికల్చర్ ఆఫీసర్ శ్రీనివాసరావు, గీసుకొండ తహసీల్దార్ రియాజుద్దీన్, జిల్లా పశు వైద్య, పశు సంవర్ధక అధికారి డాక్టర్ ఎం. బాలకృష్ణ, జిల్లా మత్స్యశాఖ అధికారి పి. శ్రీపతి, ఇరిగేషన్ ఈఈ ప్రశాంతి, సంబంధిత శాఖ అధికారులు, మండల వ్యవసాయ అధికారి హరి ప్రసాద్, విఏఎస్ శ్రీనివాస్, కోనాయిమాకుల సర్పంచ్ రాజు, మరియపురం సర్పంచ్ అర్పిత, బిఎస్‌సి అగ్రికల్చర్ విద్యార్థులు తన్మయి, షేక్ తస్లీమా, అధిక సంఖ్యలో అభ్యుదయ రైతులు, గ్రామ రైతులు పాల్గొన్నారు. అనంతరం దాతలు ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద సోమవారం ప్రారంభించారు.

# జీతాలు లేక పంచాయతీ కార్మికుల ధర్నా

ప్రజాపక్షం/కాటారం;గత ఎనిమిది ఎలలుగా జీతాలు రాకపోవడంతో గ్రామపంచాయితీ కార్మికులు ధర్నా కార్యక్రమం నిర్వహించారు.సోమవారం మండలకేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద నిరసన కార్యక్రమం చేపట్టి రాస్తారోకో చేసారు.ఈ సందర్భంగా వరు మాట్లాడుతూ నెలల తరబడి జీతాలు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందుల ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేసారు.కుటుంబ పోషణ భారంగా మారిందని అన్నారు.గ్రామ ప్రజల ఆరోగ్యమే తమ కర్తవ్యంగా భావిస్తూ నిరంతరం కృషి చేస్తున్నామని తమ బాధలను పట్టించుకోవడం లేదని అన్నారు.ఇప్పటికైన తమ జీతాలు వెంటనే విడుదల చేయాలని లేదంటే రానున్న రోజుల్లో పనులు బహిష్కరిం స్తామని అన్నారు. సందర్భంగా కార్మికుల ధర్నాకు గ్రామ ప్రజలు మద్దతు పలికారు.

## అకాల వర్షం నేపథ్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం పరిశీలన



**ప్రజాపక్షం/కూసుమంచి:**అకాల వర్షాల దృష్ట్యా కూసుమంచి తహసీల్దార్ సైదులు, మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ట్రాక్టర్ల ద్వారా కాటా వేసిన మొక్కజొన్నను చేగొమ్మ గోదాంలకు తరలించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. రైతులు అధైర్యపడొద్దని, ట్రాక్టర్ల ద్వారా రవాణా అనుమతించడంతో కొనుగోళ్లు వేగవంతం అవుతాయని పేర్కొన్నారు. ట్రాక్టర్లు ఉన్న రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం చేగొమ్మ గోదాంలో దిగుమతుల ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి జానీ బాబా, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాము, రైతులు పాల్గొన్నారు.

## ఐ ఫౌండేషన్ ప్రతిభ పురస్కారానికి ఎంపికైన కనకపూడి మాన్విత



**ప్రజాపక్షం/ మధిర :** తెలంగాణ రాష్ట్రం లోని ప్రభుత్వ పాఠశలల్లో పదవ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి 560మార్కులకు పైగా సాధించిన విద్యార్థులకు హైద్రాబాద్ వారు ప్రతిభ పురస్కారాలను రవీంద్రభారతి వేదికగా ఈ నెల 19వ తేదీన అందచేయనున్నారు. మడుపల్లి పిఎంశ్రీ జెడ్పిహెచ్ఎస్ విద్యార్థిని కనకపూడి మాన్విత ఐ ఫౌండేషన్ ప్రతిభ పురస్కారానికి అర్హత సాధించినట్లు హెచ్ఎం తోట నర్సింహారావు తెలిపారు. నిరుపేద కుటుంబంలో జన్మించి కష్టపడి చదివి ఈ ఉన్నత పురస్కారానికి ఎంపిక కావడం పట్ల మాన్వితకు ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. అలాగే 500కు పైగా మార్కులు సాధించిన 8మంది విద్యార్థులను కూడా అభినందించారు. ఎపిపిసి చైర్మన్ వేమిరెడ్డి నాగలక్ష్మి, కౌన్సిలర్లు వేమిరెడ్డి లక్ష్మి తులసి, పిల్లి సునీత, శీలం నర్సిరెడ్డి, గ్రామ పెద్దలు తదితరులు అభినందించిన వారిలో ఉన్నారు.

## ఘనంగా రైతు వారోత్సవాలు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలంలోని గోళ్లపాడు, వెంకటగిరి, వాళ్యతండా, ముత్తగూడెం, పొన్నెకల్లులోని రైతువేదికలో 99రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రైతు వారోత్సవాలను వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రణాళికలో చేపట్టిన పనులు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పాలేరునియోజకవర్గస్థాయి వ్యవసాయ సంచాలకులు మిట్టపల్లి సతీష్ రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఏఓలు అరుణజ్యోతి, పవన్, మండలవ్యవసాయధికారి జె.ఉమానగేష్,ఏఈఓలు పాల్గొన్నారు.

## టిబి ముక్త్ భారత్ అభియాన్2.0



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని 31వ వార్డులో గల ఏదులాపురం సబ్‌సెంటర్‌లో టిబి ముక్త్ భారత్ అభియాన్2.0 కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 32వ వార్డు సిపిఐ కౌన్సిలర్ మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, 31వ వార్డు సిపిఎం కౌన్సిలర్లు ఊరడి హైమావతి, మున్సిపాలిటీ సిపిఎం కార్యదర్శి ఊరడి సుదర్శన్ రెడ్డి, జిల్లా క్షయ నివారణ అధికారులు, సబ్‌సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి ప్రజావాణి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఖమ్మం కార్పొరేషన్ మేయర్ పునుకొల్లు నీరజ తెలిపారు. సోమవారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ పాల్గొని ప్రజల వినతులను స్వీకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన వినతులను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యమని ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతతో పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప కమిషనర్ శ్రీనివాస్, సహాయ కమిషనర్ అనిల్ కుమార్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పశువుల అక్రమ రవాణా నియంత్రణకు చెక్ పోస్టు

**ప్రజాపక్షం/జూలూరుపాడు:**పశువుల అక్రమ రవాణా నియంత్రణకు జిల్లా సరిహద్దులలో చెక్ పోస్టును జూలూరుపాడు పోలీసులు ఏర్పాటు చేసినట్లు ఎస్సై రవి తెలిపారు. బుధవారం జూలూరుపాడు శివారు చెక్ పోస్టు ఏర్పాట్లను జూలూరుపాడు ఎస్ఐ రవి, చంద్రుగొండ ఎస్ఐ శివ రామకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఎస్ఐలు మాట్లాడుతూ బక్రీద్ పండుగ నేపథ్యంలో పశువుల అక్రమ రవాణా కట్టడి చేసేందుకు జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు ప్రత్యేక చెక్ పోస్టు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఎవరైనా అనుమతి లేకుండా పశువులను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తిస్తే 100 లేదా స్థానిక పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వాలని, అక్రమ రవాణా పేరుతో గొడవలు సృష్టిస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# భూసార పరీక్షతోనే లాభదాయకమైన సాగు సాధ్యం

- శాస్త్రీయపద్ధతులను అనుసరిస్తే రైతులకు అధిక దిగుబడి
- రసాయనాల వాడకాన్ని తగ్గించండి
- యువత వ్యవసాయంపై ఆసక్తి పెంచుకోవాలి
- ఎమ్మెల్యే కూనంనేని



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** భూసార పరీక్షలతోనే లాభదాయకమైన సాగు సాధ్యమవుతుందని, ప్రతీ రైతు తన భూమి స్వభావాన్ని తెలుసుకుని శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేయాలని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా చుంచుపల్లి మండల పరిధిలోని ఎస్‌సిబి నగర్ రైతు వేదికలో సోమవారం నిర్వహించిన రైతు మహోత్సవం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమానికి ఆయన ముఖ్యాతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శాస్త్రవేత్తలతో చర్చించి భూమిలోని ఖనిజాల స్థితి, పిహెచ్ విలువలు, నేల స్వభావం వంటి అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ మనిషికి రక్త పరీక్షలు ఎంత అవసరమో భూ పరీక్షలు కూడా అంతే అవసరం ఉన్నారు. భూమి స్వభావానికి అనుకూలమైన పంటలను ఎంపిక చేసుకుంటే రైతులకు నష్టానికి తగ్గ ఫలితం దక్కుతుందన్నారు. సాగు ఖర్చులను తగ్గించుకోవాలని, ప్రధానంగా అవసరానికి మించి యూరియా, ఇతర రసాయనాల వాడకాన్ని ఆపేయాలని సూచించారు. మార్కెట్లో ఏ పంటకు డిమాండ్ ఉందో తెలుసుకుని ఆ పంటలను సాగు చేయడం ద్వారా అధిక ఆదాయాన్ని పొంద వచ్చన్నారు. సాగునీటిని ఆదా చేయడం ద్వారా భవిష్యత్ తరాలకు నీటి కొరత లేకుండా చేయవచ్చని చెప్పారు. సేంద్రీయ వ్యవసాయ పద్ధతుల ద్వారా ప్రకృతిని కాపాడుతూ నాణ్యమైన ఆహారాన్ని ప్రజలకు అందించవచ్చని తెలిపారు. ఏడు రోజుల పాటు సాగే ఈ అవగాహన కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. భవిష్యత్‌లో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత మరింత పెరుగుతుందని, యువత కూడా వ్యవసాయంపై మక్కువ పెంచుకుని దేశానికి వెన్నెముకగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేయర్ గణేష్, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, ప్రభుత్వాధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.




**నవ లిమిటెడ్ సేవలు అభినందనీయం**

**పాల్వంచ:** పాల్వంచ నవ లిమిటెడ్ సంస్థ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబులిటి పాలసీలో భాగంగా 37 లక్షలతో నిర్మించిన పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలో పేషెంట్స్ వేయింటింగ్ హాల్, 18 లక్షలతో నిర్మించిన జోగారావు చెరువు కాలువలను సోమవారం ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ విద్యా, వైద్యం, తాగునీటి, సాగు నీటి వసతులు, నిరుద్యోగ యువతీ యువకులకు పలు రంగాలలో శిక్షణ ఇస్తూ వారికి ఉపాధి అవకాశాలను కల్పిస్తూ తన సేవలను కొనసాగిస్తున్న నవలిమిటెడ్ సంస్థకు అభినందనలు తెలిపారు.రాబోయే రోజుల్లో సేవలను మరిన్ని రంగాలకు విస్తరించాలని ఆకాంక్షించారు. 50 పడకల సామర్థ్యం కలిగిన పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేయటానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే కార్యరూపం దాల్చనుందని తెలిపారు. ఆసుపత్రిలో అందించే మెరుగైన వైద్య సేవలకు గాను పలు అవార్డులు రావటం సంతోషకరంగా ఉందన్నారు. ఈ ఒరవడిని ఇలాగే కొనసాగిస్తూ ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన, అత్యుత్తమమైన వైద్య సేవలను అందించాలని వైద్యులను కోరారు. ఆసుపత్రి అభివృద్ధికి శాయశక్తులా పాటుపడతానని హామీ ఇచ్చారు. రైతు శ్రేయస్సు కోసం నిర్మించిన జోగారావు చెరువు కాలువ నిర్మాణంతో సుమారు 100 ఎకరాల రైతులకు ప్రయోజనం కలుగుతుందని చెప్పా రు. నీటి వసతితో రైతులు అధిక దిగుబడి సాధించటానికి వీలు కలుగుతుందన్నారు. రైతాంగం కాలువను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ మేయర్ మూడ్ గణేష్, మునిసిపల్ కమీషనర్ సుజాత, తహశీల్దార్ దారా ప్రసాద్, డిసిహెచ్ రవిబాబు, ఆసుపత్రి సూపరిండెంట్ రాంప్రసాద్, ఆర్‌ఎంఒ సోమరాజుదొర, నవలిమిటెడ్ ఏజిఎం ఏజి శంకర్, సివిల్ ఇంజనీర్ శ్రీనివాస్, సిఎస్ఆర్ మేనేజర్ శ్రీనివాసరావు, డిప్యూటి మేయర్ సిరిపురపు లలిత కుమారి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబ, ఉప్పుశెట్టి రాహుల్, కార్పోరేటర్లు వీసంశెట్టి విశ్వేశ్వరరావు, గుర్రం వెంకటేశ్వర్లు, గొర్లె అన్నపూర్ణ, దంతెబోయిన నరేష్ యాదవ్, సింధు తపస్వి, గుణచరణ్, మాలంపాటి భవిత, శ్రీనివాస్, చెరుకు భాగ్యలక్ష్మి, సిపిఐ నాయకులు రాహుల్, చెరుకూరి శేఖర్ బాబు, అన్నారపు వెంకటేశ్వర్లు, వైఎస్ గిరి, వల్లపు యాకయ్య, గొర్లె నరేష్, గౌతమి క్రిష్ణ, అల్లి వెంకటేశ్వర్లు, వెంకన్నగౌడ్, నామా పండు, నవీన్, ఆలపాటి ప్రసాద్, కరీం, లాల్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

## పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- ఎఐకెఎస్ డిమాండ్



**ప్రజాపక్షం/చింతకాని:**పాతర్లపాడు గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో పంట కాలిపోయిన మొక్కజొన్న రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐకేఎస్ ఖమ్మం జిల్లా గౌరవ అధ్యక్షులు ఏపూరి రవీంద్ర బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం పాతర్లపాడు గ్రామంలో ఏఐకేఎస్ చింతకాని మండల ప్రతినిధి బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఏపూరి రవీంద్ర బాబు మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యంతోనే మొక్కజొన్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కొనుగోలు కేంద్రాల పేరుతో రైతులను దగా చేస్తున్నారన్నారు. బస్తాలు మొదలుకొని, కాటాలు, చివరకు లారీల వరకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.వేసవి కాలం కావడంతో అగ్నిప్రమాదాలు చోటుచేసుకుంటుంటే రైతులు రాత్రిళ్ళు సైతం కాటాలు వేసిన బస్తాలకు కావిలి కాయల్సివస్తుందన్నారు. కాటాలు వేసిన బస్తాలను గోడౌన్‌కు తరలించడానికి బస్తాకు రూ.40 నుంచి 50 వరకు డిమాండ్ చేస్తున్నారని దీంతో గత్యంతరం లేక రైతులు చెల్లిస్తున్నారని, పాతర్లపాడులో జరిగిన ప్రమాదంలో రైతులు తీవ్రంగా నష్టపోయారని తక్షణమే అధికారులు పంట నష్టం వివరాలు ప్రభుత్వానికి పంపి నష్టపరిహారం అందేలా చూడాలన్నారు. తక్షణమే అధికారులు స్పందించి కాటాలు వేసిన మొక్కజొన్నను గోడౌన్ కు తరలించాలని పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.ఈ ప్రమాదంలో గొర్రెలు కూడా అగ్నికి ఆహుతయ్యాయని గొర్రెల కాపరికి కూడా నష్టపరిహారం అందేలా చూడాలని లేని పక్షంలో రైతులు తరపున ఎఐకెఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు పావులూరి మల్లిఖార్జున్‌రావు, ఏఐకేఎస్ మండల కార్యదర్శి పదిమల వెంకటనర్సయ్య, నాయకులు తాళ్లూరి యాదగిరి, కొత్తపల్లి రమేష్, గడ్డం సీతారామారావు తదితరులు పాల్గొన్నారు.

## కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసుకోండి



- నగల దుకాణదారులకు సిపి సూచన

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** బంగారు నగల దుకాణదారులు తమ వ్యాపారసంస్థలకు నాణ్యమైన సిసి కెమోరాలు, ఆటోమాటిక్ అలారం సిస్టమ్ వంటి కట్టుదిట్టమైన భద్రత ను ఏర్పాటు చేసుకోవాలని పోలీసుకమిషనర్ సునిల్‌దత్ ఖమ్మం నగర వ్యాపారులకు సూచించారు. ఆదివారం కరీంనగర్‌లో సిఎంజె జ్యూవెలర్స్‌లో జరిగిన దోపిడి, కల్పుల ఘటన నేపథ్యంలో సోమవారం ఖమ్మం నగరంలోని నగల వ్యాపారులతో ఆయన స్థానిక సిపి కార్యాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. నగల దుకాణాలలో భద్రతతో పాటు సిసిటీవీ నిఘా, అలారం వ్యవస్థలు, యాక్సెస్ కంట్రోల్ వంటి ఆధునిక భద్రత ఏర్పాట్లను పెంచాలన్నారు. అదేవిధంగా మెటల్‌డిటెక్టర్ పరికరాలను అమర్చుకోవాలని సూచించారు. నగల దుకాణాల వద్ద భద్రతను విధిగా సమీక్షించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. పగలు, రాత్రి వేళల్లో బంగారు వ్యాపార సముధాయాల వద్ద సాయుధ బలగాలను గస్తీ నిర్వహిస్తూ నిఘా పెంచాలని ఎస్‌హెచ్‌ఓలకు సూచించారు. ఇతర రాష్ట్రాలో సైతం తరచూ ఇటువంటి దోపిడీ సంఘటనలు చోటుచేసుకుంటుండటంతో పునరావృతం కాకుండా అడ్డుకునేందుకు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం టౌన్ ఏసిపిలు ఎస్‌వి రమణమూర్తి, ఖమ్మం రూరల్ ఏసిపి బిల్లా తిరుపతిరెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఏసిపి మహేష్, సిఐలు కరుణాకర్, మోహన్ బాబు, బాలకృష్ణ, మురళి, సంజీవ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## బుగ్గవాగు చెక్ డ్యామ్ అంచనాలకు క్యాబినెట్ ఆమోదం

- రఘునాథపాలెం, కామేపల్లి మండలాలకు మహర్ధశ
- రూ.88.42 కోట్లతో ప్రతిపాదన
- ముఖ్యమంత్రి, మంత్రిమండలికి మంత్రి తుమ్మల కృతజ్ఞతలు



**ప్రజాపక్షం/రఘునాథపాలెం:**ఖమ్మం జిల్లాలో సాగునీటి రంగానికి బలాన్నిచ్చే బుగ్గవాగు ఎడమ వరద కాలువ పనుల సరిరించిన అంచనాలకు రాష్ట్ర క్యాబినెట్ ఈ రోజు ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు మంత్రిమండలికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రాజెక్టు అమలుతో కామేపల్లి, రఘునాథపాలెం మండలాల్లో వ్యవసాయ రంగానికి నూతన దశ ప్రారంభమవుతుంది. బుగ్గవాగు ఆనకట్ట నుంచి ఎడమ వరద కాలువ, బ్రాంచ్ కాలువల నిర్మాణం, అనుబంధ సివిల్ పనుల కోసం మొత్తం రూ.88.42 కోట్ల సవరించిన పరిపాలనా అనుమతికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రారంభ అంచనా రూ.39.21 కోట్లుగా ఉన్నప్పటికీ, ప్రాజెక్టు రూపకల్పనలో సాంకేతిక మార్పులు, ఆధునికీకరణ కారణంగా వ్యయం పెరిగింది. తాజా అంచనాల ప్రకారం పనులు ఖర్చు రూ.53.29 కోట్లు, పన్నులు రూ.21.23 కోట్లు, భూసేకరణకు రూ.10.71కోట్లు, ఇతర వ్యయాలకు రూ.3.19 కోట్లు కేటాయించారు. ఈ ప్రాజెక్టు అమలులో కామేపల్లి, రఘునాథపాలెం మండలాల్లోని 13 గ్రామాలకు చెందిన 31 చెరువులను వరద నీటితో నింపే అవకాశం లభిస్తుంది. దాదాపు 2,866 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరగనుండటంతో, రైతులకు నిత్య సాగునీటి భరోసా కలుగుతుంది. ఇది వ్యవసాయ ఉత్పాదకత పెంపుకు, రైతుల ఆదాయ వృద్ధికి దోహదం చేయనుంది. గతంలో భూసేకరణ సమస్యలు, రైతులు అభ్యంతరాల కారణంగా ఈ పనులు నిలిచిపోయిన నేపథ్యంలో, మంత్రి తుమ్మల ప్రత్యేక చొరవతో ప్రాజెక్టు రూపకల్పనలో కీలక మార్పులు చేశారు. ఓపెన్ కాలువ తవ్వకానికి బదులుగా భూగర్భ పైపులైన్(గ్రావిటీ మెయిన్) విధానాన్ని ప్రవేశపెట్టడం ద్వారా భూసేకరణ అవసరం 232 ఎకరాల నుంచి కేవలం 51 ఎకరాలకు తగ్గింది. దీంతో రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రాజెక్టు అమలు సాధ్యమవుతోంది. ఈ కాలువ పనులు చేపట్టడం వల్ల నూతనంగా కామేపల్లి మండలంలో 23 చెరువులు, రఘునాథపాలెం మండలంలో 8 చెరువులను ఈ కాలువ ద్వారా వరద నీటితో నింపి రైతులకు సాగునీటిని అందించవచ్చు. ప్రస్తుతం రఘునాథపాలెం మండంలోని చెరువులకు మంచుకొండ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు అందుతున్నప్పటికీ, ఎత్తిపోతల కోసం ప్రభుత్వానికి విద్యుత్ ఖర్చు భరించాల్సి వస్తుంది. బుగ్గవాగు ఎడమ పూర్తయిన తర్వాత గ్రావిటీ విధానంలోనే నీరు సరఫరా అవ్వడం వల్ల విద్యుత్ వినియోగం పూర్తిగా తగ్గి, ప్రభుత్వానికి గణనీయమైన ఆర్థిక ఆదా కలుగుతుంది. ఈ ప్రాజెక్టు అమలుతో కామేపల్లి మండలంలోని 23 చెరువులు, రఘునాథపాలెం మండలంలోని 8 చెరువులు మరియు మంచుకొండ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం ద్వారా నింపబడే చెరువులు నింపబడుతూ, రఘునాథపాలెం మండలం మొత్తం ప్రాంతం సస్యశ్యామలం వైపు దూసుకెళ్లనుంది. దీని ఫలితంగా పంటల విస్తీర్ణం పెరగడం, పంటల వైవిధ్యం పెరగడం, రైతుల జీవన ప్రమాణాలు మరియు ఆర్థిక పరిస్థితులు మెరుగుపరచడం వంటి అనేక ప్రయోజనాలు కలగనున్నాయి. ఈ ప్రాజెక్టు అమలులో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. క్యాబినెట్ ఆమోదంతో పనులు వేగవంతం కానుండగా, ఖమ్మం జిల్లాలో సాగునీటి వనరులు మరింత బలోపేతం కావడంతో పాటు రఘునాథపాలెం మండలం సస్యశ్యామలంగా మారే దిశగా కీలక అడుగు పడినట్టైంది.

## నేల సంరక్షణతోనే మెరుగైన దిగుబడులు

- రైతు వేదికలో నేల ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం

**ప్రజాపక్షం/బూర్గంపాడు:**మండల కేంద్రంలోని రైతు వేదికలో తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో "ప్రజా పాలన ప్రగతిప్రణాళిక"లో భాగంగా సోమవారం నేల ఆరోగ్య పరిరక్షణ, సమతుల్య ఎరువుల యాజమాన్యం, ప్రకృతి వ్యవసాయం అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మండల వ్యవసాయ అధికారి ఆర్ శంకర్, స్థానిక సర్పంచ్ మందా నాగరాజు మాట్లాడుతూ రైతుల నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ద్వారా మెరుగైన దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. పౌర సరఫరాల శాఖ వినియోగదారులు కోరుకునే సన్న వరి రకాల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. రైతులు శాస్త్రీయ పద్ధతులను అనుసరిస్తూ నేల నాణ్యతను పరిరక్షించుకోవాలని తెలిపారు. రసాయన ఎరువులను పరిమితంగా వినియోగిస్తూ, సేంద్రియ ఎరువులు, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాలని సూచించారు. రైతు వేదికల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న అవగాహన కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం నేల ఆరోగ్య పరిరక్షణ పత్రంను ఆవిష్కరించి, రైతులతో నేల సంరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో వార్డు సభ్యులు, రైతులు, ఎటిఎం పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## సేంద్రియ వ్యవసాయంపై అవగాహన

- బేతుపల్లిలో వ్యవసాయ దినోత్సవం నిర్వహణ
- మార్కెట్ గిరాకీ ఉన్న వరి రకాలే సాగు చేయాలి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:**ప్రొఫెసర్ జయ శంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో వ్యవసాయ కళాశాల అశ్వారావుపేట అసోసియేట్ డీన్ డా. జె. హేమంత కుమార్, శాస్త్రవేత్తలు డా. పి. నీలిమ, డా. ఎ. శ్రీజన్ ల పర్యవేక్షణలో మండల పరిదిలోని బేతుపల్లి గ్రామంలో సోమవారం "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమాన్ని 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వ్యవసాయ దినోత్సవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ రైతులు ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా సేంద్రియ వ్యవసాయం, సిఫారసు చేసిన మేరకు యాజమాన్యం ఎరువులు ,పంట మార్పిడి, సాగునీటి ఆదా వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని రైతులను కోరారు. రైతులు సేంద్రియ ఎరువులు వాడి నేలతల్లి ఆరోగ్యం కాపాడాలని ఆమె పిలుపునిచ్చారు. మార్కెట్లో గిరాకి ఉన్న వరి రకాలనే సాగు చేయాలని సూచించారు. వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా. జై హేమంత్ కుమార్ మాట్లాడుతూ రైతు సోదరులు ఆరు ముఖ్య అంశాలపై దృష్టి సారించి, రాబోయే వానాకాల పంట సాగుకు సమాయత్తం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపాలిటి చైర్మన్ రెహానాకమల్ పాషా, వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ అధికారి వై. శ్రీనివాస రావు, బేతుపల్లి సర్పంచ్ డి. రాజేంద్రప్రసాద్, ఉప సర్పంచ్ చెన్నకేశవులు, వ్యవసాయ విస్తరణాధికారి వాసంతి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కల్పనకు మెగా జాబ్‌మేళా

- 80 కంపెనీల ద్వారా 3,200 ఉద్యోగ అవకాశాలు
- ఎంపికైన అభ్యర్థులకు మే 23న నియమాక పత్రాలు
- మెగాజాబ్ మేళాలో పాల్గొన్న కలెక్టర్

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనకు మెగా జాబ్‌మేళాను నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఖమ్మం నగరంలోని ఎస్ఆర్ గార్డెన్స్‌లో సోమవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ జాబ్ మేళాలో ఐటి, ఫార్మసీ, బ్యాంకింగ్, మాన్యూఫ్యాక్చరింగ్, మార్కెటింగ్ తదితర రంగాలకు చెందిన 80 కంపెనీలు పాల్గొని సుమారు 3,200లకు పైగా ఉద్యోగ అవకాశాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈరోజు ఎంపికైన అభ్యర్థులకు మే 23న నియమాక పత్రాలు అందజేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. నిరుద్యోగ యువత ప్రైవేటు ఉద్యోగాలను నిర్లక్ష్యం చేయకూడదన్నారు. మన లక్ష్యాలపై దృష్టి ఉంచుకుంటూనే ప్రస్తుతం లభిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎక్కువ కాలం నిరుద్యోగిగా ఉండకుండా ప్రారంభంలో వేతనం తక్కువగా ఉన్నప్పటికీ ఉద్యోగాన్ని స్వీకరించి అనుభవాన్ని సంపాదించుకోవాలన్నారు. ప్రైవేటు రంగంలో అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయని నిరంతరం నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటూ ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టాస్క్, డిట్, జిల్లా అధికారులు, డివైఎస్‌వో సునీల్‌రెడ్డి, ఈడిఎం దుర్గాప్రసాద్, డిఫెన్స్ అకాడమీ ప్రతినిధులు, కంపెనీ ప్రతినిధులు, నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

# రైతులు సరైన ఎరువులు, విత్తనాలు వాడాలి

## ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్



**ప్రజాపక్షం/జగిత్యాలరూరల్:** జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీ పూర్ గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక రైతువారం కార్యక్రమంలో భాగంగా రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అన్నదాతల అవగాహన కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం రైతులకు భూసార పరీక్ష విశ్లేషణ పత్రాలు, జాతీయ ప్రకృతి వ్యవసాయ కిట్లు అందజేసి, రైతులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ భూసార రక్షణ ప్రతిజ్ఞను చేశారు. ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ మాట్లాడుతూ రైతులందరు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రైతువారం కార్యక్రమంలో భాగంగా ఇట్టి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. వ్యవసాయ అధికారులు శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు రైతులు ఉపయోగించుకోవాలన్నారు. నేడు రాష్ట్రంలో మార్క్ పేడ్ 10,000 కోట్ల నష్టాల్లో ఉందని ఎమ్మెల్యే అన్నారు. కేంద్ర ప్రభుత్వం మక్కలకు 2,400 మద్దతు ధర కల్పిస్తుందని, కానీ చేతల్లో చూపడం లేదని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్వింటాలకు 800 వందల వరకు నష్టాన్ని భరిస్తూ మక్కలు కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే అన్నారు. బయట మార్కెట్ లో మక్కలు 1500 గా ధర ఉందని, మార్క్ ఫెడ్ 10,000 కోట్ల నష్టాల్లో ఉంటే దాదాపుగా సివిల్ సప్లై కార్పొరేషన్ కూడా నష్టాల్లోనే ఉందని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమానికి రైతుల నుండి పూర్తి స్థాయిలో స్పందన లేదని, ఇలాంటి గొప్ప కార్యక్రమాన్ని రైతులు ఉపయోగించుకొని పాల్గొన్నట్లయితే శాస్త్రవేత్తలు రాష్ట్ర ప్రభుత్వం సైతం ఉత్సాహంగా రైతుల కోసం అనేక కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని ఇష్టారీతిన అధిక ఎరువులు వాడకం వల్ల భూసారం దెబ్బతిని పంట దిగుబడి తగ్గుతుందని, పంట సాగు పరీక్షలు చేపించి, సరైన ఎరువులు విత్తనాలు వాడాలని అన్నారు. వ్యవసాయ అధికారులు శాస్త్రవేత్తల నుండి పంట సాగు బడి అంశాలు నేర్చుకోవాలని రైతులు పంట సాగు పై పెట్టుబడి తగ్గించి లాభాలు ఆర్జించాలని వారు ఆకాంక్షించారు. రైతులు అందరూ ఒకే పంట కాకుండా డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలని పంట మార్పిడి వైపు దృష్టి సారించాలని ఎమ్మెల్యే అన్నారు. లక్ష్మీ పూర్ గ్రామంలో సీడ్ ప్రాసెస్ యూనిట్ పూర్తి చేయటానికి కృషి చేస్తానని హామీ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు పక్షపాతి ప్రభుత్వమని రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని కేంద్ర ప్రభుత్వం ఎఫ్.సీ.ఐ ధాన్యం సేకరణ జాప్యం వల్ల నేడు రైతులకు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బంది ఉందని రైతులు గమనించాలని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో డిఓఎ భాస్కర్,ఎడిఎ తిరుపతి నాయక్,ఎఎంసి ఛైర్మెన్ గడ్డం నారాయణరెడ్డి, సర్పంచ్ కవిత స్వామి రెడ్డి, ప్రొఫెసర్ సుజాత, సైంటిస్టులు రవి,రాజేష్, స్వాతి,ఎఈఓ హరీష్, మాజీ సర్పంచులు చెరుకు జాన్, తిరుపతి రెడ్డి, గర్వాన్దుల గంగన్న, మాజీ ఆత్మ ఛైర్మెన్ ఏలేటి రాజీ రెడ్డి, పురిపాటి రాజీ రెడ్డి, బాపూరెడ్డి, మల్లేష్, ధనేశ్వర్ రావు,గిద్దె రాజు,శంకర్,తిరుపతి,రాజేష్,అధికారులు, రైతులు,తదితరులు పాల్గొన్నారు.

## మైనర్ బాలికపై అత్యాచారం కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష

**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** మైనర్ బాలికపై అత్యాచారం కేసులో ఒకరికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష తో పాటు రూ.15 వేల జరిమానా,బాధిత బాలికలకు రూ.3 లక్షల రూపాయలు పరిహారం ఇవ్వాలంటూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పద్మావతి సోమవారం తీర్పు వెలువరించారు.ధర్మపురి పోలీస్ స్టేషన్ పరిధి కి చెందిన మైనర్ బాలికను నిందితుడు సయ్యద్ అప్సర్ అనే 60 సంవత్సరాలు అనే వ్యక్తి అత్యాచార యత్నం చేసిన ఘటనలో నిందితుడిపై పోక్సో చట్టం కింద, 2023 సం.లో మల్యాల పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేశారు.అప్పటి డీఎస్పీ వెంకట స్వామి దర్యాప్తు చేసి కోర్టుకు ఆధారాలు సమర్పించారు. కోర్ట్ డ్యూటీ అధికారులు సాక్షులను ప్రవేశపెట్టగా సాక్షులను విచారించిన న్యాయమూర్తి రత్న పద్మావతి నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పిమాట్లాడుతూ సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ శిక్ష నుండి తప్పించుకొలేరన్నారు.పోలిసులు ,ప్రాసిక్యూషన్ వ్యూహంతో న్యాయ నిరూపణ వేగవంతగా జరిపి కచ్చితంగా శిక్షలు పడేలా చేస్తారని సూచించారు.నిందితునికి శిక్ష పడటంలో కృషి చేసిన పీపీ బిట్ల నర్సయ్య , ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ డీఎస్పీ వెంకట స్వామి, అప్పటి ధర్మపురి ఎస్.ఐ దత్తాద్రి, ఎస్.ఐ శ్రీకాంత్ , కోర్ట్ కానిస్టేబుల్ శ్రీధర్,శ్రీధర్,కిరణ్ కుమార్ లను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

## రంగనాయక్‌సాగర్‌లో మృతదేహం లభ్యం

### హత్య...ఆత్మహత్య?, కానిస్టేబుల్ పై అనుమానాలు !



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** సిద్దిపేట రంగనాయక్‌సాగర్‌లో ఒక వ్యక్తి మృతదేహం సోమావారం లభ్యమైంది. చిన్నకోడూరు ఎస్ఐ, స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా వున్నాయి. తొగుట మండలం వేములగాట్‌కు చెందిన బెల్దే విశ్వనాథం (55) గత కొంతకాలంగా సిద్దిపేట భారత్‌నగర్‌లో స్థిరపడ్డారు. విశ్వనాథం వ్యాపార నిమిత్తం పలువురి వడ్డిపై అప్పులు ఇచ్చినట్లు సమాచారం. ఈనెల 2న విశ్వనాథం ఇంటి నుండి కన్పించకపోయినట్లు భార్య వనిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం ఉదయం విశ్వనాథం మృతదేహం రంగనాయక్ సాగర్‌లో తేలింది.దీంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా విశ్వనాథం వద్ద అప్పు తీసుకున్న ఒక కానిస్టేబుల్ ఆరోజు బైక్ తీసుకెళ్లినట్లు సమచారం . ఆకోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కానిస్టేబుల్‌ను సైతం పోలీసులు విచారణ చేస్తున్నట్లు సమాచారం. సిద్దిపేట రూరల్ సిఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.

## సిరిసిల్ల జిల్లాలో ఉపముఖ్యమంత్రి, మంత్రుల పర్యటనకు పటిష్ట భద్రత: ఎస్‌పి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** మంగళవారం గంభీరవుపేట మండలంలో ఉపముఖ్యమంత్రి,మంత్రుల బృందం పర్యటన నేపథ్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. పర్యటన దృష్ట్యా గంభీరవుపేట మండలంలో ఏర్పాట్లను,హెలిప్యాడ్ ను ఎస్పీ స్వయంగా అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి,అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని అధికారులకు సూచించారు. ఎస్పీ వెంట డిఎస్పీ నాగేంద్రచారి, ఎల్లారెడ్డిపేట సి.ఐ వెంకటేష్, స్పెషల్ బ్రాంచ్ సి.ఐ రవి, ఆర్.ఐ లు మధుకర్, రమేష్, ఎస్.ఐ అనిల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యం ఇవ్వాలి: కలెక్టర్




**ప్రజాపక్షం/కరీంనగర్:** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. సోమవారం కలెక్టరేట్ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 99 మంది అర్జీదారులు ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పించారు. కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించగా మరికొన్నింటిని అధికారులకు బదిలీ చేశారు. త్వరితగతిన దరఖాస్తులు పరిష్కరించాలని, పెండింగ్ దరఖాస్తులు క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ డివిజన్లో పరిధిలో ఆర్డీవోల ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమం జరిగింది. కరీంనగర్ రెవెన్యూ డివిజన్ కు 75 దరఖాస్తులు, హుజురాబాద్ రెవిన్యూ డివిజన్ కు 14 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, ఆర్డీవో మహేశ్వర్, జెడ్పి సీఈవో శ్రీనివాస్, ఏవో సుధాకర్ ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## హన్మాజీపేటలో పేకాట స్థావరంపై పోలీసుల దాడి, ఐదుగురు అరెస్ట్

**ప్రజా పక్షం/వేములవాడ:** వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు వేములవాడ రూరల్ ఎస్ఐ వెంకట్రాజం వివరాలను వెల్లడించారు. హన్మాజీపేట పరిసరాల్లో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారంతో పోలీసులు దాడి నిర్వహించారు. ఈ దాడిలో రామ్ రెడ్డి, దేవయ్య, సతీష్, భూమయ్య మరియు రణదీర్ రెడ్డిలను పోలీసులు పట్టుకున్నారు. నిందితుల వద్ద నుండి ఏడు వేల ఏడువందల యాభై రూపాయల నగదు, నాలుగు సెల్ ఫోన్లు, పేక ముక్కలను స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేశారు.ఈ సందర్భంగా ఎస్ఐ వెంకట్రాజం మాట్లాడుతూ, మండల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పేకాటతో పాటు గంజాయి వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచామని తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని ఆయన హామీ ఇచ్చారు.

## విధులకు గైర్హాజరైన రికార్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్: కలెక్టర్

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో రికార్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కె. చిరంజీవిని సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఉత్తర్వులు జారీ చేశారు. కె. చిరంజీవి విధులకు గైర్హాజరు కావడంతో పాటు, ఫోన్ కాల్స్‌కు స్పందించకపోవడం, వివరణ కోరుతూ జారీ చేసిన మెమోలను స్వీకరించకపోవడం గమనార్హమని కలెక్టర్ తెలిపారు.ఈ విషయంపై కమాన్‌పూర్ తహసీల్దార్ నివేదిక అందడంతో, సంబంధిత ఉద్యోగిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు.అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా, శాఖాపరమైన విచారణ చేపట్టనున్న నేపథ్యంలో, ఎ.పి. సివిల్ సర్వీసెస్ (సీసీఏ) నిబంధనల ప్రకారం శ్రీ కె. చిరంజీవిని సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు.సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసిన తేదీ నుండి అమల్లో ఉంటాయని, విచారణ పూర్తయ్యే వరకు కొనసాగుతాయని తెలిపారు. సస్పెన్షన్ కాలంలో సంబంధిత ఉద్యోగి ముందస్తు అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్స్‌ను వీడరాదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## వడ్ల కొనుగోలు నిర్లక్ష్యంపై జాతీయ రహదారిపై రాస్తారోకో



**ప్రజాపక్షం/కొడిమ్యాల:** జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం పూడూరు గ్రామం వద్ద సోమవారం రోజున జాతీయ రహదారిపై రైతులు,బిఆర్ఎస్,బిజెపి శ్రేణులు ధర్నా చేపట్టారు.వరి ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని ఆరోపిస్తూ రాస్తారోకు నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి మాట్లాడుతూ, “నలుబై కిలోల ధాన్యం గన్ని సంచితో పాటు వరి ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలి” అని డిమాండ్ చేశారు. ప్రస్తుత ప్రభుత్వం గతంలో అమలైన రైతు సంక్షేమ కార్యక్రమాలను విస్మరించి, రైతులకు ఇబ్బందులు కలిగించే విధానాలను అనుసరిస్తోందని ఆరోపించారు. సుమారు ముడు గంటల సేపు రహదారిపై ధర్నా కొనసాగడంతో వాహనాలు పెద్ద ఎత్తున నిలిచిపోయాయి. సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అడిషనల్ కలెక్టర్ హామీ మేరకు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో రవి శంకర్, కృష్ణ రావు, పులి వెంకటేష్, నరసింహ రెడ్డి,మాజీ ప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు.

## ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని సోమవారం ఎఐఎస్‌యఫ్ పెద్దపల్లి జిల్లా సమితి ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఎఐఎస్‌యఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు లెనిన్ మాట్లాడుతూ జిల్లా లోని చాలా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ఫీజులు, డెవలప్మెంట్ ఛార్జీలు, బిల్డింగ్ ఫండ్ మొదలైన పేర్లతో అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఇది విద్యార్థులపై మరియు వారి తల్లిదండ్రులపై తీవ్రమైన ఆర్థిక భారాన్ని మోపుతోంది. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫీజుల నియంత్రణ చట్టం అమల్లో ఉన్నప్పటికీ, దాని అమలు సరైన విధంగా జరగకపోవడం వల్ల విద్యా రంగంలో అన్యాయం జరుగుతోంది. విద్య ఒక హక్కు. దానిని వ్యాపారంగా మార్చి అధిక ఫీజులు వసూలు చేయడం అరికట్టాల్సిన అవసరం ఉంది. కాబట్టి ఈ సమస్యపై తక్షణ చర్యలు తీసుకుని విద్యార్థులకు, తల్లిదండ్రులకు న్యాయం చేయవలసిందిగా కోరారు.ఇట్టి కార్యక్రమంలో ఎఐఎస్‌యఫ్ జిల్లా అధ్యక్షులు సాయి ఆజాద్, నాయకులు రామగిరి రాజ్ కుమార్, ప్రకాష్, రాకేష్, ఆదిత్య, తదితరులు పాల్గొన్నారు.

## నేలల సంరక్షణ.. ఎరువుల వినియోగం కీలకం

### సన్న వడ్లు, ఆయిల్ పామ్ సాగు చేయాలి

### కలెక్టర్ గరిమ అగ్రవాల్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల:** సాగులో నేలల సంరక్షణ.. ఎరువుల వినియోగం కీలకమని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రైతు వారోత్సవాల సందర్భంగా నేలల సంరక్షణ.. ఎరువుల యాజమాన్యం.. ప్రకృతి వ్యవసాయం, సన్న వడ్లు, ఆయిల్ పామ్ సాగు పై తంగళ్లపల్లి మండలం తాడూరు గ్రామంలోని రైతు వేదికలో సోమవారం వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, సహకార శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి మార్చి 6వ తేదీన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. ఇందులో భాగంగా జూన్ 12వ తేదీ వరకు 10 శాఖల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 04 వ తేదీ నుంచి 09 వ తేదీ వరకు రైతు వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇష్టారీతిన ఎరువులు, పురుగు మందులు వాడిన పంట ఉత్పత్తుల వినియోగంతో అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రైతులు కచ్చితంగా శాస్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనల మేరకు సాగు చేయాలని సూచించారు.

**సన్నవడ్లు సాగు చేయాలి..**

రేషన్ దుకాణాలు, రెసిడెన్షియల్ విద్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలల్లో సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. అందరూ సన్న బియ్యం వినియోగిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న వడ్లు సాగు చేసే రైతులకు బోనస్ అందిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో నర్సింగం, అఫ్జల్ బేగం, శరత్, షర్ఫుద్దీన్, వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

## గోదావరిఖని జనరల్ ఆసుపత్రి సేవలు మెరుగుపరచాలి

### కలెక్టర్ కోయ శ్రీహర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** (రామగుండం) గోదావరిఖని జనరల్ ఆసుపత్రి సేవలను మరింత మెరుగు పరచాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు.సోమవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఆసుపత్రిలో పిల్లల విభాగానికి సంబంధించిన ఓపీ, ఐపీ సేవలను బలోపేతం చేయాలని ఆదేశించారు.అవసరమైతే అదనంగా పీడియాట్రిక్ వైద్యులను నియమించుకోవాలని సూచించారు. ఈఎన్టీ వైద్యుడిని కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియమించి ఆసుపత్రిలో శస్త్రచికిత్సలు త్వరితగతిన ప్రారంభించాల్సిందిగా పేర్కొన్నారు.ఆసుపత్రి అభివృద్ధి పనులను నిర్ణీత గడువుల్లో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో డాక్టర్.కృపాబాయి, డాక్టర్. శిరిష, డాక్టర్.రాజు,తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా చేయాలి

### మాజీ మంత్రి హరీష్‌రావు



**ప్రజాపక్షం/సిద్దిపేట :** కెసిఆర్ బయటకు వస్తే.. భయపడి ఎకరానికి రైతుబంధు వేసింది కాంగ్రెస్ ప్రభుత్వమని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. గత 22 రోజుల నుండి వడ్లు, మక్కలు కొనక రైతులు తిప్పలు పడుతున్నారన్నారు. సోమవారం సిద్దిపేట రూరల్ మండలం బుస్సాపూర్‌లో జరిగిన బీరప్ప మహాంకాళీ ఉత్సవాల్లో మాజీ మంత్రి హరీష్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆనంతరం మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ ఏ కొనుగోలు కేంద్రం చూసిన వడ్ల బస్తాలు. మక్కల బస్తాలతో రైతులు పడిగాపులు కాస్తున్నారన్నారు. కెసిఆర్ ఉన్నప్పుడు లేని తిప్పలు ఇప్పుడు ఎందుకు వచ్చిందన్నారు. రైతులపట్ల కాంగ్రెస్ చిన్నచూపు చూస్తుందన్నారు. బుస్సాపూర్‌లో వందశాతం యాదవులకు గొర్రెల యూనిట్ ఇచ్చిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వందే అన్నారు. సాగునీటి లిఫ్ట్‌తో బుస్సాపూర్‌కు కొద్ది రోజుల్లో పంటపొలాల వాకిట్లో సాగునీళ్ల వస్తున్నాయన్నారు. గ్రామంలో బీరప్ప ఉత్సవాలు 10 రోజుల పాటు ఘనంగా నిర్వహించటం సంతోషం వ్యక్తం చేశారు.గొర్రెలు డిడిలు కట్టిన ప్రతిఒక్కరికి వందశాతం గొర్రెలుపంపిణి చేసిన ఘనత బిఆర్ఎస్‌సర్కార్‌దే అన్నారు. గ్రామంలో అన్ని కుల సంఘాలకు భవనాలు నిర్మించినట్లు తెలిపారు. వడ్లు కొనుగోలు చేయకపోవటం వల్ల రైతులు 22రోజులుగా పడిగాపులు కాస్తున్నారన్నారు. వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

**హనుమాన్ మాలధారణ బిక్షలో పాల్గొన్న మాజీ మంత్రి హరీష్‌రావు**

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ పాల సాయిరాం ఆధ్వర్యంలో నిర్వహించిన హనుమాన్ భక్తుల బిక్ష కార్యక్రమంలో మాజీ మంత్రి హరీష్‌రావు పాల్గొన్నారు. అలాగే మార్కెండేయ ఆలయంలో బిక్ష కార్యక్రమంలో హరీష్‌రావు పాల్గొన్నారు.

## దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాని జిల్లా కలెక్టర్ హైమావతి అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి తమసమస్యల వినతులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలు పరిష్కారమవుతాయని నమ్మకంతో ప్రజావాణి కార్యక్రమానికి వచ్చేసి అందచేసిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హతల మేరకు వెంటనే పరిష్కరించేదిశగా అధికారులు కృషిచేయాలని సూచించారు.జిల్లాలో పరిష్కారం కోసం వచ్చేసిన ప్రజల నుండి మొత్తం 69 దరఖాస్తులను స్వీకరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో సిద్దిపేట, హుస్నాబాద్, గజ్వేల్, ఆర్డీఓ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి దరఖాస్తులను స్వీకరించారు. ఈకార్యక్రమంలో ఎఓ రాజ్‌కుమార్,అధికారులు పాల్గొన్నారు.

## దేశ విభజన వాదులకు గుణపాఠమిది

### బిజెపి కార్యకర్తల పోరాటాలు,త్యాగాలవల్లే బెంగాల్‌లో అధికారం దక్కింది

### మంత్రి బండి సంజయ్ కుమార్




**ప్రజాపక్షం/కరీంనగర్:** ఉత్తరాది, దక్షిణాది అని పదపదే మాట్లాడుతూ దేశాన్ని విభజించాలని కుట్రలు చేసిన వాళ్లకు ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు తగిన గుణపాఠం చెప్పాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. ముఖ్యంగా దక్షిణాదికి అన్యాయం జరుగుతోందంటూ గగ్గోలు పెట్టిన తమిళనాడు సీఎం స్టాలిన్, తోపాటు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రజలు బుద్ధి చెప్పారని అన్నారు. బీజేపీ కార్యకర్తల పోరాటాలు, త్యాగాలవల్లే బెంగాల్ లో అధికారం దక్కిందన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి రావడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. ఇకపై కాంగ్రెస్ పార్టీ ఏ రాష్ట్రంలోనూ అధికారంలోకి వచ్చే పరిస్థితులు లేవని, కాంగ్రెస్ ముక్త్ భారత్ కల నెరవేరబోతోందని అన్నారు. కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, కార్పొరేటర్ బోయినిపల్లి ప్రవీణ్ రావుతో కలిసి కరీంనగర్ లోని వెంకటాద్రి, రేనే ఆసుపత్రులకు వెళ్లిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పీఎంజే జువెలర్స్ దోపిడీ ఘటనలో గాయపడ్డ బాధితులను పరామర్శించారు. వారితో నేరుగా మాట్లాడారు. వారి ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లను ఆరా తీశారు. వారికి ప్రాణాపాయం ఏమీ లేదని డాక్టర్లు చెప్పారు. బెంగాల్‌లో బీజేపీ కార్యకర్తలు ఎంతో మంది బలిదానమయ్యారని, మమతా బెనర్జీ ప్రభుత్వ దాడులను తట్టుకుని పోరాడి విజయం సాధించారని, బెంగాల్‌లో అధికారంలోకి వస్తే కేంద్రంలో ఓడిపోతుందనే ప్రచారం కూడా సరికాదన్నారు.

**కాల్పుల్లో గాయపడ్డ బాధితులకు పరామర్శ**

జువెలరీ షాపు ఘటనలో గాయపడ్డ బాధితులను కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సోమవారం పరామర్శించారు. గాయపడ్డ వారికి ప్రాణాపాయం లేదని డాక్టర్లు చెప్పారని, సేల్స్ మేనేజర్ కు బుల్లెట్ తగిలింది. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లి సర్జరీ చేయడంతో ప్రాణాపాయం తప్పింది. ఘటన జరిగిన సమీపంలో జిల్లా కోర్టు కూడా ఉంది. అంత మాత్రాన వాళ్లకు అంటగడతామా? ఇదేం పద్దతి? అడ్డగోలుగా మాట్లాడటం సరికాదన్నారు. జరిగిన ఘటనపై డీజీపీతో మాట్లాడినట్లు బండి సంజయ్ తెలిపారు. హైదరాబాద్ నుండి టీమ్స్ వచ్చాయి. దుండుగలను పట్టుకుంటామని చెబుతున్నారని, జరిగిన ఘటనను పరిశీలిస్తే, భద్రతా వైఫల్యం కన్పిస్తోందన్నారు.

## నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

### జిల్లా వైద్యాధికారి డా. జి. సుజాత



**ప్రజాపక్షం/మెట్‌పల్లి:** జగిత్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. జి. సుజాత సోమవారం మెట్‌పల్లి పట్టణంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్–2010 ప్రకారం ప్రతి ప్రైవేట్ ఆసుపత్రి తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ సమయంలో పేర్కొన్న వైద్యులు, పారామెడికల్ సిబ్బందే సేవలు అందించాలని, సిబ్బందిలో మార్పులు జరిగితే వెంటనే నమోదు చేయించుకోవాలని తెలిపారు.ప్రసవాలు, శస్త్రచికిత్సలు సహా ఇతర వైద్య సేవలకు వసూలు చేసే ఫీజుల వివరాలను ఆసుపత్రుల్లో బోర్డుల రూపంలో ప్రదర్శించాలని ఆదేశించారు. నిరుపేదలకు మానవతా దృక్పథంతో తక్కువ ఖర్చుతో వైద్యం అందించాలని సూచించారు. ఆసుపత్రుల్లో బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్లు కటుకం భూమేశ్వర్,తరాల శంకర్,డీపీవో రవీందర్,తదితరులు పాల్గొన్నారు.

# కేరళలో యుడిఎఫ్ భారీ విజయం

## ఎల్‌డిఎఫ్‌కు 35 స్థానాలు

**తిరువనంతపురం:** కేరళ రాష్ట్ర శాసనసభ ఎన్నిక ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని ఐక్య ప్రజాతంత్ర సంఘటన (యుడిఎఫ్) ఘన విజయాన్ని సాధించింది. వరుసగా రెండుసార్లు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వామపక్ష ప్రజాతంత్ర సంఘటన ఓటమిని చవిచూసింది. మొత్తం 140 స్థానాల శాసనసభలో యుడిఎఫ్ 102 స్థానాలు గెలుచుకుంది. గత ఎన్నికలలో 99 స్థానాలను గెలుచుకున్నఎల్‌డిఎఫ్ 35 స్థానాలకు పరిమితమైంది. తాము అధికారంలోకి వస్తామన్న స్థాయిలో ప్రచారం చేసుకున్న బిజెపికి మూడు స్థానాలే దక్కాయి. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ పోటీ చేసిన నేమోం స్థానాన్ని కూడా ఆ పార్టీ గెలుచుకుంది. కజక్కూట్టం నుండి బిజెపి రాష్ట్ర మాజీ అధ్యక్షుడు వి. మురళీధరన్ గెలుపొందడంతో, ఆ పార్టీ ఖాతాలో మరో స్థానం చేరింది. అయితే, బిజెపికి బలం ఉన్నట్లు భావించే పాలక్కాడ్, మంజేశ్వరం, త్రిస్సూర్‌లలో ఓటమి చవి చూసింది.

**ఎల్‌డిఎఫ్‌కు నిరాశ :**
దాదాపుప్రతి సారి ఒక కూటమి అధికారంలోకి వచ్చే సంప్రదాయం ఉన్న కేరళలో గతం సారి ఎల్‌డిఎఫ్ రెండవసారి అధికారంలోకి వచ్చింది. అనేక మంచి పనులు చేయటమే కాకుండా, కేంద్ర ప్రభుత్వం సహకరించకున్నా అనేక సూచికల్లో కేరళ ముందంజలో ఉంది. అయినప్పటికీ, అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఎల్‌డిఎఫ్‌ను అత్యంత నిరాశ పరిచింది. గతంలో వచ్చిన స్థానాలలో మూడవ వంతుకు పరిమితమవడం ఊహించలేక పోయింది. మోదీ– విజయన్ ఒక్కటేనంటూ రాహుల్‌గాంధీ మొదలు, కాంగ్రెస్ నేతలంతా చేసిన ప్రచారం ప్రభావాన్ని చూపింది. జనాభాలో దాదాపు సగం ఉంటే ముస్లిం, క్రైస్తవ మైనారిటీలు కాంగ్రెస్ వైపు పెద్ద ఎత్తున మొగ్గ చూపారు. అలాగే ఎల్‌డిఎఫ్ వైపు ఉండే హిందూ వర్గాలకు చెందిన ఓటర్లు బిజెపికి కొంత పోవడంతో నష్టం జరిగింది. సిపిఐ(ఎం) కంచుకోటగా భావించే కన్నూర్‌తో సహా దాదాపు అన్ని జిల్లాల్లోనూ ఎల్‌డిఎఫ్ నష్టాలను చవిచూసింది. ముఖ్యంగా పయ్యన్నూర్, తాలిపరంబలలో సిపిఐ(ఎం) నుంచి బైటికి వెళ్ళి పోటీ చేసిన ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులతో పాటు, గతంలో ఎల్‌డిఎఫ్ నుంచి వెళ్ళిన మరో స్వతంత్ర అభ్యర్థి మొత్తం నలుగురు స్వతంత్రులు యుడిఎఫ్ సహకారంతో గెలుపొందడం గంభీరమైన పరిణామం. పినరయి విజయన్ మంత్రివర్గంలో ఏకంగా 12 మంది మంత్రులు ఓడిపోయారు. విజయన్ సైతం తన నియోజకవర్గం ధర్మదోంలో తొలి రౌండ్‌లలో వెనుకబడి, తిరిగి పుంజుకున్నారు. ఆరు రౌండ్ల ఓట్ల లెక్కింపు వరకు ముఖ్యమంత్రి వెనుకబడి ఉన్నారు. ఏడవ రౌండ్లో మాత్రమే ఆయన ముందుకు దూసుకెళ్లి విజయం సాధించగలిగారు. ఆధిక్యత కూడా గణనీయంగా తగ్గింది. గత ఎన్నికల్లో సిపిఐ(ఎం)కు 63 స్థానాలు రాగా, ఈసారి 26 వచ్చాయి. సిపిఐ 17 స్థానాలలో గెలుపొందగా, ఈ ఎన్నికల్లో 8 చోట్ల విజయం సాధించింది.

**యుడిఎఫ్‌కు రికార్డు స్థానాలు :**
కాంగ్రెస్‌కు ఎన్నికల ఫలితాలతో ఉబ్బితబ్బిబవుతోంది. రికార్డు స్థాయిలో యుడిఎఫ్ మొదటి సారి వంద సీట్లు దాటి 102 స్థానాను కైవసం చేసుకుంది. పట్టున్న తన సిట్టింగ్ సీట్లను గెలుచుకోవడమే కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా సిపిఐ(ఎం)కి చెందిన అనేక సీట్లను కూడా కైవసం చేసుకుంది. ప్రతిపక్ష నాయకుడు వి.డి. సతీసన్ పారావూర్ నుండి ఘన విజయం సాధించారు. కాంగ్రెస్ 63 స్థానాలలో, దాని ప్రధాన మిత్రపక్షం ముస్లీం లీగ్ 22 స్థానాలలో గెలుపొందింది. గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 22, ముస్లీం లీగ్‌కు 15 స్థానాలు దక్కాయి. చివరిసారిగా 2001లో కాంగ్రెస్‌కు 63 స్థానాలు లభించాయి.ఫలితాలలో గమనించదగ్గ విషయం ఏమిటంటే, కొన్ని చోట్ల తప్ప యుడిఎఫ్ అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలుపొందారు. కాంగ్రెస్ అగ్రనేత మొన్నటి వరకు వయనాడ్ నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించటం, ఆ తరువాత ఆయన సోదరి ఆ స్థానం నుంచి గెలుపొందడంతో కాంగ్రెస్‌కు కలిసివచ్చింది. తరచుగా వారు కేరళ రాష్ట్రంలో పర్యటిస్తుండడం కూడా ప్రభావం చూపింది.

### తక్కువకే బిజెపి పరిమితం :

పెద్ద ఎత్తున సీట్లను గెలుపొందుతామని ఊహించుకున్న బిజెపికి మూడు స్థానాలు మాత్రమే దక్కాయి. ఓట్ల శాతంలో కూడా పెద్దగా మార్పు రాలేదు. గత ఎన్నికల్లో 11.30 శాతం ఉన్న ఓట్లు, ఈ సారి 11.42 శాతం దక్కాయి. ఎల్‌డిఎఫ్ వ్యతిరేక ఓట్లలో అధిక వాటాను ఆకర్షించడంలో విఫలమవడం వల్లే ఆ పార్టీ మెరుగైన ప్రదర్శన చేయలేకపోయింది. ఎల్‌డిఎఫ్ వ్యతిరేక ఓట్లలో అత్యధిక భాగాన్ని యుడిఎఫ్‌కు దక్కించుకుంది.

| | | |
|---|---|---|
| **యుడిఎఫ్** | **–** | **102** |
| కాంగ్రెస్ | – | 63 |
| ఐయుఎంఎల్ | – | 22 |
| కేరళ కాంగ్రెస్ | – | 7 |
| ఆర్ఎస్‌పి | – | 3 |
| ఇండిపెండెంట్ | – | 3 |
| కెడిపి | – | 1 |
| కేరళ కాంగ్రెస్(జె) | – | 1 |
| ఆర్ఎంపిఐ | – | 1 |
| **ఎల్‌డిఎఫ్** | **–** | **35** |
| సిపిఐ(ఎం) | – | 26 |
| సిపిఐ | – | 8 |
| ఆర్‌జెడి | – | 1 |
| **ఎన్‌డిఎ** | **–** | **3** |
| బిజెపి | – | 3 |

# బెంగాల్ బిజెపి కైవసం

### సిఎం మమతా బెనర్జీ ఓటమి లెఫ్ట్ ఫ్రంట్, కాంగ్రెస్‌కు చెరో రెండు సీట్లు

**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నిక ఫలితాల్లో బిజెపి దూసుకెళ్లింది. రాష్ట్రంలో తొలిసారిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుంది. మెజారిటీ మార్కును దాటి, 200కు పైగా స్థానాల్లో భారీ ఆధిక్యంతో దూసుకుపోతూ టిఎంసి 15 ఏళ్ల పాలనకు ముగింపు పలికి అతి పెద్ద రాజకీయ పార్టీగా అవతరించింది. 294 స్థానాలుక గానూ 208 స్థానాల్లో విజయం సాధించింది. మరోవైపు, టిఎంసి 79 స్థానాల్లో గెలుపొందింది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ భవానీపూర్ నియోజకవర్గంలో బిజెపి నేత సువేందు అధికారి చేతులో ఓటమి పాలయ్యారు. కాంగ్రెస్ రెండు స్థానాల్లో, వామపక్ష సంఘటనలో సిపిఐ(ఎం) ఒక స్థానంలో, సెక్యులర్ ఫ్రంట్ ఒక స్థానంలో, గెలుపొందిన ఇతరులు రెండు చోట్లు విజయం సాధించారు. 294 మంది సభ్యులున్న అసెంబ్లీలో



ఓట్ల లెక్కింపు సగం దశకు చేరకముందే బిజెపి 148 స్థానాల సగం మార్కును దాటడం, ఈ భారీ ప్రభంజనం కేవలం అధికార మార్పిడినే కాకుండా, బెంగాల్ రాజకీయ ముఖచిత్రంలో ఒక నిర్మాణాత్మక మార్పును కూడా సూచిస్తోంది. 2021లో 38 శాతంగా ఉన్న బిజెపి ఓట్ల వాటా సుమారు 45 శాతానికి పెరగడం పార్టీ బలోపేతానికి, విస్తరణకు సంకేతంగా నిలుస్తుండగా, గత అసెంబ్లీ ఎన్నికల్లో 48 శాతంగా ఉన్న టిఎంసి ఓట్ల వాటా దాదాపు 40.94 శాతానికి పడిపోవడం, ఐదేళ్ల క్రితం ఆ పార్టీ ఘనవిజయానికి మూలస్తంభంగా నిలిచిన అన్ని నియోజకవర్గాల్లోనూ పట్టు కోల్పోవడాన్ని ప్రతిబింబిస్తోంది. బిజెపి విజృంభణ ఉత్తర బెంగాల్ నుంచి జంగల్‌మహల్ వరకు, సరిహద్దు జిల్లాల నుంచి పారిశ్రామిక ప్రాంతాల వరకు అన్ని భౌగోళిక ప్రాంతాల్లోనూ కనిపించింది. దిన్‌హాటా, గోసబా, బాఘ్‌ముండి, బంకురా, బిన్‌పూర్, నయాగ్రామ్ వంటి స్థానాలు గిరిజన, గ్రామీణ ప్రాంతాలలో పట్టును ప్రతిబింబించగా, అసన్‌సోల్ దక్షిణ, దుర్గాపూర్ పూర్వ మరియు కోల్‌కతాలలో ఆధిక్యాలు పారిశ్రామిక, పట్టణ ప్రాంతాలలో లాభాలను సూచించాయి. టిఎంసి ప్రతిఘటన కోల్‌కతాలోని భవానీపూర్, బల్లిగంజ్, ఎంటాలీ వంటి కొన్ని ప్రాంతాలకు, అలాగే సింగూర్, రైనా, జమాల్‌పూర్ వంటి చెల్లాచెదురుగా ఉన్న గ్రామీణ కంచుకోటలకు మాత్రమే పరిమితమైనట్లు కనిపించింది. టిఎంసికి ఈ ఓటమి ఒక నిర్మాణాత్మక చీలికను సూచిస్తుంది. 15 ఏళ్ల అధికారం తర్వాత, ఆ పార్టీ ఇప్పుడు అధికార పక్షం నుండి ప్రతిపక్ష పక్షానికి మారే పరివర్తన సవాలును ఎదుర్కొంటోంది. ప్రభుత్వ వ్యతిరేకత, అవినీతి ఆరోపణలు, సంస్థాగత అలసట అన్నీ కలిసి ఒక నిర్ణయాత్మక ఎదురుదెబ్బగా మారినట్లు కనిపిస్తున్నాయి. ఇది గత విజయాల వల్ల కప్పిపుచ్చబడిన బలహీనతలను బయటపెట్టింది. ఈ ఫలితం వ్యూహం, సమయం, అంతర్గత సమతుల్యతపై ప్రశ్నలను లేవనెత్తుతోంది, ముఖ్యంగా ఇటీవలి సంవత్సరాలలో సంస్థాగతంగా పెద్ద పాత్ర పోషించిన మమతా బెనర్జీ, ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీ మధ్య నాయకత్వ సంబంధాల విషయంలో ఇది స్పష్టమవుతోంది.

# 107 స్థానాల్లో టివికె సంచలనం

**చెన్నై :** తమిళనాడులో కొన్ని సంస్థలు ప్రకటించిన ఎగ్జిట్ పోల్స్ తలకిందులయ్యాయి. నటుడు, తమిళగ వెట్రి కళగం (టివికె) చీఫ్ విజయ్ సంచలనం సృష్టించారు. పార్టీని స్థాపించిన కేవలం రెండేళ్లకే చరిత్ర లిఖించారు. టివికె ఏర్పాటు తర్వాత తొలి సారి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలతో 'విజిల్' వేయించి మెజార్టీ స్థానాలు గెలవడం ద్వారా అటు సినిమాల్లోనే కాదు.. ఇటు పాలిటిక్స్‌లోనూ 'సూపర్ హిట్' కొట్టారు. పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గాల నుంచి బరిలోకి దిగిన విజయ్.. రెండు చోట్లా తన సమీప ప్రత్యర్థులను ఓడించి సత్తా చాటారు. మొత్తం 234 స్థానాలకు గానూ 107 స్థానాల్లో విజయం సాధించారు. డిఎంకె 60 స్థానాల్లో గెలుపొంది రెండవ స్థానంలో నిలిచింది. ముఖ్యమంత్రి స్టాలిన్ కొలత్తూరు నుంచి పోటీ చేసి



టివికె అభ్యర్థి విఎస్ బాబు చేతిలో ఓటమి పాలయ్యారు. ప్రతిపక్ష హోదా నిలబెట్టుకున్నారు. ఇక అన్నాడిఎంకె 47 సీట్లలో గెలుపొందగా, కాంగ్రెస్ ఐదు, డిఎండికె ఒకటి, మస్లింలీగ్ రెండు, సిపిఐ రెండు, సిపిఐ(ఎం) రెండు, విసికే రెండు, బిజెపి ఒకటి, పట్టాలి మక్కల్ కట్చి నాలుగు, ఎఎంఎకె ఒక స్థానాన్ని గెలుచుకున్నాయి.

# అసోంలో హ్యాట్రిక్

**గువాహటి :** అసోం అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో మూడింట రెండొంతుల మెజారిటీ సాధించి వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అధికార ఎన్‌డిఎ సిద్ధమైంది. 126 మంది సభ్యుల అసెంబ్లీలో బిజెపి 82 సీట్లు గెలుచుకోగా, దాని మిత్రపక్షాలు బోడో పీపుల్స్ ఫ్రంట్ (బిపిఎఫ్), అసోమ్ గణ పరిషత్ (ఎజిపి) 10 చొప్పున నియోజకవర్గాలు గెలుచుకున్నాయి. అసోం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ జలుక్‌బరి నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి బిదిషా నియోగ్‌పై 89,434 ఓట్లతో విజయం సాధించి వరుసగా ఆరోసారి విజయం సాధించారు. ప్రత్యర్థి శిబిరంలో, కాంగ్రెస్ 19 స్థానాల్లో విజయం సాధించగా, బద్రుద్దీన్ అజ్మల్ నేతృత్వంలోని ఎఐయుడిఎఫ్, అఖిల్ గొగోయ్ నేతృత్వంలోని రైజోర్ దళ్ చెరో రెండు స్థానాలు, తృణమూల్ కాంగ్రెస్ ఒక నియోజకవర్గాన్ని కైవసం చేసుకున్నాయి. కాంగ్రెస్‌కు పెద్ద దెబ్బగా, దాని రాష్ట్ర అధ్యక్షుడు గౌరవ్ గొగోయ్ జోర్హాట్‌లో ప్రముఖ రాజకీయ నాయకుడు, సిట్టింగ్ బిజెపి ఎమ్మెల్యే హితేంద్రనాథ్ గోస్వామి చేతిలో 23,181 ఓట్ల తేడాతో ఓడిపోయారు.



# పుదుచ్చేరిలో మళ్లీ రంగస్వామి

**పుదుచ్చేరి :** కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు తగ్గట్లుగానే ఆల్‌ఇండియా ఎన్ఆర్ కాంగ్రెస్ (ఎఐఎన్ఆర్‌సి) విజయకేతనం ఎగురవేసింది. సిఎం రంగస్వామి నాయకత్వం కీలక పాత్ర పోషించింది. రంగసామికి ఉన్న క్లీన్ ఇమేజ్ ఎన్‌డిఎ గెలుపును మరింత సులభతరం చేసింది. అంతేకాకుండా ఆయనకు ప్రజల్లో ఉన్న ఆదరణ కూడా ఎక్కువే. హంగూ ఆర్భాటాలకు దూరంగా ఉంటూ సాధారణంగా జీవిస్తుంటారు. ఆయన అవివాహితుడు. ఆయనది సింపుల్ లైఫ్‌స్టైల్. మొత్తం 30 అసెంబ్లీ స్థానాల్లో ఎన్‌డిఎ కూటమి మ్యాజిక్ ఫిగర్‌ను దక్కించుకుంది. వరుసగా రెండోసారి అధికార పీఠాన్ని చేజిక్కించుకుంది. ఎఐఎన్ఆర్ కాంగ్రెస్‌కు 12 సీట్లు, బిజెపికి నాలుగు, ఎల్‌జెకె ఒకటి, అన్నాడిఎంకె ఒకటి, కాంగ్రెస్ ఒకటి, డిఎంకె ఐదు, టివికె రెండు, నెయ్యం మక్కల్ కళగమ్ ఒకటి, ఇతరులు మూడు స్థానాల్లో విజయం సాధించారు. ఇక విసికే అసలు ఖాతా తెరవలేదు.



# దక్షిణాదిలో బిజెపికి తగ్గిన సీట్లు!

### 10 నుంచి 8 సీట్లకు పడిపోయిన బలం

**హైదరాబాద్:** దక్షిణాది రాష్ట్రాలలో బిజెపికి ఈసారి నిరాశే ఎదురైంది. ఐదు శాసనసభలకు జరిగిన ఎన్నికల్లో మూడు దక్షిణభారతంలోనే ఉన్నాయి. అవి తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి. మూడు చోట్ల కలిపి గత ఎన్నికల్లో బిజెపి 10 చోట్ల గెలవగా, ఈ సారి కాషాయ పార్టీ బలం 8 స్థానాలకు పడిపోయింది. తాజా ఎన్నికలలో పుదుచ్చేరిలో 4, తమిళనాడులో ఒకటి, కేరళలో మూడు స్థానాలు లభించాయి. కేరళలో సున్నా నుంచి ఈ సారి 3 చోట్ల విజయం సాధించగా, ఓట్ల శాతం 11.30 నుంచి 11.42 శాతమైంది. తమిళనాడులో క్రితం సారి 4 స్థానాలలో గెలుపొందగా, ఈసారి ఒక్కటే సీటు దక్కింది. రెండు సార్లు అన్నా డిఎంకె కూటమిలో బిజెపి భాగస్వామిగా ఉంది. అక్కడ కూడా గత ఎన్నికల్లో 2.62 శాతం ఓట్లు పోలవ్వగా, ఈ సారి 2.98 శాతం లభించాయి. పుదుచ్చేరిలో ఆలిండియా ఎన్.ఆర్. కాంగ్రెస్ కూటమిలో ఉన్న బిజెపికి గతం కంటే సీట్లు, ఓట్లు తగ్గాయి. పోయినసారి 6 సీట్లు (13.66 శాతం ఓట్లు) సాధించగా, తాజా ఎన్నికల్లో 4 సీట్లు (12.26 శాతం ఓట్లు) మాత్రమే సాధించగలిగింది. కడపటి వార్తలు అందేసరికి గత బిజెపికి 3 శాసనసభలో 2021, 2026లో దక్కిన సీట్లు, ఓట్ల శాతం వివరాలు ఇలా ఉన్నాయి.

| రాష్ట్రం | 2021 సీట్లు (ఓట్ల శాతం) | 2026 సీట్లు (ఓట్ల శాతం) |
|---|---|---|
| పుదుచ్చేరి | 6 (13.66%) | 4 (12.33%) |
| తమిళనాడు | 4(2.62%) | 1 (2.97%) |
| కేరళ | 0(11.30%) | 3 (11.42%) |
| **మొత్తం** | **10** | **8** |

# కేరళలో 8 చోట్ల సిపిఐ విజయం

**తిరువనంతరపురం:** ఐదు శాసనసభలకు జరిగిన ఎన్నికల్లో భారత కమ్యూనిస్టు పార్టీ రెండు రాష్ట్రాలలో తన ప్రాతినిధ్యాన్ని నిలబెట్టుకుంది. కేరళలో ఎల్‌డిఎఫ్ ఊహించని రీతిలో ఓటమి పాలనప్పటికీ, సిపిఐ ప్రదర్శన కొంత మేరకు మెరుగ్గానే ఉందని చెప్పవచ్చు. ఎల్‌డిఎఫ్ మంత్రి వర్గంలో 20 మంది పోటీ చేయగా 3 మ ంత్రులు ఓటమిపాలైనప్పటికీ, సిపిఐ నుంచి ప్రాతినిధ్యం వహించిన నలుగురు మంత్రుల్లో ఒక్కరు మాత్రమే ఓడిపోవడం గమనార్హం. మిగతా ముగ్గురు రెవెన్యూ శాఖ మంత్రి కె.రాజన్, ఆహారం, పౌరసరఫరాల మంత్రి జి.ఆర్.అనిల్, వ్యవసాయ మంత్రి పి.ప్రసాద్‌లు మంచి మెజారిటీలతోనే గెలుపొందారు. పశుసంవర్థక, పాల ఉత్పత్తి అభివృద్ధి శాఖ మంత్రి జె.చించురాణి మాత్రం కేవలం 7వేల పైచీలుకు స్వ ల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. పట్టంబి నుంచి గతంలో జెఎన్‌యు విద్యార్థి నాయకుడిగా ఉన్న ముహమ్మద్ ముహాస్సిన్, ఒల్లూరు నుంచి కె.రాజన్ హ్యాట్రిక్ విజయాలు సాధించారు. నట్టిక నుంచి మధ్యలో ఒక సారి విరామం తరువాత మూడవ సారి గెలుపొందారు. కేరళలో సిపిఐ 25 స్థానాలలో పోటీ చేసి 8 చోట్ల విజయం సాధించింది. గత ఎన్నికల్లో 23 స్థానాలలో పోటీ చేసి 17 గెలుపొందింది. ఎల్‌డిఎఫ్ స్థానాలు మూడింట రెండొంతులు పడిపోగా, అందులో సిపిఐ స్థానాలు సగం మాత్రమే తగ్గాయి. ఈ సారి సిపిఐ తరుపున గెలుపొందిన విజేతల వివరాలు

### ఒక్కరు మినహా ముగ్గురు మంత్రులు గెలుపు
### తమిళనాడులో 2 స్థానాలలో మరోసారి విజయం
### రెండు రాష్ట్రాలలో సిపిఐకి 10 స్థానాలు

| నియోజకవర్గం | విజేత | మెజారిటీ |
|---|---|---|
| నెడమంగడ్ | జి.ఆర్.అనిల్ | 21,583 |
| పునలూర్ | సి.అజయప్రసాద్ | 21,529 |
| కన్హన్‌గడ్ | గోవిందన్ పల్లికప్పిల్ | 15,316 |
| చెర్తాల | పి.ప్రసాద్ | 14,489 |
| కైపమంగళం | కె.కె.వల్సరాజ్ | 9,944 |
| పట్టంబి | ముహమ్మద్ ముహాస్సిన్ | 9,442 |
| ఒల్లూరు | కె.రాజన్ | 8,884 |
| నట్టిక | గీతా గోపి | 7,093 |


## కేరళలో గెలుపొందిన సిపిఐ అభ్యర్థులు



సి.అజయ్ ప్రసాద్ పునలూర్
జి.ఆర్.అనిల్ నెడమంగడ్
గీతాగోపి నట్టిక
గోవిందన్ పల్లికప్పిల్ కన్హన్‌గడ్
కె. రాజన్ ఒల్లూరు
కె.కె.వల్సరాజ్ కైపమంగళం
ముహమ్మద్ ముహాస్సిన్ పట్టంబి
పి.ప్రసాద్ చెర్తాల

### తమిళనాడులో 2 స్థానాలను నిలబెట్టుకున్న సిపిఐ

తమిళనాడు రాష్ట్రంలో సిపిఐ గత ఎన్నికల్లో గెలిచిన రెండు సిట్టింగ్ స్థానాలను సిపిఐ నిలబెట్టుకుంది. రెండు చోట్ల సిట్టింగ్ ఎంఎల్‌ఏలే గెలుపొందారు. టివికె గాలి వీచినప్పటికీ థళి నియోజకవర్గం నుంచి టి.రామచంద్రన్ 5,240 ఓట్ల మెజారిటీతో, తిరుత్తరైపూండీ స్థానం నుంచి కె.మారిముత్తు 12,922 ఓట్ల ఆధికత్యతతో గెలుపొందారు.వీరిద్దరూ గత శాసనసభలో కూడా ఎంఎల్‌ఏలుగా గెలుపొందారు. సిపిఐ(ఎం) కూడా రెండు స్థానాలలో గెలిచింది. ఆ పార్టీ తరపున గత ఎన్నికల్లో గెలిచిన కిల్వేలూరు స్థానం నుంచి కొత్త అభ్యర్థి టి.లత 2,278 ఓట్లు, అలాగే ఈసారి కొత్తగా పద్మనాభపురం నియోజకవర్గం నుంచి ఆర్.చెల్లస్వామి 15,569 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. తమిళనాడులు ఉభయ కమ్యూనిస్టు పార్టీలు 5 స్థానాల చొప్పున పోటీ చేయగా, చెరి 2 చోట్ల విజయం సాధించాయి.



కె.మారిముత్తు తిరుత్తరైపూండీ
టి.రామచంద్రన్ థళి

# తొలి ఎన్నికల్లోనే 'టివికె' ప్రభంజనం

**న్యూఢిల్లీ :** తమిళనాడులో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రధాన పోటీదారుగా ఉన్న, నటుడు, రాజకీయవేత్త విజయ్ టివికె పార్టీ అద్భుతమైన ఎన్నికల అరంగేట్రం చేసింది. అతి కొద్ది కాలంలోనే 'యూనికార్న్‌లు'గా మారిన అతి కొన్ని రాజకీయ 'స్టార్టప్‌ల'పై దృష్టి కేంద్రీకరించింది. తమిళగ వెట్రి కజగం (టివికె), తన తొలి ఎన్నికల బరిలోనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), అసోం గణ పరిషత్ (ఎపిజి), తెలుగు దేశం పార్టీ (టిడిపి) వంటి పార్టీల బాటలోనే నడిచిందని చెప్పవచ్చు. ఆప్ 2013లో తన తొలి ఎన్నికల తర్వాత కాంగ్రెస్ మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగా, ఎజిపి 1985లో ఏర్పడిన వెంటనే అసోం ఉద్యమంతో అనుబంధం ఉన్న విజయవంతమైన స్వతంత్ర అభ్యర్థుల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. టిడిపి ఏర్పడిన ఒక సంవత్సరం తర్వాత, 1983లో జరిగిన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలలో 201 స్థానాలను గెలుచుకుని భారీ మెజారిటీతో ఘన విజయం సాధించింది. అయితే, యూనికార్న్‌లుగా మారిన రాజకీయ స్టార్టప్‌లు చాలా తక్కువ. కొన్నింటికి సమయం పట్టగా, మరికొన్ని తమదైన ముద్ర వేయడంలో విఫలమయ్యాయి. గత ఏడాదే జన సూరజ్ పార్టీ పతనమైంది. అంతేకాక, బలమైన ప్రచారం పొంది, ఎన్నికలలో విజయం సాధించలేకపోయిన ఇతర పార్టీలు కూడా ఉన్నాయి. ఉదాహరణకు, నటుడురాజకీయ నాయకుడు కమల్ హాసన్ స్థాపించిన 'మక్కల్ నీది మైయం' 2021 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలలో ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయింది. టివికె ప్రారంభం నుంచే బలమైన ప్రచారం సృష్టించింది. గతంలో దక్షిణాదిలో సినీ తారలు ఏర్పాటు చేసిన అనేక రాజకీయ 'స్టార్టప్‌లు' మంచి పనితీరు కనబరచడంతో, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలలో దానిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. దశాబ్దాలుగా రాష్ట్రంలోని రెండు ప్రధాన పార్టీలైన డిఎంకె, ఎఐఎడిఎంకెలను ఓడించి, తమిళనాడులో ఒక పెద్ద రాజకీయ ప్రకంపన సృష్టించి, టివికె అందరినీ ఆశ్చర్యపరిచింది. కాగా, బిహార్‌లో పుష్పమ్ ప్రియా చౌదరి నేతృత్వంలోని ప్లూరల్స్ పార్టీ వంటి అనేక చిన్న 'స్టార్టప్' పార్టీలు ఉన్నాయి. అలాగే, జీతన్ రామ్ మాంఝీ కి చెందిన హిందుస్తానీ ఆవామ్ మోర్చా (సెక్యులర్), ఉపేంద్ర కుష్వాహాకు చెందిన రాష్ట్రీయ లోక్ మోర్చా వంటి పరిమిత ఆశయాలు కలిగి, కొన్ని ప్రాంతాలకే పరిమితమై మనుగడ సాగించే చిన్న పార్టీలు కూడా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌లో నిషాద్ పార్టీ, పీస్ పార్టీ, అప్నా దళ్ (సోనేలాల్), సుహెల్దేవ్ భారతీయ సమాజ్ పార్టీ (ఎస్‌బిఎస్‌పి) వంటి పార్టీలు ఉన్నాయి. భారతదేశంలో పార్టీలు ఏర్పడుతూనే ఉంటాయి, కానీ ఎన్నికలలో పేలవమైన ప్రదర్శన తర్వాత, పెద్దగా సంచలనం సృష్టించకుండా కనుమరుగవుతాయి. కానీ ప్రశాంత్ కిషోర్ యొక్క జన్ సూరజ్ గురించి అలా చెప్పలేము, ఎందుకంటే అది ఊహించిన దానికంటే ఎక్కువే సృష్టించింది. బిహార్ ఎన్నికలలో ఇది తదుపరి ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)గా ఆవిర్భవిస్తుందని చాలామంది అంచనా వేశారు. అయితే, దాని చుట్టూ ఉన్న మీడియా హంగామా ఒక మిరాజ్‌గా (మాయగా) నిరూపించబడింది, ఎందుకంటే ఆ పార్టీ ఎన్నికలలో పూర్తిగా నాశనమై, పోటీ చేసిన 238 స్థానాలలో దేనిలోనూ ఖాతా తెరవడంలో విఫలమైంది. దేశ రాజకీయ ముఖచిత్రాన్ని పరిశీలిస్తే, ఆరు జాతీయ పార్టీలు ఉన్నాయి బిజెపి, కాంగ్రెస్, బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్‌పి), కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) (సిపిఎం), నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పిపి), ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్). కాంగ్రెస్ స్వాతం త్ర్య ఉద్యమం నుండి ఆవిర్భవించగా, బిజెపి ఒక సిద్ధాంతం నుండి పుట్టి, రామజన్మభూమి ఉద్యమం నుండి లబ్ధి పొందింది. సిపిఐ(ఎం) సిద్ధాంతం ఆధారంగా నిర్మించబడింది, తన మాతృ పార్టీ నుండి విడిపోయిన ఒక ప్రముఖ రాజకీయ నాయకుడిచే ఎన్‌పిపి ఏర్పడింది, బిఎస్‌పి ఒక సామాజిక వర్గం చుట్టూ నిర్మించబడింది. ఆప్ 'ఇండియా ఎగైనెస్ట్ కరప్షన్' ఉద్యమం నుండి ఉద్భవించింది. కొత్తగా పుట్టుకొచ్చిన రాజకీయ పార్టీలలో చాలా తక్కువ మాత్రమే రాణించాయి. ఆప్ 2012లో ఆవిర్భవించగా, ప్రాంతీయ తెలుగుదేశం పార్టీ (టిడిపి) 1982లో ఆవిర్భవించింది. అయితే, టిడిపి మాత్రం సినీ నటుడు ఎన్.టి. రామారావు ప్రజాదరణపై ఆధారపడింది. పశ్చిమ బెంగాల్‌లోని తృణమూల్ కాంగ్రెస్, ఒడిశాలోని బిజు జనతా దళ్, తెలంగాణలోని ఎఐఎంఐఎం వంటి ప్రాంతీయ శక్తి కేంద్రాలుగా ఆవిర్భవించిన పార్టీలు, మాతృ పార్టీ నుండి విడిపోయిన



ఒక సుపరిచిత రాజకీయ నాయకురాలి (మమతా బెనర్జీ) వల్ల గానీ, లేదా వంశపారంపర్య ఆదరణ (నవీన్ పట్నాయక్, అసదుద్దీన్ ఒవైసి) వల్ల గానీ లాభపడ్డాయి. ఎఐఎంఐఎం చాలా కాలం క్రితమే ఏర్పడినప్పటికీ, అది ఒవైసీ నాయకత్వంలోనే ప్రజాదరణ పొందింది. లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్), ఎన్‌సిపి (ఎస్‌పి), శివసేన (యుబిటి) వంటి ఇతర పార్టీలు కూడా చీలిక వర్గాలు లేదా వంశపారంపర్య సత్సంబంధాలు అనే రెండు వర్గాలలో ఒకదానిలోకి వచ్చే ఉదాహరణలే. విడుదలై చిరుతైగళ్ కచ్చి (విసికె) దళితుల రక్షణ ఉద్యమం చుట్టూ నిర్మించబడింది, తమిళనాడులో పరిమిత విజయాన్ని సాధించింది. కానీ టివికె ఎన్నికల రంగ ప్రవేశం, ఒక రాజకీయ స్టార్టప్‌ను ప్రారంభించాలనే ఆలోచనలో ఉన్న వారిలో విశ్వాసాన్ని నింపగలదు. ఏది ఏమైనప్పటికీ, టివికెకు ఇది ఒక బ్లాక్‌బస్టర్ రాజకీయ రంగ ప్రవేశం మరియు చాలా మంది 'రీమేక్' చేయడానికి స్ఫూర్తి పొందుతారు.


# 'నోటా'కు తగ్గిన ఆదరణ

### ఒక్క అసోంలోనే 1.29 శాతం నోటాను ఎంచుకున్న ఓటర్లు




**న్యూఢిల్లీ :** ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. అయితే ఈ ఎన్నికల్లో 'నోటా'కు ఓటర్ల ఆదరణ మరోసారి లభించలేదని స్పష్టమవుతోంది. అసోం మినహా, మిగిలిన రాష్ట్రాల్లో ఏ ఒక్కచోట కూడా నోటా ఎం పిక ఓట్ల శాతం ఒక శాతం దాటలేదు. అసోంలో 1.29 శాతం మంది ఓటర్లు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై (ఇవిఎంలు) నోటా బటన్‌ను నొక్కగా, పశ్చిమ బెంగాల్‌లో 0.81 శాతం మంది ఈ ఎంపికను వినియోగించుకున్నారు. 0.73 శాతం మంది ఓటర్లు ఈ ఎంపికను వినియోగించుకోవడంతో పుదుచ్చేరి మూడవ స్థానంలో నిలిచింది. కేరళలో 0.58 శాతం మంది ఓటర్లు నోటా బటన్‌ను నొక్కగా, తమిళనాడులో 0.41 శాతం మంది ఈ ఎంపికను ఎంచుకున్నారు. వివిధ రా ష్ట్రాల్లో నోటా ఓట్ల పంపిణీలో స్వల్ప వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి; ఇవి ఆయా ప్రాంతాల రాజకీయ పరిస్థితులు, ఓటర్ల అభిరుచులు, రాజకీయ వ్యవహారాల్లో వారి భాగస్వామ్య స్థాయిలను ప్రతిబింబిస్తున్నాయి. ఎన్నికల సంఘం వెల్లడించిన గణాంకాల ప్రకారం, 2013లో ప్రవేశపెట్టినప్పటి నుండి ఇప్పటివరకు జరిగిన ఎన్నికల్లో, 2024 లోక్‌సభ ఎన్నికల్లోనే ఇవిఎంలలోని నోటా ఎంపిక అత్యల్ప శాతం ఓట్లను నమోదు చేసుకుంది. లోక్‌సభ ఎన్నికల్లో ఈ ఎంపికను మొట్టమొదటిసారిగా 2014 లో అమలు చేశారు. గత లోక్‌సభ ఎన్నికల గణాంకాలతో కూడిన ఎన్నికల సంఘం ప్రచురణ 'అట్లాస్ 2024' ప్రకారం, గత మూడు లోక్‌సభ ఎన్నికల కాలంలో నోటా ఓట్ల శాతం క్రమంగా త గ్గుతూ వచ్చింది; 2014లో 1.08 శాతంగా ఉన్న ఈ శాతం, 2024 నాటికి 0.99 శాతానికి పడిపోయింది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై ఉండే నోటా ఎంపికకు ఒక ప్రత్యేక చిహ్నం ఉంది— అది, మధ్యలో నల్లటి గీత (క్రాస్ గుర్తు) కలిగిన ఒక బ్యాలెట్ పత్రం. సెప్టెంబర్ 2013లో సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు, ఇవిఎంలలోని ఓటింగ్ ప్యానెల్‌లో చివరి ఎంపికగా ఎన్నికల సంఘం నోటా బటన్‌ను చేర్చింది. సుప్రీంకోర్టు ఆ దేశాలకు ముందు, ఏ అభ్యర్థికి ఓటు వేయడానికి ఇష్టపడని ఓటర్లకు, సాధారణంగా 'ఫారం 49 ఒ' అని పిలువబడే పత్రాన్ని నింపే వెసులుబాటు ఉండేది. అయితే, 'ఎన్నికల నిర్వహణ నియమాలు1961'లోని నియమం 49ఒ ప్రకారం పోలింగ్ కేంద్రంలో ఆ ఫారాన్ని నింపడం వల్ల, ఓటరు గోప్యతకు భంగం కలిగేది. అయితే, ఓటింగ్ సమయంలో మెజారిటీ ఓటర్లు నోటా ఆప్షన్‌ను వినియోగించుకుంటే, తిరిగి ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించడానికి సుప్రీం కోర్టు నిరాకరించింది.
అసోం, పుదుచ్చేరి, తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో కొత్త ప్రభుత్వాలను ఎన్నుకోవడానికి ఏప్రిల్ నెలలో వేర్వేరు తేదీల్లో పోలింగ్ జరిగింది, సోమవారం ఓట్ల లెక్కింపు జరిగింది.

## మా అనుమతి లేకుండా
# మానస సరోవర్ యాత్ర కుదరదు



**లిపులేఖ్ కనుమ భూభాగం మా సొంతం**

**భారత్– చైనాలకు నేపాల్ లిఖిత హెచ్చరిక**

**అభ్యంతరాన్ని తిరస్కరించిన కేంద్ర ప్రభుత్వం**

**దౌత్యమార్గ పరిష్కారానికి నేపాల్ ప్రతిపాదన**

**కాఠ్మండు:** లిపులేఖ్ కనుమ ద్వారా రాకపోకలు చేసే విషయంలో భారత్–చైనా దేశాలకు నేపాల్ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం తెలియజేసింది. లిపులేఖ్ పాస్ నేపాల్ భూభాగమని, తమ అనుమతి లేకుండా భారత్–చైనాలు ఎలాంటి కార్యకలాపాలూ నిర్వహిండానికి వీల్లేదని హెచ్చరించింది. ఐతే నేపాల్ విదేశీమంత్రిత్వశాఖ ప్రకటన వెలువడిన వెంటనే భారత ప్రభుత్వం నేపాల్ అభ్యంతరాన్ని తోసిపుచ్చింది. ఈ ప్రాంతంలో రోడ్ల విస్తరణ, సరిహద్దువాణిజ్యం, తీర్థయాత్రా కార్యకలాపాలు వంటివాటికి దూరంగా ఉండాలని పేర్కొంటూ నేపాల్ అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ ఇరు దేశాలకు లిఖిలపూర్వక నోటీసులు జారీ చేశారు. లిపులేఖ్ మార్గం ద్వారా మానస సరోవర్,కైలాస్ యాత్రలు చేసేందుకు భారత ప్రభుత్వం ఒక ప్రణాళిక రూపొందించింది. దీనిపై నేపాల్ అభ్యంతరం తెలియజేసింది. తమ జోక్యం, ప్రమేయం లేకుండా, తమకు చెప్పకుండా ఈ భూభాగాన్ని మీరెలా వాడుకుంటారని ప్రశ్నించింది. లిపులేఖ్‌పై భారత్‌తో చర్చలకు నేపాల్ ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసింది. తన సరిహద్దులను విస్తరించే ఉద్దేశం నేపాల్‌కు లేదని, ఈ భూభాగం వాస్తవానికి తమదేనని ఆ దేశ ప్రభుత్వ ప్రతినిధి సస్మిత్ పోఖరేల్ మీడియాతో చెప్పారు. దౌత్యమార్గాల్లో ఈ సమస్య పరిష్కరించుకోవాల్సి ఉందన్నారు. చైనా ప్రభుత్వానికి కూడా ఈ లిపులేఖ్ మార్గాన్ని ఉపయోగించడంపై ఇదేవిధంగా తీవ్ర అభ్యంతరం తెలియజేశామని రామచంద్రపౌడెల్ ఆ లేఖలో తెలియజేశారు. నేపాల్ విదేశీమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి లోక్‌బహదూర్ పౌడెల్ ఛెత్రి ఒక ప్రకటన చేస్తూ, ఈ కనుమ ద్వారా మతపరమైన యాత్రలు చేసేందుకు భారత్ ప్రణాళిక చేసిందని, తమకు చెప్పకుండా ఈ ప్రణాళిక చేశారని, దీనిపై పొరుగుదేశాలకు దౌత్య మార్గాల ద్వారా తమ అభ్యంతరాలను తెలియజేశామని పేర్కొన్నారు. కోవిడ్ మహమ్మారి విజృంభించిన తర్వాత గడచిన ఆరేళ్ళుగా లిపులేఖ్ కనుమ మార్గంలో రాకపోకలను భారత్ మూసివేసింది. ఇప్పుడు మళ్ళీ ఏకపక్షంగా యాత్ర ద్వారా పునరుద్ధరించాలని భారత ప్రభుత్వం తలపెట్టడంతో నేపాల్ తీవ్రంగా స్పందించింది. ఐదేళ్ళ విరామం తర్వాత గత ఏడాదిలోనే కైలాస్,మానస సరోవర్ యాత్రలను భారత్ పునరుద్ధరించింది. భారత్–చైనా మధ్య సంబంధాల సాధారణీకరణ తర్వాత ఈ ప్రక్రియ మొదలైంది. టిబెట్ స్వయంప్రతిపత్తి ప్రాంతంలో ఉన్న కైలాస్, మానస సరోవర్ సరస్సుతో హిందువులు, బౌద్ధులు, జైనులకు ఎంతో భావోద్వేగపూర్తిమైన పురాతనకాలపు అనుబంధం ఉంది. ఈ ఏడాది జూన్, ఆగస్టు ప్రాంతాలలో కైలాస్, మానస సరోవర్ యాత్రలు ప్రారంభమవుతాయని ఏప్రిల్ 30వ తేదీన భారత విదేశీవ్యవహారాల శాఖ ప్రకటించిన తర్వాత నేపాల్ ప్రతిస్పందించింది. 816 సుగౌలీ ఒప్పందం ప్రకారం ఈ కనుమతోపాటు మహాకాళి నదికి లింపియాధుర, లిపులేఖ్, కాలాపానీ ప్రాంతాలు నేపాల్‌లో అంతర్భాగాలని ఈ వైఖరికి తమ ప్రభుత్వం చాలా దృఢంగా, స్పష్టంగా కట్టుబడి ఉందని లోక్‌బహదూర్ పౌడెల్ చెప్పారు. భారత్‌తో స్నేహపూర్వక సంబంధాలు, చారిత్రక ఆధారాలు, పటాలు ద్వారా దౌత్య మార్గాల్లో పరిష్కారాలకు నేపాల్ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. గత ఏడాది ఆగస్టులో చైనా విదేశీమంత్రి వాంగ్ యీ భారత్ పర్యటనలో రెండు దేశాలమధ్యా లిపులేఖ్ కనుమ ద్వారా వాణిజ్య పునరుద్ధరణకు ఒప్పందం కుదిరింది. అప్పుడే నేపాల్ అభ్యంతరం చెప్పి దౌత్య పరిష్కారానికి పిలుపు ఇచ్చింది. భారత్‌కు చెందిన ఉత్తరాఖండ్ రాష్ట్రం, చైనాకు చెందిన టిబెట్ ప్రాంతాలకు మధ్య హిమాలయ పర్వతాల్లో ఈ రెండు దేశాలను ఏకంచేసే చౌరాస్తాలో నేపాల్‌కు వెళ్ళే మార్గం కూడా ఉంది. ఈ కనుమ ప్రాంతం తమదేనని నేపాల్ వాదిస్తున్నది. పురాతన కాలం నుండి భారత్, చైనా మధ్య ప్రయాణించే వ్యాపారులు, యాచకులు, యాత్రికులు ఈ కనుమను ఉపయోగిస్తూ వచ్చారు. ఇప్పుడు నేపాల్ కొత్తగా అభ్యంతరాలు లేవనెత్తింది.

## ఓక్లహోమాలో కాల్పులు

**15 మందికి గాయాలు**

**ఓక్లహోమా:** అమెరికా ఓక్లహోమా నగరం ఎడ్మండ్‌లోని ఆర్కడియా లేక్ వద్ద ఆదివారం రాత్రి పొద్దుపోయిన తర్వాత జరిగిన ఒక పార్టీలో కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో 15 మంది అతిథులు గాయపడ్డారు. వారిని తక్షణం ఆసుపత్రులకు తరలించారు. ఈ కాల్పుల ఘటనతో ఆ ప్రాంతంలో తీవ్ర గందరగోళం చెలరేగింది. భారీ సంఖ్యలో అంబులెన్సులు ఆ ప్రాంతానికి తరలివచ్చాయి. ఎంత మంది గాయపడ్డారనే సంఖ్యను పోలీసులు వెంటనే చెప్పలేకపోయారు. ఎడ్మండ్ పోలీసు ప్రతినిధి ఎమిలీ వార్డ్ మీడియాతో మాట్లాడుతూ, పార్టీ జరుగుతున్న సమయంలో అక్కడి నుండి అనేకమంది ఫోన్లు చేశారని,కాల్పులు జరుగుతున్నాయని చెప్పడంతో భారీ సంఖ్యలో అంబులెన్స్‌లను మోహరించామని చెప్పారు. ఐతే ఎందుకు కాల్పులు జరిగాయి? ఎవరు జరిపారు? దీని వెనుక కారణం ఏమిటి? అనే విషయాలపై ఎలాంటి స్పష్టతా లేదు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఫిలిప్పీన్స్‌లో పెల్లుబికిన వాల్కనో

**300 కుటుంబాల తరలింపు**

**మనీలా:** ఫిలిప్పీన్స్‌లో సోవారం ఉదయం వాల్కనో లావా పెల్లుబకడంతో ఈ సమీప ప్రాంతాలలో ఉన్న 300 కుటుంబాలను ప్రభుత్వం తక్షణం ఖాళీ చేయించింది. మేయాన్ వాల్కనో ఈ వారాంతంలో పెల్లుబకడంతో ఆ ప్రాంతంలో భారీ ఎత్తున దుమ్ము,వాల్కనో ధూళి దట్టంగా కమ్ముకుపోయింది. పరిసర ప్రాంతాలను లావా కమ్మేసింది. ఐతే ఈ అగ్ని పర్వతం నుండి ఎలాంటి భారీ పేలుళ్ళూ సంభవించలేదు. మేయాన్ అగ్ని పర్వతం నుండి పేలుళ్ళు సంభవించలేదని, వాల్కనో ధూళి భారీగా బయటకు వస్తోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ ప్రమాదంలో ఇప్పటివరకూ ఎవరూ మరణించలేదు. గాయపడలేదు. 87 గ్రామాలు,పట్టణాలలోని గగనతల ప్రాంతాలలో దట్టంగా ధూళి మేఘాలు కమ్ముకున్నాయి. ఆకస్మికంగా ధూళి మేఘాలు కమ్ముకోవడంతో వాహనచోదకులు ఆశ్చర్యపోయారు. వాతావరణం మారిపోయి చీకట్లు కమ్ముకున్నాయి. తర్వాత హెచ్చరికల ద్వారా అర్థం చేసుకున్నారు. అనేక ప్రాంతాలలో గ్రామస్థులు భయభ్రాంతులకు గురయ్యారు. వాల్కనో ధూళి పడటంతో కూరగాయల పంట పొలాలు ధ్వంసమయ్యాయి. నాలుగు నీటి ఏనుగులు మరణించాయి. దీంతో అధికారులు మేయాన్ అగ్నిపర్వత ప్రాంతం చుట్టూ పర్యాటక ప్రాంతాల్లో,నివాసిత ప్రాంతాల్లో ఐదు దశల్లో భద్రతా అప్రమత్తను ప్రకటించారు.

# ట్రంప్ చర్యలతో దిగ్భ్రాంతి

**ఇక యూరప్ తన దారి తాను చూసుకోవాల్సిందే**



**యెరెవాన్(ఆర్మేనియా):** ఇరాన్‌తో జరిగిన యుద్ధంలో కలిసి రాలేదని ఆగ్రహించిన ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలతో యూరప్‌దేశాల నాయకులు దిగ్భ్రాంతి చెందుతున్నారు. ఐతే ఈ పరిణామాలతో మెల్లిగా వారి ''కళ్ళు తెరచుకుంటున్నాయి''. ఇక యూరప్ తన దారి తాను చూసుకోవాలని, తన రక్షణ చర్యలను పటిష్టం చేసుకోవాలని పలువురు యూరప్ నాయకులు ట్రంప్ చర్యలను స్పష్టమైన సంకేతాలుగా భావిస్తున్నారు. జర్మనీ నుండి సేనల ఉపసంహరణ నిర్ణయాన్ని యూరప్ తన దారి తాను చూసుకోవాల్సిందే అని చెప్పడానికి ఒక స్పష్టమైన సాక్ష్యంగా యూరప్ నాయకులు భావిస్తున్నారు. హోర్ముజ్ జలసంధిని తెరిపించేందుకు సైనిక చర్యలో కలిసి రావాలని యూరప్ నేతలను అడగడం, వారు తిరస్కరించడంతో అమెరికా–యూరప్ సంబంధాలు బీటలు వారాయి. యూరప్ మొదటినుండి పరాన్నజీవిలాగా అమెరికా రక్షణ వ్యవస్థపై ఆధారపడి బ్రతుకుతోందని, అన్ని విధాలా అమెరికాయే యూరప్‌ను కాపాడుతూ వచ్చిందని యూరోపియన్ యూనియన్ నాయకులకు ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత సూటిపోటి మాటలు పెరిగిపోయాయి. ట్రంప్ పాలనాయంత్రాంగం కూడా ఇదే పదజాలం ఉపయోగించడాన్ని యూరప్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇరాన్‌లో ట్రంప్ ప్రారంభించిన యుద్ధంవల్ల యూరప్‌లో అంతకు ముందు నుండి కొద్దికొద్దిగా రేగుతున్న చిచ్చు పరాకాష్టకు చేరింది. జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ విమర్శలతో ట్రంప్ మరింత రెచ్చిపోయారు. ఇరాన్‌తో చేస్తున్న యుద్ధంలో ట్రంప్‌కు ఒక స్పష్టమైన వ్యూహం అంటూ లేదని, ఆ యుద్ధం నుండి గౌరవంగా బయటపడే మార్గం, ఆ వ్యూహం ఆయన దగ్గర లేదని, తనకు ఆ విషయం అర్థం కావడంలేదని మెర్జ్ కుండబద్దలుకొట్టినట్లు చెప్పిన వాస్తవాలను ట్రంప్ జీర్ణించుకోలేక ఆగ్రహించారు. జర్మనీ నుండి 5,000 మంది అమెరికా సైనికులను ఉపసంహరణ నిర్ణయానికి ఇదే కారణం. ఇంకా గణనీయస్థాయిలో సైన్యాన్ని ఉపసంహరిస్తామని ఆ తర్వాత కూడా ట్రంప్ ప్రకటించారు. నార్వే ప్రధానమంత్రి జోనాస్ గార్ స్టోర్ దీనిపై స్పందిస్తూ, ఈ పరిణామాలను తాను భూతద్దంలోపెట్టి పెద్దదిగా చేసి చూడాలనుకోవడంలేదన్నారు. యూరప్ దేశాలు ఇకమీదట తన సొంత భద్రతను సమకూర్చుకోవడానికి మరింత ఎక్కువగా ఖర్చు చేయాల్సి వస్తుందని అభిప్రాయపడ్డారు. ఐతే ఈ ఖర్చు అంకెలు చాలా నాటకీయంగా ఉంటాయని అనుకోవడంలేదన్నారు. యూరప్ దేశాలు నాటో చట్రం కింద ఈ ఖర్చులను చాలా సామరస్యపూర్వకంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. యూరప్ నాయకులు శిఖరాగ్ర సమావేశం నిర్వహిస్తున్న ఆర్మేనియా నగరం యెరెవాన్‌లో మీడియాతో మాట్లాడుతూ జోనాస్ గార్ స్టోర్ పైవిధంగా చెప్పారు. యూరోపియన్ యూనియన్ విదేశీ విధాన ప్రధానాధిపతి కాజా కల్లాస్ మాట్లాడుతూ, యూరప్ నుండి అమెరికా సైన్యాన్ని ఉపసంహరించాలని చాలాకాలంగా చర్చ జరుగుతోందని, ఐతే ఇప్పుడు ఈ ప్రకటన వెలువడిన సమయం మాత్రం చాలా ఆశ్చర్యకరంగా ఉందని అన్నారు. నాటోలో యూరప్ స్తంభాన్ని తాము మరింతగా పటిష్టం చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు. జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ ఇరాన్‌కు అనుకూలంగా మాట్లాడారని భావించి ఆయనను శిక్షించాలని ట్రంప్ కోరుకుంటున్నారన్నారు. పాకిస్థాన్‌లో జరిగిన చర్చల సందర్భంగా ఇరాన్ చర్చలకు రాకుండా అమెరికా జాతిని మొత్తాన్ని అవమానించిందని, ఎలా చర్చలు జరపాలో, ఎలా చర్చలు జరపకూడదో ఇరాన్ నాయకత్వానికి బాగా తెలుసునని, ఈ కారణంగానే వారు రెండో విడత చర్చల నిమిత్తం ఇస్లామాబాద్ రాలేదని, అక్కడకు చేరుకున్న అమెరికా ప్రతినిధులను అవమానించి తిరిగి వెళ్ళిపోయేట్లు చేశారని ఫ్రెడరిక్ మెర్జ్ విమర్శించడం ట్రంప్‌కు ఆగ్రహం రప్పించింది. నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రట్టే మాత్రం ఈ సమస్యను చిన్నదిగా చేసి చూపించేందుకు ప్రయత్నం చేశారు. ఇరాన్‌తో యుద్ధం జరుగుతుంటే నాటో నిబంధనల ప్రకారం కష్టకాలంలో వారు అమెరికాకు కలిసి రాలేదని ట్రంప్ విమర్శించారు. ఐతే బ్రిటన్ తదితర దేశాల నాయకులు మాత్రం ఇది తమ యుద్ధం కాదని, ఈ యుద్ధంలో చేరి తమ ఆర్థిక వ్యవస్థలను బలిపెట్టలేమని స్పష్టం చేశాయి. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ మాట్లాడుతూ, హోర్ముజ్ జలసంధిని తెరడానికి అమెరికా సిద్ధంగా ఉంటే అది చాలా గొప్ప విషయమని, మొదటి నుండీ తాము దీనినే కోరుకుంటున్నామని అన్నారు. ఐతే యూరోపియన్ దేశాలు మాత్రం హోర్ముజ్ జలసంధిని తెరిపించేందుకు ఉద్దేశించిన సైనిక చర్యలో పాల్గొనేందుకు సిద్ధంగా లేవని అన్నారు.

## భూసేకరణ అధికారి తీరుపై హైకోర్టు ఆగ్రహం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** భూసేకరణకు సంబంధించిన అవార్డు మొత్తాన్ని చెల్లించకపోవడంతో పాటు బాధితులు ఇచ్చిన నోటీసులను స్వీకరించకపోవడంపై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ముఖ్యంగా, వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని ఇచ్చిన కోర్టు ఆదేశాలను అమలు చేయని రాజన్న సిరిసిల్ల జిల్లా భూసేకరణ అధికారి (స్పెషల్ డిప్యూటీ కలెక్టర్) వ్యవహారాన్ని తీవ్రంగా తప్పుపట్టింది.

హైకోర్టు ఆదేశాలను ఎందుకు పాటించలేదని ప్రశ్నించిన న్యాయమూర్తి, హాజరు మినహాయింపునకు ఎలాంటి అవకాశం లేదని స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రితో సమావేశంలో పాల్గొనాల్సి ఉందని చెబుతూ హాజరు మినహాయింపునివ్వాలని అధికారిని కోరుతూ దాఖలు చేసిన మెమోను కోర్టు తిరస్కరించింది. ఈనెల 6న తప్పనిసరిగా కోర్టులో హాజరుకావాలని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగలలపల్లి మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన జోగినపల్లి మంగమ్మతో పాటు మరికొందరు పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారు. తమ భూములకు సంబంధించిన రూ.19.5 లక్షల అవార్డు మొత్తాన్ని చట్టప్రకారం 15 శాతం వడ్డీతో చెల్లించలేదని, తమ లీగల్ నోటీసులను అధికారులు స్వీకరించకపోవడం తప్పుడు చర్య అని వారు పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్, ఇప్పటికే అధికారిని వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశించినప్పటికీ, ఆ ఆదేశాలను అమలు చేయకపోవడాన్ని తీవ్రంగా విమర్శించారు. ప్రజల పన్నుల రూపంలో వేతనాలు పొందుతున్న అధికారులకు ప్రజల సమస్యలను పరిష్కరించే బాధ్యత ఉందని స్పష్టం చేశారు.

సమస్యను పరిష్కరించకపోవడం మాత్రమే కాకుండా, పిటిషనర్లు ఇచ్చిన నోటీసులను తిరస్కరించడం ఎలా సమంజసం అవుతుందో వివరణ ఇవ్వాలని న్యాయమూర్తి ప్రశ్నించారు. చట్టబద్ధ బాధ్యతలను విస్మరించి హాజరు మినహాయింపునివ్వాలని కోరడం సరైంది కాదని స్పష్టం చేస్తూ, ఈనెల 6న తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపుపై స్పష్టత ఇవ్వాలి : హైకోర్టు ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీలు, దివ్యాంగ విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం స్పష్టమైన కాలపట్టిక ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. ఈ బకాయిలను ఎప్పటిలోగా చెల్లిస్తారో వివరించాలని సూచిస్తూ, ప్రస్తుతం అమలులోకి తీసుకువచ్చిన డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ విధానంపై గతంలో జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను తదుపరి ఆదేశాలు వచ్చే వరకు కొనసాగిస్తామని న్యాయస్థానం వెల్లడించింది. ప్రైవేటు కాలేజీలు దాఖలు చేసిన పలు పిటిషన్లపై జస్టిస్ జువ్వాడి శ్రీదేవి మరోసారి విచారణ చేపట్టారు. ప్రభుత్వ తరపున న్యాయవాది ఎస్. రాహుల్ రెడ్డి వాదనలు వినిపిస్తూ, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపులపై సమగ్ర కౌంటర్ దాఖలు చేయడానికి కొంత గడువు అవసరమని కోర్టును కోరారు. ఇప్పటికే కొన్ని విద్యాసంస్థలకు టోకెన్లు జారీ చేసిన మేరకు చెల్లింపులు జరుగుతున్నాయని, సంబంధిత సంక్షేమ శాఖల ద్వారా రీయింబర్స్‌మెంట్ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు.

కొత్త విధానం ప్రకారం ప్రభుత్వం ఫీజులను విద్యార్థుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తుందని, అనంతరం విద్యార్థులు ఆయా కాలేజీలకు చెల్లింపులు చేయాల్సి ఉంటుందని ప్రభుత్వం తరఫు న్యాయవాది వివరణ ఇచ్చారు. ఈ ప్రక్రియపై జీవోలోని నిబంధనలకు సంబంధించి పూర్తి వివరణ ఇవ్వడానికి గడువు కావాలని కోరుతూ, పాత బకాయిల చెల్లింపుల బాధ్యతను ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించబోదని స్పష్టం చేశారు.

ఇదిలా ఉండగా, పిటిషనర్ల తరఫు న్యాయవాదులు ఈ విధానం అమలులో ఉంటే కాలేజీలు విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేసే పరిస్థితి లేకుండా పోతుందని వాదించారు. అందువల్ల ఆ నిబంధనను నిలిపివేస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను కొనసాగించాలని కోర్టును కోరారు.

ఇరు పక్షాల వాదనలు పరిశీలించిన న్యాయమూర్తి, ప్రస్తుత విద్యాసంవత్సరం దృష్ట్యా జూన్ 24లోగా ప్రభుత్వం కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించారు. అంతవరకు సంబంధిత నిబంధనపై ఉన్న మధ్యంతర ఉత్తర్వులు అమల్లోనే కొనసాగుతాయని స్పష్టం చేశారు.

## తమిళనాడులో 'హీరో' విజయ్

(మొదటి పేజీ తరువాయి)

మీడియా కీలక పాత్ర వహించిందని విశ్లేషకుల అంచనా.

తమిళనాడులో విజయన్ నాయకత్వానగల టివికె (తమిళగ వెట్రి కళగం) ఏకైక అతిపెద్దపార్టీగా అవతరించింది. ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే, 234 స్థానాలున్న తమిళ అసెంబ్లీలో ఏ పార్టీకైనా 118 మంది సభ్యుల బలం ఉండాలి. విజయ్ పార్టీ 107 స్థానాలు గెలుచుకుంది. డిఎంకె 74, ఎఐఎడిఎంకె 53 స్థానాలు గెలుచుకున్నాయి. తమిళనాడులో విజయ్ పెద్దగా ప్రచారం చేయకపోయినప్పటికీ సంప్రదాయబద్ధమైన పరిపాలన నుండి విముక్తి కావాలని తమిళ ప్రజలు బలంగా కోరుకోవడంతోపాటు గ్రామీణ ప్రాంతాలలో బలంగా ఉన్న సినీ ఛరిస్మా, ఆయనపట్ల సానుభూతి కూడా ఫలితాలతో బహిర్గతమైంది. తిరుచిరాపల్లి తూర్పు నియోజకవర్గం, పెరంబూర్ రెండు చోట్లా ఆయన విజయం సాధించారు. కానీ మెజార్టీ తగ్గడంతో ఇప్పుడు ప్రభుత్వం ఏర్పాటు చేయడం విజయ్‌కు ఒక సవాలుగా మారింది. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ వరుసగా మూడుసార్లు విజయం సాధించిన కంచుకోట కొళత్తూర్ నియోజకవర్గంలో నాలుగోసారి మాత్రం ఓటమిపాలయ్యారు. ఆయన పై విజయం సాధించిన అపారాను

భవంగల నాయకుడు, టివికె అభ్యర్థి వి.ఎస్.బాబు ప్రముఖుడుగా వార్తల్లో ప్రచారం పొందుతున్నారు. ఇక ఎఐఎడిఎంకెకు కంచుకోటగా ఉన్న ఎడప్పాడి నియోజకవర్గంనుండి ఆ పార్టీ నాయకుడు నాయకుడు కె.పళని స్వామి విజయం సాధించగా, తమిళనాడు బిజెపి రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత కేంద్రమంత్రి ఎల్.మురుగన్ అవనాషి (ఎస్సీ రిజర్వుడు) నియోజకవర్గంలో టివికె పార్టీ అభ్యర్థి చేతిలో ఓడిపోయారు.

2011 నుండీ 15 సంవత్సరాలు నిరాఘాటంగా బెంగాల్‌ను పరిపాలించిన మమతా బెనర్జీ పార్టీ తృణమూల్ కాంగ్రెస్ నాలుగోసారి కూడా అధికారాన్ని ఆశించినప్పటికీ, కేవలం 88 సీట్లకే పరిమితమైంది. 2021 ఎన్నికల్లో ఈ పార్టీ అసెంబ్లీలో మొత్తం 294 స్థానాలకుగాను 215 స్థానాలను గెలుచుకుంది. ఇప్పుడు బిజెపి 208 స్థానాలు గెలుచుకుంది. టిఎంసి ఆధిక్యంలో ఉన్న చోట్ల ఫలితాలను వెంటవెంటనే ఎన్నికల సంఘం ప్రకటించడంలేదని జాప్యందారీ నాటకం ఆడుతోందని, కౌంటింగ్‌లో అక్రమాలు జరుగుతున్నాయని మమతా బెనర్జీ విమర్శించారు. కార్యకర్తలు చివరివరకూ కౌంటింగ్ కేంద్రాలను వదిలివెళ్ళవద్దని కోరారు.2.50 లక్షలమంది కేంద్ర సాయుధ పోలీసులను బెంగాల్ లో మోహరించారు. కేరళలో కాంగ్రెస్ నాయకత్వానగల యుడిఎఫ్ కూటమి 140 నియోజకవర్గాలలో 102 స్థానా లు, కాంగ్రెస్ 63, ముస్లిం లీగ్ 22, కేరళ కాంగ్రెస్ 7 స్థానాలు గెలుచుకున్నాయి. ఎల్‌డిఎఫ్ కూటమిలో సిపిఎం 26, సిపిఐ ఎనిమిది స్థానాలు గెలుచుకున్నాయి. ఆర్‌జెడి ఒక స్థానం గెలుచుకున్నాయి. ఎన్‌డిఎ మూడు స్థానాలు గెలుచుకుంది. రివల్యూషనరీ సోషలిస్టుపార్టీ మూడుస్థానాలు, ఇతరులు పది స్థానాలు గెలుచుకున్నారు.

అసోంలో 126 స్థానాలున్న అసెంబ్లీలో 102 స్థానాలు గెలుచుకున్న హిమంత విశ్వాస్ మరోసారి ప్రభుత్వ ఏర్పాటుకు సన్నద్ధమయ్యారు. కాంగ్రెస్ 19, ఎఐయుడిఎఫ్ రెండు స్థానాలు, ఇతరులు ఒక స్థానం గెలుచుకున్నారు. పుదుచ్చేరిలో బిజెపి నాలుగుస్థానాలు, ఎన్ఆర్ కాంగ్రెస్ పార్టీ 12,ఎల్‌జెకె,అన్నాడిఎంకె, కాంగ్రెస్ పార్టీలు ఒక్కొక్కస్థానం, డిఎంకె ఐదుస్థానాలు,విజయ్ పార్టీ టివికె రెండుస్థానాలు,నెయ్యం మక్కళ్ కళగం పార్టీ ఒకటి,ఇతరులు మూడు స్థానాలు గెలుచుకున్నారు.

## శ్రేయాస్ గ్రూప్ భారీ విస్తరణ


**10 వేల మంది యువతకు ఉపాధి**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** శ్రేయాస్ గ్రూప్ తెలుగు రాష్ట్రాల్లోని గ్రామీణ, పట్టణ యువత కోసం సరికొత్త వ్యవస్థాపక నమూనాను ప్రకటించింది. మీడియా, ఈవెంట్స్, రియల్ ఎస్టేట్‌తో పాటు స్పోర్ట్స్ రంగాలలో సుమారు 10 వేలమందిని వ్యవస్థాపకులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నామని సంస్థ అధినేత గంద్ర శ్రీనివాస్ రావు తెలిపారు. ఎటువంటి పెట్టుబడి లేకుండానే యువత తమ సొంత ప్రాంతాల్లో శ్రేయాస్ ప్రతినిధులుగా చేరి, ఒక క్రమబద్ధమైన బిజినెస్ మోడల్ ద్వారా ఆదాయం పొందే అవకాశాన్ని ఈ సంస్థ కల్పిస్తోందన్నారు.

గడిచిన 15 ఏళ్లలో వినోదరంగంలో బలమైన ముద్ర వేసిన శ్రేయాస్ గ్రూప్, ఇప్పుడు ఇతర భాషా చిత్ర పరిశ్రమలతో పాటు రియల్ ఎస్టేట్, ఏఐ రంగాల్లోకి విస్తరిస్తోందని తెలిపారు.

## ప్రజా తీర్పు 'ఇండియా' కూటమికి గుణపాఠం

**బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తాజా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు దేశవ్యాప్తంగా రాజకీయ పరిస్థితులను ప్రతిబింబిస్తున్నాయని, ప్రజలు ఇండియా కూటమికి గట్టి సమాధానం ఇచ్చారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. ఈనెల 10వ తేదీన సికింద్రాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ బహిరంగ సభ జరగనున్న నేపథ్యంలో సభ వేదిక వద్ద భూమిపూజ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మ ణ్, ఎంపిలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రాష్ట్ర ఇన్‌చార్జ్ అభయ్ పాటి ల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ బెంగాల్‌లో గతంలో కమ్యూనిస్టులు, అనంతరం తృణమూల్ కాంగ్రెస్ పాలించిన కోటలో బిజెపి విజయం సాధించిందన్నారు. అస్సాంలో మూడోసారి బిజెపి కూట మి అధికారంలోకి రావడం పార్టీపై ప్రజల విశ్వాసానికి నిదర్శనమన్నారు. ప్రధాని మోదీ మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా తెలంగాణకు వస్తున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు అంకితం చేయనున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.

# సిబిఐకి అప్పగింత

(మొదటి పేజీ తరువాయి)

భూముల ధరలను క్రమబద్ధీకరించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. మార్కెట్ విలువల రేషనలైజేషన్ చేయడానికి రిజిస్ట్రేషన్ శాఖకు అనుమతి ఇచ్చింది. మే 26వ తేదీ అనంతరం సవరించిన విలువలు అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సోమవారం జరిగిన ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంతివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీడియాకు వివరించారు. సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్‌తో పాల్గొన్నారు. మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఆర్థికతత్వవేత్త , అరవింద్‌సుబ్రహ్మణ్యం, జిల్లా కమిటీల సూచనల మేరకు భూముల విలువను పెంచే అంశాన్ని పరిశీలించి, ఈ నెల 26 తేదీలోపు శాస్త్రీయ పద్ధతిలో రిజిస్ట్రేషన్ కార్డు విలువను కూడా పెంచాలని మంత్రివర్గం నిర్ణయించినట్టు వివరించారు. వివిధ అభివృద్ధి పనులు, ప్రాజెక్ట్ పనుల కోసం ప్రభుత్వ అవసరాల నిమిత్తం రైతులు, ఇతరుల నుంచి సేకరించిన భూములకు భూముల కార్డు విలువను పెంచాలని పలువురు ప్రభుత్వాన్ని కోరారని, వారి అభిప్రాయాల మేరకు భూమి , కార్డ్ విలువను 26వ తేదీ నుంచి పెంచాలని మంత్రివర్గం ఒక ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చిందని ఆయన తెలిపారు. భూముల విలువ పెంచే లోపు హిల్ట్ పాలసీ కింద పరిశ్రమలకు సంబంధించిన భూముల రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తు చేసుకుని, ప్రస్తుత భూముల ధరలు, రిజిస్ట్రేషన్ చార్జీలలో ఆధారంగా పది శాతం చెల్లిస్తే, మిగిలిన 90 శాతం ఫీజులను 90 రోజుల్లో ప్రక్రియను పూర్తి చేసుకునే వెసులుబాటును కల్పిస్తామ్మ చెప్పారు. నల్లగొండ,రంగారెడ్డి జిల్లాలో పాల ఉత్పత్తులు చేసే రైతులు, మహిళలకు సంబంధించిన లాభాలలో ఉన్న మదర్ డైరీలు పదేళ్ల కాలంలో వాటి పరిస్థితి ఏమైందో అందరికీ తెలుసునని, అందుకే మదర్‌డైరీని నేషనల్ డైరీ డెవలప్‌మెంట్‌కు అప్పగించేందుకు ఎంఒయు చేసుకోవాలని మంత్రివర్గం నిర్ణయించిందని, ఈ నిర్ణయం వల్ల రైతులకు, మహిళలకు ఆదాయం పెరుగుతుందని ప్రభుత్వం విశ్వసిస్తుందని తెలిపారు. ఉమ్మడి పది జిల్లాల్లోని వివిధ సబ్ స్టేషన్ల పక్కనే ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములలో సోలార్ పవర్ ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేయాలని, ఇందుకు 19 ప్రాంతాలలో ప్రయోగాత్మకంగా ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించినట్టు తెలిపారు.

**'వన్ టైమ్ సెటిల్‌మెంట్'లో ప్రభుత్వకార్యాలయాల, నీటి పన్నులు**

హైదరాబాద్ పరిధిలోని క్యూర్ గ్రేటర్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్లకు వివిధ ప్రభుత్వ సంస్థలు బకాయిపడిన స్తి పన్నులు, జలమండలికి వివిధ ప్రభుత్వ సంస్థలు చెల్లించాల్సిన నీటి బకాయిలను వన్ టైమ్ సెటిల్‌మెంట్‌గా చెల్లించాలని నిర్ణయించినట్టు మంత్రి తెలిపారు. ప్రస్తుతం వివిధ ప్రభుత్వ సంస్థలు బకాయిపడిన మొత్తం రూ 5864 కోట్లలో వడ్డీ, జరిమానాలను తొలగించి వన్ టైమ్ సెటిల్‌మెంట్ కింద రూ.1686 కోట్లను చెల్లించేందుకు మంత్రివర్గం ఆమోదించిందన్నారు. యంగ్ ఇండియా పరిధిలోకి రాష్ట్రంలోని ఐటిఐ, పాలిటెక్నికల్, టి.సాట్‌లను తీసుకురావాలని, రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ అజీజ్‌నగర్‌లో ఆధునాతన కూరగాయల మార్కెట్ నిమ్మితం 42 ఎకరాల భూమినిఆ మార్కెట్ కమిటీకి అప్పగించాలని మంత్రివర్గంలో తీర్మానం చేసినట్టు మంత్రి పొంగులేటి తెలిపారు. కాళేశ్వరం కేసులో సిబిఐ విచారణ చేపట్టాలని, ఈ విషయంలో త్వరలోనే ప్రభుత్వం ఒక కార్యక్రమాన్ని చేపడుతుందన్నారు.

**రైతులు అభద్రతకు గురికావొద్దు**

రాష్ట్ర వ్యాప్తంగా పంటలు కొనుగోళ్ల విషయంలో రైతులు అభద్రతాభావానికి గురికావొద్దని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కోరారు. రాష్ట్రంలో గతంలో కనివిని ఎరగని తీరితో పంట పండిందని, పండిన పంటలను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని భరోసా ఇచ్చారు. అకాల వర్షాలతో రైతులు ఇబ్బందిపడుతున్న మాట వాస్తవమని,అందుకే వర్షాలతో ఇబ్బందులకు గురవుతున్న ప్రాంతాలను జిల్లాలలో సమస్యలను ఇన్‌ఛార్జీ మంత్రులు ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సిఎం ఆదేశించినట్టు తెలిపారు. ఈ అంశంలో ఇప్పటికే మంత్రి ఉత్తమ్ కుమర్‌రెడ్డి సమీక్షించారన్నారు. ఖమ్మం జిల్లా కామేపల్లి వద్ద బుగ్గవాగు నుంచి లెఫ్ట్ ఫ్లడ్ ఫ్లో కాలువ నిర్మాణానికి ఆమోదం తెలిపిందన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఖమ్మం జిల్లాలో మైనర్ ఇరిగేషన్ ట్యాంకులకు నీరు అందించనున్నదని తెలిపారు. ''విద్యుత్తు కొనుగోళ్లతో పాటు భద్రాద్రి, యాదాద్రి విద్యుత్తు ప్లాంట్లలో జరిగిన అవకతవకలు, అక్రమాలపై 2024 మార్చి 14వ తేదీన కమిషన్స్ ఆఫ్ ఇన్‌క్వైరీ చట్టం ప్రకారం రిటైర్డ్ జస్టిస్ ఎల్.నరసింహా రెడ్డి అధ్యక్షతన కమిషన్ ఏర్పాటు చేసింది. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు 2024 జులైలో ఆయన విచారణ నుంచి తప్పుకోవటంతో జస్టిస్ మదన్ బి.లోకూర్‌ను కమిషన్గా నియమించారు. 2024 అక్టోబర్‌లో కమిషన్ మొత్తం 114 పేజీల నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. అనంతరం 2025 జనవరి 4వ తేదీన జరిగిన కేబినేట్ సమావేశంలో ఈ నివేదికపై తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై అడ్వకేట్ జనరల్ అభిప్రాయం తీసుకోవాలని నిర్ణయించింది. నివేదికను పరిశీలించిన అడ్వకేట్ జనరల్ తన సూచనలు, అభిప్రాయాలను తెలియజేశారు. వాటన్నింటినీ కేబినేట్ చర్చించింది. అందుకే నిష్పాక్షిక దర్యాప్తు జరిపేందుకు సిబిఐ విచారణ అప్పగించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించిన తదుపరి ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను మంత్రివర్గం ఆదేశించింది'' అని మంత్రి వివరించారు.

# పంజాబ్‌కు వరుస షాక్‌లు

టాపర్ పంజాబ్ కింగ్స్‌కు వరసగా రెండో షాక్. లో స్కోరింగ్ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ 4 వికెట్ల తేడాతో పంజాబ్‌ను ఓడించింది. ఆఖరి ఓవర్ వరకూ ఉత్కంఠ రేపిన మ్యాచ్‌లో సాయి సుదర్శన్(57) అర్ధశతకంతో మెరవగా.. చివరిదాకా నిలబడిన సుందర్(40 నాటౌట్) గుజరాత్‌ను గెలిపించాడు. ఆఖరి ఓవర్లో సుందర్ ఫైనల్ లెగ్ సిక్సర్ బాదగా ఆరో విజయంతో గుజరాత్ ప్లే ఆఫ్స్ రేసులో నిలిచింది. డబుల్ హెడర్ రెండో మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్‌పై గుజరాత్ టైటాన్స్ జయభేరి మోగించింది. మోస్తరు ఛేదనలో ఓపెనర్ సాయి సుదర్శన్(57) ఖతర్నాక్ హాఫ్‌సెంచరీతో రాణించగా.. వాషింగ్టన్ సుందర్ (40 నాటౌట్) మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడాడు. పంజాబ్‌ను 163కే కట్టడి చేసిన గుజరాత్ టైటాన్స్‌కు అర్ష్‌దీప్ సింగ్ ఆదిలోనే షాకిచ్చాడు. శుభ్‌మన్ గిల్(5) ఔటయ్యాక జోస్ బట్లర్(26), సాయి సుదర్శన్(57)లు ఇన్నింగ్స్ నిర్మించారు. గుజరాత్‌ను గెలుపు దిశగా నడిపిస్తున్న ఈ జోడీని ఇంప్యాక్ట్ సబ్ విజయ్ కుమార్ విడదీశాడు. నిశాంత్ సంధు(15)..విఫలమవ్వ గా.. సుదర్శన్ దూకుడుగా ఆడి అర్ధశతకం సాధించాడు. విజయ్ బౌలింగ్‌లో సిక్సర్ కొట్టాలనుకున్న అతడు బౌండరీ వద్ద బార్ట్‌లెట్ చేతికి చిక్కాడు. అప్పటికి గుజరాత్ విజయానికి 30 బంతుల్లో 41 రన్స్ కావాలి. సుందర్(40నాటౌట్) నిలబడినా.. ఇంప్యాక్ట్ సబ్ తెవాటియా(2)ను యాన్సెన్ ఔట్ చేయడంతో పంజాబ్ ఆశలు చిగురించాయి. కానీ, బంతితో తమను దెబ్బకొట్టిన హోల్డర్(5)ను కొన్నొల్లీ అద్భుత క్యాచ్‌తో వెనక్కి పంపాడు. 6 బంతుల్లో 11రన్స్ అవసరమవ్వగా.. అర్షద్ ఖాన్ బౌండరీ.. సుందర్ ఫుల్ టాస్‌ను ఫైన్ లెగ్‌లో సిక్సర్‌గా మలవగా 4వికెట్ల తేడాతో గుజరాత్ గెలిచింది.





**రాణించిన సూర్యాన్ష్, స్టోయినిస్...** పంతొమ్మిదో సీజన్‌లో రికార్డు లక్ష్యాన్ని ఛేదించిన పంజాబ్ కింగ్స్ అహ్మదాబాద్‌లో తడబడింది. సుడిగాలిలా విరుచుకుపడే ఓపెనర్లకు గుజరాత్ టైటాన్స్ బౌలర్లు బ్రేకులు వేయగా మోస్తరు స్కోరే కొట్టింది. తొలి ఓవర్లోనే సిరాజ్(2–28) డబుల్ షాకివ్వగా.. జేసన్ హోల్డర్(4–24) చకచకా మిడిలార్డర్ పని పట్టాడు. 47కే ఐదు కీలక వికెట్లు పడిన వేళ అన్‌క్యాప్డ్ ప్లేయర్ సూర్యాన్ష్ షెడ్గే(57), మార్కస్ స్టోయినిస్(40)లు నిలబడ్డారు. గుజరాత్ బౌలింగ్ దళాన్ని కాచుకొని స్కోర్ 120 దాటించారు. ఈ జోడిని హోల్డర్ విడదీయడంతో పంజాబ్ 163కే పరిమితమైంది.

# లీగ్ దశ ముగుస్తున్నా ధోనీ జాడేది..

## చెన్నై ఎదురుచూపులు ఫలించేనా!

ఐపిఎల్ ప్రతి సీజన్‌లో అభిమానులకు పిచ్చెక్కించే ఎంఎస్ ధోనీ పంతొమ్మిదో సీజన్‌లో ఇంకా అడుగే పెట్టలేదు. లీగ్ దశ ముగింపు దశకు చేరుకున్నా తాలా ఆటను ఫ్యాన్స్ మిస్సవుతున్నారు. ఆరంభ సీజన్ నుంచి వికెట్ల వెనకాల కుర్రాడిలా కదులుతూ.. ఫినిషర్‌గా సిఎస్‌కె విజయాల్లో కీలకమైన ధోనీ 19వ ఎడిషన్‌లో ఒక్క మ్యాచ్ ఆడలేదు. ఇదుగో వస్తుండు.. అదుగో వస్తుండు అనే మాటలు వినిపిస్తున్నా.. ఈ మాజీ కెప్టెన్ ఎంట్రీపై సిఎస్‌కె యాజమాన్యం స్పష్టమైన ప్రకటన చేయడం లేదు. చెన్నై సూపర్ కింగ్స్‌ను ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిపిన ధోనీ పంతొమ్మిదో సీజన్‌లో ఆడడంపై నెలకొన్న అనిశ్చితికి తెరపడడం లేదు. మొన్నటికి మొన్న జట్టుతో పాటు హైదరాబాద్ వచ్చినా అతడు ఆడలేదు. రెండు రోజుల క్రితం ముంబై ఇండియన్స్‌లో మ్యాచ్‌కు ముందు నెట్స్‌లో రోహిత్ శర్మను కలిసిన ధోనీ.. తుది జట్టులో ఉంటాడని అందరూ అనుకున్నారు. కానీ, ఆశ్చర్యంగా.. ఎల్ క్లాసికో మ్యాచ్‌కు ధోనీ, హిట్‌మ్యాన్ వరసగా రెండోసారి దూరమయ్యారు. మే 5న ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్ కోసం జట్టంతా ఢిల్లీ వెళ్లగా ధోనీ చెన్నైలోనే ఉండిపోవడం అతడి రాక మరింత ఆలస్యం కానుందనే వార్తలకు బలం చేకూర్చుతోంది.



**వయసూ కారణమే....** పంతొమ్మిదో సీజన్ ముందు గాయపడిన ధోనీ.. కాలి పిక్క గాయం నుంచి కోలుకుంటున్నాడు. పూర్తి స్థాయిలో ఫిట్‌నెస్ సాధించకపోవడంతోనే ఐపిఎల్ ఆడడం లేదని సమాచారం. వయసు 44 ఏళ్లు కావడంతో ధోనీ ఫిట్‌గా మారేందుకు మరికొంత సమయం పట్టనుంది. దాంతో.. చెన్నైలోనే తాలా పునరావాస కేంద్రంలో ఫిట్‌నెస్ మెరుగుపరుచుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో.. ధోనీ ఏదో ఒక దశలో అందుబాటులో ఉంటాడు అని క్రిక్‌బజ్ కథనం పేర్కొంది. పెద్దన్నలాంటి మహీ భాయ్ గైర్హాజరీలో రుతురాజ్ గైక్వాడ్ ఆరంభంలో తడబడినా ఎట్టకేలకు ట్రాక్‌లో పడ్డాడు. ఓపెనర్ శాంసన్.. మిడిలార్డర్లో ఉర్విల్, కార్తిక్ శర్మ.. పేసర్ అన్షుల్ కంబోజ్లు రాణిస్తుండగా చెన్నై నాలుగో విజయంతో ప్లే ఆఫ్స్ రేసులో నిలిచింది.

# యువతరంగం

## విజయ పరంపర..

ప్రపంచవ్యాప్తంగా యువత అనేక రంగాల్లో విశేష విజయాలను సాధిస్తోంది. శాస్త్రం, సాంకేతికత, వ్యాపార రంగం, సామాజిక మార్పు, క్రీడలు వంటి విభిన్న రంగాల్లో యువత తమ ప్రతిభను నిరూపిస్తూ ప్రపంచంపై ప్రభావం చూపుతోంది. ఈ విజయగాథలు కేవలం ప్రేరణాత్మక కథలే కాకుండా, ఆధునిక ప్రపంచంలో యువతకు లభిస్తున్న అవకాశాలు ఎలా మారుతున్నాయో కూడా చూపిస్తున్నాయి. సాంకేతిక రంగంలో యువత చేస్తున్న ఆవిష్కరణలు ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఉదాహరణకు 'బోయన్ స్లాట్' అనే నెదర్లాండ్స్‌కు చెందిన యువ ఆవిష్కర్త చిన్న వయసులోనే 'ది ఓషన్ క్లీనప్' అనే ప్రాజెక్టును ప్రారంభించాడు. సముద్రాలలో పెరుగుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడానికి ప్రత్యేకమైన సాంకేతిక పరికరాలను రూపొందించాడు. ఈ పరికరాలు సముద్ర ప్రవాహాలను ఉపయోగించి ప్లాస్టిక్‌ను ఒకచోట చేర్చే విధంగా పనిచేస్తాయి. ఈ విధానం ద్వారా పెద్ద ఎత్తున సముద్ర కాలుష్యాన్ని తగ్గించే ప్రయత్నం జరుగుతోంది. అలాగే గీతాంజలి రావు అనే అమెరికాకు చెందిన యువ ఆవిష్కర్త తాగునీటిలో ఉండే విషపదార్థాలను గుర్తించే పరికరాలను రూపొందించడం వంటి ఆవిష్కరణలు చేసింది. ఇంకా ఇంటర్నెట్‌లో జరిగే సైబర్ వేధింపులను గుర్తించే సాంకేతిక పరిష్కారాలను కూడా అభివృద్ధి చేసింది. ఈ ఉదాహరణలు యువత సాంకేతికతను సామాజిక సమస్యల పరిష్కారానికి ఎలా ఉపయోగిస్తున్నారో చూపిస్తున్నాయి. వ్యాపార రంగంలో యువత కూడా విశేషంగా ఎదుగుతోంది. ముఖ్యంగా డిజిటల్ సాంకేతికత వల్ల కొత్త కంపెనీలను ప్రారంభించడం మరింత సులభమైంది. ఉదాహరణకు విటాలిక్ బటెరిన్ అనే యువ సాంకేతిక నిపుణుడు 'ఎథెరియం' అనే బ్లాక్‌చెయిన్ వేదికను స్థాపించాడు. ఈ వేదిక ద్వారా డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో పెద్ద మార్పులు వచ్చాయి. అనేక సంస్థలు, డెవలపర్లు దీనిని ఉపయోగించి కొత్త డిజిటల్ సేవలను రూపొందిస్తున్నారు. అలాగే బెన్ పాస్టెర్నక్ అనే యువ వ్యాపారవేత్త చిన్న వయసులోనే మొబైల్ యాప్‌లను అభివృద్ధి చేసి స్టార్టప్ ప్రపంచంలో గుర్తింపు పొందాడు. యువతకు సాంకేతిక నైపుణ్యాలు, పెట్టుబడులు అందుబాటులో ఉంటే వారు కొత్త వ్యాపార అవకాశాలను ఎలా సృష్టించగలరో




అతను రుజువు చేస్తున్నాడు. ఇలాంటి, విజయగాథలను పరిశీలిస్తే, ఆధునిక ప్రపంచంలో యువతకు సాంకేతికత, విద్య, మరియు ప్రపంచవ్యాప్త సమాచార వ్యవస్థలు అందుబాటులో ఉన్నాయనే విషయం స్పష్టమవుతుంది. ఈ కారణంగా వారు కొత్త ఆలోచనలను వేగంగా అమలు చేయగలుగుతున్నారు. అయితే ఈ విజయాలు అందరికీ సులభంగా అందుబాటులో ఉండవు. అవకాశాలు, వనరులు, విద్యా వ్యవస్థలలో ఉన్న అసమానతలు కూడా ప్రభావం చూపుతాయి. అయినప్పటికీ, ఈ కథలు యువత కేవలం భవిష్యత్తు నాయకులే కాకుండా, ప్రస్తుతం ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్న శక్తిగా మారుతున్నారనే విషయాన్ని స్పష్టంగా తెలియజేస్తాయి.

## పెట్టుబడుల్లో 4%




ఉద్యోగం లేదా వ్యాపారం నుంచి ఉత్తొందరగా వైదొలగాలని అనుకునే వారి ఉద్దేశించి ఇటీవల బాగా ట్రెండింగ్ లో ఉన్న సూత్రం '4%' (నాలుగు శాతం). ఈ ఆలోచన ప్రకారం, ఒక వ్యక్తి తన మొత్తం పెట్టుబడి సంపదలో ప్రతి సంవత్సరం కేవలం నాలుగు శాతం మాత్రమే తీసుకుంటూ ఖర్చు చేస్తే, ఆ సంపద చాలా సంవత్సరాలు నిలిచి ఉంటుంది. ఈ సిద్ధాంతం ప్రధానంగా అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో జరిగిన ఆర్థిక పరిశోధనల ఆధారంగా రూపొందించబడింది. ఈ నియమం వెనుక ఉన్న తర్కం ఏమిటంటే, పెట్టుబడులు సాధారణంగా మార్కెట్‌లో పెరుగుతూనే ఉంటాయి. అందువల్ల ప్రతి సంవత్సరం కొంత భాగాన్ని తీసుకున్నప్పటికీ, మిగిలిన పెట్టుబడులు మార్కెట్ లాభాల ద్వారా తిరిగి పెరుగుతాయి. ఈ విధంగా పెట్టుబడి సంపద పూర్తిగా తగ్గిపోకుండా జీవితం మొత్తం ఖర్చులను నిర్వహించవచ్చని భావిస్తారు. అయితే ఈ నియమాన్ని భారతదేశంలో అదే విధంగా అనుసరించడం ప్రమాదకరమని పలువురు ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. కారణం ఏమిటంటే భారతీయ ఆర్థిక పరిస్థితులు, మార్కెట్ నిర్మాణం అమెరికా వంటి దేశాలతో పూర్తిగా ఒకేలా ఉండవు. భారతదేశంలో ద్రవ్యోల్బణం తరచుగా ఎక్కువగా ఉంటుంది. అంటే వస్తువుల ధరలు కాలక్రమంలో వేగంగా పెరుగుతాయి. ఆరోగ్యసేవలు, విద్య, గృహవ్యయాలు వంటి ఖర్చులు ప్రతి సంవత్సరం పెరుగుతూ ఉంటాయి. ఈ పరిస్థితిలో ఒక వ్యక్తి తన పెట్టుబడిలో నాలుగు శాతం మాత్రమే తీసుకుంటూ జీవించడం సాధ్యం కాకపోవచ్చు. ఇక్కడ ఇంకో ముఖ్యమైన అంశం మార్కెట్ అస్థిరత. ఈక్విటీ మార్కెట్లు కొన్నిసార్లు వేగంగా పెరుగుతాయి. కానీ, కొన్నిసార్లు పెద్ద పతనాలను కూడా ఎదుర్కొంటాయి. ఒక వ్యక్తి పదవీ విరమణ చేసిన వెంటనే మార్కెట్ పడిపోతే, అతను తీసుకుంటున్న 4 శాతం ఉపసంహరణ పెట్టుబడి మూలధనాన్ని వేగంగా తగ్గించే ప్రమాదం ఉంది. అందువల్ల 4% నియమాన్ని ఒక సాధారణ మార్గదర్శకంగా మాత్రమే చూడాలి. దేశంలో ముందస్తు పదవీ విరమణ లక్ష్యాన్ని సాధించాలంటే మరింత పెద్ద పెట్టుబడి సంపద, విభిన్న పెట్టుబడులు మరియు దీర్ఘకాలిక ఆర్థిక ప్రణాళిక అవసరం




## క్రియేటర్ ఎకానమీ.. డిజిటల్ వ్యాపారాలు

డిజిటల్ ప్రపంచం అభివృద్ధి చెందడంతో క్రియేటర్ ఎకానమీ అనే కొత్త వ్యవస్థ ఏర్పడింది. ఇందులో యువత సోషల్ మీడియా వేదికలను ఉపయోగించి కంటెంట్ తయారు చేసి ఆదాయం సంపాదిస్తోంది. వీడియోలు, బ్లాగులు, విద్యా పాఠాలు, వినోద కార్యక్రమాలు వంటి అనేక రకాల కంటెంట్‌ను యువత రూపొందిస్తోంది. ఇది ఒక కొత్త రకమైన డిజిటల్ వ్యాపారంగా మారింది. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, షార్ట్ వీడియో ప్లాట్‌ఫారమ్‌లు వంటి వేదికల ద్వారా ప్రకటనలు, బ్రాండ్ ప్రమోషన్లు, సభ్యత్వ సేవల ద్వారా ఆదాయం పొందవచ్చు. ముఖ్యంగా చిన్న పట్టణాలు, గ్రామాల నుంచి వచ్చిన యువత కూడా ఇప్పుడు ఈ రంగంలో గుర్తింపు పొందుతోంది. అయితే క్రియేటర్ ఎకానమీకి కూడా పరిమితులు ఉన్నాయి. అందరూ విజయవంతమైన కంటెంట్ క్రియేటర్లు కావడం సాధ్యం కాదు. చాలా మంది ప్రయత్నించినా కొద్దిమందికే స్థిరమైన ఆదాయం వస్తుంది. అదనంగా, ఈ రంగంలో పోటీ చాలా ఎక్కువగా ఉంటుంది. అందువల్ల దీన్ని ఒకే వృత్తిగా కాకుండా ఇతర నైపుణ్యాలతో కలిపి అభివృద్ధి చేయడం ఉత్తమ మార్గంగా పేర్కొంటున్నారు.

# యుద్ధ ప్రాతిపదికన మక్కలు, ధాన్యం కొనుగోళ్లు

### సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి డిమాండ్

### ఎల్కతుర్తిలో రాస్తారోకో



**ప్రజాపక్షం/ఎల్కతుర్తి :** కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యాన్ని తరలించి 15 రోజులు కావస్తున్నా. అధికారుల నిర్లక్ష్యం, ప్రభుత్వం వైఖరితో రైతులు అనేక ఇబ్బందులతో అవస్థలు పడుతున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. మొక్కజొన్న, ధాన్యం కొనుగోలులో జాప్యానికి నిరసనగా సిపిఐ, రైతులు కలిసి హనుమకొండ – కరీంనగర్ రహదారిపై ఎల్కతుర్తిలో భారీ రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా బిక్షపతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఐకెపి కేంద్రాల ద్వారా వరి యుద్ధ ప్రాతిపదికన ధాన్యం, మొక్కజొన్నలు కొనుగోలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైస్ మిల్లర్ల అధికారులతో సమావేశాలు నిర్వహించిన కూడా, అధికారుల నిర్లక్ష్యం, ప్రభుత్వ వైఖరి తో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఉన్న రైతులు నష్టాల పాలు అవుతున్నారన్నారు. అధికారులు సందర్శన చేసిన కూడా, క్వింటాలకు ధాన్యం 8 కిలోల చొప్పున తరుగుదల ఇతర నిబంధనల పేరుతో రైతులను అధికారులు, రైస్ మిల్లర్స్ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని చెప్పిన కూడా అమలు చేయడం లేదన్నారు., రైతులను నిర్లక్ష్యం చేసిన అధికారులపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, నిబంధనల పేరుతో తరుగు ఆపాలని, ప్రకృతి వైపరీత్యం వల్ల వడగళ్ల వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున రైతులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. సిపిఐ ఎల్కతుర్తి మండల సమితి, రైతుల ఆధ్వర్యంలో రాస్తారోకో చేయడంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దీంతో స్థానిక ఎస్ఐ నరసింహారావు అక్కడకు వచ్చి మాట్లాడారు. అధికారుల దృష్టి తీసుకుపోయి ధాన్యం, మొక్కజొన్నలను కొనుగోలు చేయుటకు కృషి చేస్తామని హామీ ఇచ్చి రాస్తారోకో విరమింపజేశారు. కార్యక్రమం లో రైతుసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి వుట్కూరి రాములు, బికెఎంయు జిల్లా ప్రధానకార్యదర్శి కర్రె లక్ష్మణ్, సిపిఐ మండల కార్యదర్శి శనగరం రాజకుమార్, నాయకులు గడ్డం రాజనర్సు, మరి పెల్లి తిరుమల, గడ్డం లలిత, తండ ముండయ్య, సూర మొగిలి, మోహన్‌రెడ్డి, పోచయ్య, స్వామి పాల్గొన్నారు.

# ఉద్యమాల బలోపేతంతోనే కార్మిక చట్టాలు, హక్కుల రక్షణ


### సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి సదానందం




**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఎఐటియుసి రామగుండం నగర సమితి మూడో మహాసభలు ఎఫ్‌సిఐ క్రాస్ రోడ్‌లోని కృష్ణ ఫంక్షన్ హాల్‌లో అట్టహాసంగా సోమవారం జరిగాయి. మహాసభ సూచికగా ముందుగా ఎఐటియుసి జెండా ఆవిష్కరణ చేశారు. అమరవీరులకు సంతాప తీర్మాణాన్ని శనిగరపు చంద్రశేఖర్ ప్రవేశపెట్టగా, మహాసభలకు అబ్దుల్ కరీం అధ్యక్షత వహించారు. అనంతరం సభ లో ముఖ్య అతిథులుగా సిపిఐ, ఎఐటియుసి జిల్లా కార్యదర్శులు తాండ్ర సదానందం, కడారి సునీల్, కార్పొరేటర్ మార్కాపూరి సూర్య హాజరయ్యారు. సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం మాట్లాడుతూ కార్మిక క్షేత్రంలో కార్మికోద్యమాలు బలోపేతం చేయడంతోనే కార్మిక చట్టాలు, హక్కుల రక్షణ సాధ్యమన్నారు. హక్కుల రక్షణకు పోరాటాలు చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. కార్మిక క్షేత్రంలో ఉన్న కార్మికుల హక్కులకు ఎఐటియుసి జెండా అండగా ఉంటుందని పోరాటాలు చేసి తమ హక్కుల కోసం ఉద్యమాలు చేయాలన్నారు. ఈనెల 24న సుల్తానాబాద్ లో జరిగే ఎఐటియుసి నాలుగో మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మిక వర్గాన్ని బజారున పడేసే విధంగా, పెట్టుబడిదారులైన ఆదాని, అంబానిలు మరింత సంపన్నులు అయ్యేందుకు 44 కార్మిక చట్టాలను తొలగిస్తారని ఆరోపించారు. కార్మిక చట్టాల రద్దు ఆలోచనను విరమించుకోవాలని హెచ్చరించారు. మహాసభలో ఎఐటియుసి నాయకులు అబ్దుల్ కరీం, శనిగరపు తిరుమల చంద్రశేఖర్, యేర్రల లేనిన్ రెడపాక లక్ష్మి , నాంసాని శంకర్, వైనాల రవి, కలికోట సతీష్ కుమార్, ఓడెల రమేష్, పులిపాక విజయలక్ష్మి శేఖర్, భోగే వందన, పిట్టల అమూల్య, పాకాలపాటి నాగమణి, శేఖర్, బుర్రసాయి, చరణ్, సకటం రమ్యశ్రీ, దాసం సుబ్బరాజు, తణుకు సత్యనారాయణ, రేణిగుంట్ల పోశం, కాంపల్లి రాజయ్య, కాసిపేట రాజేశ్వరి, జులా లక్ష్మి, షేక్ మసూద్ బాల్‌రాజ్, ఐలక్క తదితరులు పాల్గొన్నారు.

# జీతాలు చెల్లించకపోతే సమ్మె ఉధృతం

### మున్సిపల్ స్టాఫ్, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జైపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/కల్లూరు :** కల్లూరు మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారం మూడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్( ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి సమ్మె శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9నెలలుగా వేతనాలు రాకపోయినా ప్రజాశ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని కార్మికులు పనిచేస్తున్నారన్నారు. కాగా. మున్సిపల్ కమిషనర్ సిహెచ్.రాజశేఖర్, చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, వైస్‌చైర్మన్ సేలం కోటేశ్వరి, కౌన్సిలర్‌తో కలిసి కార్మిక నాయకులతో జరిపిన చర్చలు విఫలమయ్యాయని ఎఐటియుసి ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు తెలిపారు. డిసెంబర్ నెలలో తొలిసారి సమ్మె నోటీస్ ఇచ్చామని ఇప్పటికీ ఐదు నెలలు పూర్తికావస్తున్న చైర్మన్‌తో పాటు అధికారులు సమయం కావాలని అడగడం సబబు కాదన్నారు. మూడవరోజు సమ్మెకు సిపిఎం జిల్లా నాయకులు తన్నీరు కృష్ణార్జునరావు, సిఐటియు జిల్లా కోశాధికారి చలమాల విఠల్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కృష్ణ, ఐద్వా నాయకురాలు తన్నీరు కృష్ణవేణి తదితరులు సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర సమితి సభ్యులు నిమ్మటూరి రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు వేము రాంబాబు, కార్యదర్శులు ఓడల కృష్ణమూర్తి, సయ్యద్ వజీర్ మియా, ఉపాధ్యక్షులు చింతపల్లి శ్రీను, గొల్లమందల యశోద, కె.అంజలి, సహాయ కార్యదర్శులు మణిరాజ్, చిన్న, సుధాకర్, కోశాధికారి కంభంపాటి ప్రకాష్, నాయకులు కట్ట నరసింహారావు, బాబుగౌడ్, ప్రవీణ్, రాంబాబు, లక్ష్మి, జగతి, కె.మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారంపై యాజమాన్యం నిర్లక్ష్యం

### సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధానకార్యదర్శి రాజ్‌కుమార్




**ప్రజాపక్షం/మణుగూరు :** సింగరేణిలో కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం గుర్తింపు సంఘం ఎఐటియుసి మే రెండో వారంలో సమ్మె నోటీసు యాజమాన్యానికి ఇవ్వడం జరుగుతుందని, దీనిపై కలిసి వచ్చే కార్మిక సంఘాలతో మాట్లాడడం జరుగుతుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజ్‌కుమార్ మాట్లాడుతూ సింగరేణిలో కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళినప్పటికిని గత ఏడేనిమిది నెలల నుంచి పరిష్కారం చూపకుండా నిర్లక్ష్యం చేయడం జరుగుతుందని ఆరోపించారు. గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగిన తర్వాత నలుగురు డైరెక్టర్‌లు, ఇద్దరు సి అండ్ ఎండిలు, జిఎం. పర్సనల్ అధికారులు మారారని, దీని వల్ల కార్మిక సమస్యలు పరిష్కారం కావడం లేదని, రాష్ట్ర ప్రభుత్వం కూడా కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ముందుకు రావడం లేదని ఆరోపించారు. గతంలో జరిగిన స్ట్రక్చర్ సమావేశాల్లో ఒప్పుకున్న వాటిని అమలు చేయడం లేదని, అదేవిధంగా మెడికల్ బోర్డును నిర్వహించడం లేదని, దీని కారణంగా చాలామంది కార్మికులు తీవ్రఅనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. వెంటనే మెడికల్ బోర్డు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా సింగరేణిలో మారుపేర్లు విజిలెన్స్ కేసులు కార్మికులు డిపెండెంటు లకు ఉద్యోగాలు ఇవ్వకుండా యాజమాన్యం జాప్యం చేస్తుందన్నారు. యాజమాన్యం వీరి సమస్య పరిష్కారం కోసం అడ్వకేట్ జనరల్‌కు లీగల్ ఒపినీయన్ కోసం పంపి సంవత్సరం దాటినా ఇంతవరకు పరిష్కారం చూపకుండా యాజమాన్యం రాష్ట్ర ప్రభుత్వం మారుపేర్లు విజిలెన్స్ డిపెండెంట్‌లను వారి కుటుంబాలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి ఇవ్వాల్సిన బకాయిలను చెల్లించాలని తదితర డిమాండ్‌లపై మే మొదటి వారంలోగా యాజమాన్యం గుర్తింపు సంఘంతో మాట్లాడి పరిష్కారం చేయాలని, లేకుంటే రెండోవారంలో సమ్మె నోటీసు ఇస్తామని, సమ్మెకు కలిసి వచ్చే కార్మిక సంఘాలతో చర్చించి సమ్మె తేదీ ప్రకటించి సింగరేణిలో సమ్మె సైరన్ మోగిస్తామన్నారు. సమావేశంలో మిరియాల రంగయ్య, బ్రాంచి కార్యదర్శి వై.రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్, సిలిండర్ ధరలు తగ్గించి, పెట్రోల్, డీజిల్ కొరత నివారించాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాల నరసింహ్మా డిమాండ్




**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** గ్యాస్, సిలిండర్ ధరలు తగ్గించాలని, పెట్రోల్, డీజిల్ కొరతను నివారించాలని సిపిఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈనెల 6న జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాలలో రాస్తారోకో, ధర్నాలు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాల నరసింహ్మా, సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్.కె.ఫయాజ్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సిపిఐ లక్ష్మణాచారి భవన్‌లో జిల్లా సిపిఐ కార్యవర్గ సమావేశం ఈర్ల చంద్రమౌళి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎం.బాలనరసింహ్మా హాజరై మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తూ, ప్రజాసమస్యలను గాలికి వదిలేయడంతో పెట్రో ఉత్పత్తుల సంక్షోభం ఏర్పడిందన్నారు. నిరుపేదలకు అందనంత ఎత్తులో వంట సిలిండర్ గ్యాస్ ధరలు, పెట్రోల్, డీజిల్ రేట్లు పెరిగిందన్నారు. పెట్రో ఉత్పత్తుల సంక్షోభంతో నిత్యావసర ధరలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చర్యలు చేపట్టి వంటగ్యాస్ ధరలు తగ్గించాలని, పెట్రోల్, డీజిల్ కొరతలను నివారించాలని ధరలు తగ్గించాలని ఈనెల 6న జరిగే జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలంలో ధర్నాలను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు హెచ్.ఆనంద్ జి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే.కేశవులు గౌడ్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, ఈర్ల చంద్రమౌళి పెబ్బేటి విజయుడు, ఆర్.ఇంద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## కాల్వలో పడి ఇరిగేషన్ ఇఇ మృతి

- ఉదయ సముద్రం డి-37 కాల్వలో ఘటన
- ఆత్మహత్యా, ప్రమాదమా... అనే కోణంలో దర్యాప్తు చేస్తున్న పోలీసులు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) దిడిజేశ్ గంధం వారి గూడెంలో పనిచేస్తున్న సతీష్ చంద్ర యాదవ్ కాల్వలో పడి మృతి చెందారు. ఈ ఘటన జిల్లావ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. సోమవారం ఉదయం విధులకు వెళ్తున్న ఆయన ఉదయ సముద్రం ఎత్తిపోతల పథకం పరిధిలోని చందనపల్లి సమీపంలో గల డి37 కాల్వ వద్దకు చేరుకోగానే కాల్వలోకి దూకారు. నీటి ఉధృతికి కొట్టుకుపోయినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు, ఇరిగేషన్ అధికారులు గజ ఈతగాళ్ల సహాయంతో గాలించి మృతదేహాన్ని వెలికితీశారు. విధి నిర్వహణలో సౌమ్యుడిగా, నిబద్ధత గల అధికారిగా పేరున్న సతీష్ చంద్ర మృతితో కుటుంబ సభ్యులు, తోటి ఉద్యోగులు శోకసంద్రంలో మునిగారు. మృతుని భార్య ప్రమాదవశాత్తు కాల్వలో పడి మరణించినట్లు ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు. వ్యక్తిగత సమస్యలా, ప్రాజెక్టు పనుల ఒత్తిళ్లా లేక ప్రమాదవశాత్తూ పడిపోయారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వెల్లడించారు. ఘటనా స్థలంలో సతీష్ చంద్ర మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకొని కాల్ డేటాను విశ్లేషిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి సమగ్ర విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

## గుర్తు తెలియని వృద్ధుడు మృతి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణలో గత కొంతకాలంగా భిక్షాటన చేస్తూ జీవిస్తున్న గుర్తు తెలియని వృద్ధుడు సోమవారం మృతి చెందాడు. విషయాన్ని గమనించిన స్థానికులు టూ టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు వెంటనే స్పందించి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచారు. మృతుడి వివరాలు తెలిసినవారు టూటౌన్ ఎస్ఐ సైదులు ఫోన్ నంబర్ 8712670176 కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

## భార్య కాపురానికి రావట్లేదని మనస్తాపంతో భర్త ఆత్మహత్య



**ప్రజాపక్షం/చందూరు :** చందూరు మండలంలో వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. చందూరు ఎస్ఐ శివకుమార్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం మండల పరిధిలోని పుల్లెంల గ్రామానికి చెందిన బద్దుల లింగయ్య కుమారుడు బద్దుల శంకర్ (47) మద్యానికి బానిస కావడంతో భార్య గత నాలుగు సంవత్సరాల నుండి కాపురానికి రాకపోవడంతో మనస్తాపం చెంది శనివారం ఉదయం వ్యవసాయ పొలం వద్ద గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలో ఉండగా వెంటనే చికిత్స కోసం నల్లగొండలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా సోమవారం మధ్యాహ్నం మరణించాడు. మృతుని తండ్రి బద్దుల లింగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శివకుమార్ తెలిపారు.

## జల్సాలకు అలవాటై దొంగతనాలు



**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో మోటార్ సైకిళ్ల దొంగతనాలకు పాల్పడుతూ మిర్యాలగూడ పోలీసులకు ముగ్గురు దొరికారని డీఎస్పీ కె.రాజశేఖర్‌రాజు తెలిపారు. సోమవారం ఒన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో పరిధిలో కొంతకాలంగా మోటార్ సైకిళ్లను దొంగిలించుకుపోతున్నారని ఆదివారం రాత్రి మరో బైక్‌ను దొంగిలించుకొని పోతుండగా విద్యానగర్ వద్ద వన్‌టౌన్ పోలీసులు సాయి సిద్ధు, మెరుగు సిద్ధు, తమ్మిశెట్టి లోకేష్‌లను పట్టుకొని విచారించగా కోళ్ల, స్పా, బైక్ దొంగతనం చేస్తూ జల్సాలు చేసుకుంటున్నామని చెప్పారన్నారు. వన్‌టౌన్ సీఐ నాగార్జునరావు, ఎస్ఐ సైదిరెడ్డి, సిబ్బంది రెండు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి పట్టుకున్నారన్నారు. వారి నుంచి ఏడు బైక్‌లు స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపరిచామన్నారు. బాల్యంలో దొంగతనాలు చేయగా జువైనల్ హోంకు పంపినా మార్పు రాలేదన్నారు.

## ఇద్దరు పేకాటరాయుళ్ల అరెస్ట్

**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** అక్రమంగా పేకాట ఆడుతున్న ఇద్దరిని రూరల్ పోలీసులు పట్టుకున్న సంఘటన సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని దుర్గానగర్‌లో ఒక షెట్టర్ వెనుక కొంతమంది పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడిచేయగా ఇద్దరిని పట్టుకోగా ముగ్గురు పారిపోయారని అన్నారు. పట్టుబడిన వారి నుంచి రూ.12,580 నగదు, రెండు సెల్ ఫోన్లు, 104 ప్లేయింగ్ కార్డులు, గ్రౌండ్ న్యూస్ పేపర్ షీట్లను స్వాధీనం చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా పేకాట ఆడితే అట్టి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఫీజుల దోపిడీపై కొరడా ఝుళిపించాలి

- ఏఐఎస్ఎఫ్ డిమాండ్



**ప్రజాపక్షం/భువనగిరి :** యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ఫీజుల నియంత్రణ చట్టాన్ని తుంగలో తొక్కి, ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్ అన్నారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏవో అంజిరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్ మాట్లాడుతూ 'ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టం తెచ్చినా క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదన్నారు. ట్యూషన్ ఫీజు, డెవలప్‌మెంట్ ఫీజు, బిల్డింగ్ ఫండ్ పేరుతో పాఠశాల యాజమాన్యాలు దోపిడీ చేస్తున్నాయని తెలిపారు. దీంతో పేద, మధ్యతరగతి విద్యార్థుల చదువులు భారంగా మారాయి' అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థులకు న్యాయం చేయకపోతే జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం' అని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి లోకేష్, జిల్లా నాయకులు మహేష్, శ్రీనివాస్, రాములు, భూమయ్య, బాలకృష్ణ పాల్గొన్నారు.

# 1.39లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** జిల్లాలో ఇప్పటి వరకు 1.39లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, వీటిలో 1.31లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు తరలించడం జరిగిందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. సోమవారం రాష్ట్ర మంత్రులు హైదరాబాద్ నుండి నిర్వహించిన విసిలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. కొనుగోలు పూర్తి అయిన వెంటనే రైతుల ఖాతాలో నగదు జమ చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు రూ.100కోట్ల నగదు రైతుల ఖాతాలో జమ చేసినట్లు వెల్లడించారు. రెండు రోజుల క్రితం రూ.40కోట్ల పేమెంట్స్ రైతుల ఖాతాలో జమ చేయడం చేయగా, ఒక్కరోజులోనే రూ.44కోట్ల పేమెంట్స్ రైతుల ఖాతాలో జమ చేశామన్నారు. అకాల వర్షాలతో జిల్లాలో నష్ట నివారణ చర్యలు తీసుకున్నట్లు స్పష్టం చేశారు. నూతనకల్ మండలంలో కురిసిన వర్షాలతో 250 బస్తాల ధాన్యం తడవడం జరిగిందన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ రోజుకు 10వేల మెట్రిక్ టన్నుల లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తున్నామని, ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే మిల్లులకు తరలించేందుకు ప్రత్యేక అధికారులు పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. మిల్లులకు తరలించేందుకు అవసరమైన లారీలను అందుబాటులో ఉంచడం జరిగిందని చెప్పారు. గన్నీ బ్యాగ్స్ సరిపడా అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగేశ్వర్ శర్మ, జిల్లా సహకార అధికారి ప్రవీణ్ కుమార్, జిల్లా మేనేజర్ సివిల్ సప్లై శ్రీధర్ రెడ్డి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

**ప్రజాపక్షం/భువనగిరి :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డితో కలిసి, వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 60 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సి.ఈ.ఓ శోభారాణి, డి.ఆర్.ఓ జయమ్మ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్ డే ద్వారా సత్వర న్యాయం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రజల సమస్యలను నేరుగా విని వాటికి త్వరిత పరిష్కారం అందించడం పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో వివిధ మండలాల నుంచి వచ్చిన దాదాపు 35 మంది బాధితుల ఫిర్యాదులను ఎస్‌పి స్వయంగా స్వీకరించి సమగ్రంగా పరిశీలించారు. ప్రతి ఫిర్యాదును శ్రద్ధగా విని, సంబంధిత అధికారులకు చట్టపరంగా త్వరితగతిన న్యాయం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి పౌరుడు భయపడకుండా తమ సమస్యలను పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో పారదర్శకత, న్యాయం, వేగం ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రీవెన్స్ డే కార్యక్రమం ద్వారా సాధారణ ప్రజలకు పోలీస్ శాఖపై నమ్మకం పెరుగుతుందని, ప్రజలతో సత్సంబంధాలు బలోపేతం అవుతాయని ఆయన పేర్కొన్నారు. అందిన ఫిర్యాదులపై నిర్దిష్ట గడువులో విచారణ పూర్తి చేసి బాధితులకు న్యాయం అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# బాధితులకు మొబైల్స్ అందజేత

- రూ.20లక్షల విలువ గల 103 మొబైల్స్ రికవరీ .. వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్‌పి కె.నరసింహ




**ప్రజాపక్షం/సూర్యాపేట :** జిల్లాలో 12వసారి సెల్‌ఫోన్ రికవరీ మేళా ఏర్పాటు చేసి వివిధ రూపాల్లో పోగొట్టుకున్న సుమారు రూ.20లక్షల విలువ గల 103 ఫోన్లను గుర్తించి రికవరీ చేసి జిల్లా ఎస్‌పి కె. నరసింహ చేతుల మీదుగా మొబైల్ ఫోన్ల యజమానులకు అందజేశారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సెల్‌ఫోన్ రికవరీ మేళా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో మొబైల్ ఫోన్ ప్రతి ఒక్కరికి నిత్యవసరమైందన్నారు. దీనిని కమ్యూనికేషన్ కోసం, ఆన్‌లైన్ విద్య కోసం, ఆర్థికపరమైన అంశాలకు వినియోగిస్తున్నందున మొబైల్ చోరికి గురైనా, పోగొట్టుకున్నా అందులో ఉన్న సమాచారం నేరగాళ్ళు దోచుకునే అవకాశముందున్నారు. ఒక్కో మొబైల్ రికవరీ చేయడానికి సైబర్ వారియర్స్ పోలీస్, టెక్నికల్ టీం పోలీసు సిబ్బంది చాలా కృషి ఉందన్నారు. ఇతర రాష్ట్రాల వారి నుండి ఈ మొబైల్స్‌ను రికవరీ చేస్తున్నట్లు తెలిపారు. పోలీసులు ప్రజల ఆస్తుల రక్షణలో అనుక్షణం ప్రజల పక్షాన పనిచేస్తుందన్నారు. తప్పుడు ప్రవర్తన కలిగిన వ్యక్తులకు, నేరాలకు పాల్పడే వారికి ఫ్రెండ్లీ పోలీసు ఉండదని స్పష్టం చేశారు. ఎవరైనా మొబైల్ పోగొట్టుకున్నా లేదా దొంగలించబడిన వెంటనే సిఇఐఆర్ పోర్టల్ నందు నమోదు చేసుకోవాలన్నారు. మొబైల్‌ను బ్లాక్ చేసి, మీ సేవా ద్వారా దరఖాస్తు సంబంధిత పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. బాధితులకు మొబైల్ ఫోన్లను అప్పగించడంలో కృషి చేస్తున్న ఐ.టి కోర్ సిబ్బందిని, పోలీస్ స్టేషన్ సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, ఐటి కోర్ ఆర్ఎస్ఐ రాజశేఖర్, ఐటి కోర్ సిబ్బంది, పోలీస్ సైబర్ వారియర్స్, బాధితులు ఉన్నారు.

# ధాన్యం తడవకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలి

- కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశం
- మూడు, నాలుగు రోజులు అకాల వర్షాల సూచన



**ప్రజాపక్షం/నల్లగొండ :** రానున్న మూడు, నాలుగు రోజులు అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడవకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ధాన్యం సేకరణ అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని సూచించారు. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా కురిసిన అకాల వర్షం నేపథ్యంలో ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సోమవారం రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి హైదరాబాద్ నుంచి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి జిల్లా కలెక్టర్లు, ధాన్యం సేకరణ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం 4:45 నుంచి 5 గంటల మధ్య నల్లగొండ, మిర్యాలగూడ, హాలియా తదితర ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసిందని కలెక్టర్ తెలిపారు. కల్లాల్లో, కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడవకుండా రైతులు టార్పాలిన్లు కప్పినా బలమైన గాలులకు ఎగిరిపోయి ధాన్యం తడిసిందని, ప్రస్తుతం ఆధాన్యం ఆరిపోయిందని వివరించారు. కొనుగోలు కేంద్రాలు, మిల్లుల వద్ద ఉన్న ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలని, లారీల సమస్య లేకుండా తగినన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వాతావరణ శాఖ సూచనల మేరకు అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు.



## ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**ప్రజాపక్షం/మునుగోడు:** గ్రామీణ ప్రజలు ఆధ్యాత్మిక ఆచారాలను అలవర్చుకోవడం ద్వారా పల్లెల్లో ప్రశాంత వాతావరణం నెలకొని, సుఖసంతోషాలతో జీవనం సాగించవచ్చని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన దేవాలయ ఉత్సవాల్లో ఎమ్మెల్సీ పాల్గొన్నారు. కిష్టాపురం గ్రామంలో జరిగిన బొడ్రాయి మహోత్సవం,ఇప్పర్తి గ్రామంలో రేణుక ఎల్లమ్మ నూతన దేవాలయ ఉత్సవాలు, ఊకోండి గ్రామంలో గంగాదేవి ఉత్సవాల్లో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల పెద్దలు, ప్రజలు ఎమ్మెల్సీకి ఘన స్వాగతం పలికి శాలువాలతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రేమానురాగాలు, స్నేహబంధాలు పెంపొందించడంలో పండుగలు ముఖ్య పాత్ర పోషిస్తాయని అన్నారు. కుటుంబ వ్యవస్థ బలపడటానికి, బంధుత్వాలు మరింత గట్టిపడటానికి ఇలాంటి ఆధ్యాత్మిక ఉత్సవాలు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కిష్టాపురం సర్పంచ్ మాలగ శ్రీను, మాజీ ఎంపీటీసీ,కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భీమనపల్లి సైదులు, మాజీ జెడ్పిటిసి జాజుల అంజయ్య, మునుకుంట్ల మల్లయ్య, ఇప్పర్తి సర్పంచ్ చీమల రాజు, మాజీ సర్పంచ్ బొజ్జ శ్రీను, ఉషయ్య, లింగయ్య, సత్యం, జాల పరమేష్, స్వామి మల్లేశం పాల్గొన్నారు.

# ప్రభుత్వం పూర్తి అవినీతిమయంలో కూరుకుపోయింది




- ఆర్మూరు శాసనసభ్యులు పైడి రాకేష్ రెడ్డి

**ప్రజాపక్షం/భువనగిరి :** కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పూర్తి అవినీతిమయంలో కురుకుపోయిందని ఆర్మూరు శాసనసభ్యులు పైడి రాకేష్ రెడ్డి అన్నారు. సోమవారం భువనగిరిలోని ఎంఎస్ఆర్ గార్డెన్స్‌లో యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు అశోక్ గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రెండు ప్రజలను గోస పెడుతున్నాయన్నారు. రైతులను యువకులను మహిళలను అందరినీ మోసం చేసిందని ఆయన అన్నారు. రేవంత్ ప్రభుత్వం వడ్లను కొనకుండా రైతులను చాలా ఇబ్బంది పెడుతుందని, రైతుబంధు కేవలం ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే గుర్తుకొస్తుందని ఎన్నికలబందుగా మారిందని ఆయన అన్నారు. ఈనెల 10వ తేదీన సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో జరగనున్న దేశ ప్రధాని నరేంద్ర మోడీ బహిరంగ సభలో ప్రజలను భాగస్వామ్యం చేయాలని, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అందుకుగాను పార్టీ శ్రేణులకు ఆయన దేశాన్ని నిర్దేశం చేశారు. అలాగే తెలంగాణ రాష్ట్ర బిజెపి అధికార ప్రతినిధి తాడూరు శ్రీనివాస్ మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లా నుండి కార్యకర్తలు పార్టీ అభిమానులు అధిక సంఖ్యలో రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దాసరి మల్లేశం, తుమ్మల మురళీధర్ రెడ్డి, మాయ దశరథ, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రచ్చ శ్రీనివాస్, బోయినపల్లి గోపాల్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు జైనపల్లి శ్యాంసుందర్ రెడ్డి, పట్నం శ్రీనివాస్, గూడూరు నరోత్తం రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు కొప్పుల యాదిరెడ్డి, కాదురి అచ్చయ్య, చందా మహేందర్, జిల్లా కార్యదర్శులు తడిసిన మల్లారెడ్డి, వైజయంతి, మేడి కోటేష్, లక్ష్మీ నారాయణ, కామిటికారి కృష్ణ పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం




- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం

**ప్రజాపక్షం/నకిరేకల్ :** రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు. సోమవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నకిరేకల్ పట్టణంలోని చీమలగడ్డ రైతు వేదికలో నిర్వహించిన రైతు వారోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అభ్యున్నతి,వ్యవసాయ రంగ అభివృద్ధిపట్ల ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఎకరాకు సాగునీరు అందించడం,సకాలంలో ఎరువులు అందుబాటులో ఉంచడం, పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం ప్రభుత్వ బాధ్యతేనని స్పష్టం చేశారు. రైతుల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేస్తోందన్నారు. సహాయ వ్యవసాయ సంచాలకులు మహమ్మద్ జానిమియా మాట్లాడుతూ నేల ఆరోగ్య పరిరక్షణ, సమతుల ఎరువుల వినియోగం, సహజ వ్యవసాయం, వానాకాలంలో నాణ్యమైన విత్తనాల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. భూసార పరీక్షల ప్రాధాన్యం, సాయిల్ హెల్త్ కార్డుల ఉపయోగాలను వివరించారు.వీటి ద్వారా నేల గుణాత్మకతను అంచనా వేసి, పంటల దిగుబడిని పెంచుకోవచ్చని తెలిపారు. నానో యూరియా, నానో డీఏపీ వినియోగంతో పంటల ఉత్పాదకత మెరుగుపడుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ చౌగొని రజిత శ్రీనివాస్, తహసీల్దార్ యశ్వంత్, వెంకటేశ్వరరావు, వ్యవసాయ విస్తరణాధికారి ఎస్కే హిదాయతుల్లా, వివిధ గ్రామాల రైతులు, సాయిల్ హెల్త్ వాలంటీర్లు, ఎరువుల డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు జవాబుదారీగా పని చేయండి

- కో ఆప్షన్ సభ్యుల ఎన్నికలో ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** నిత్యం ప్రజల్లో ఉండి సమస్యలు తెలుసుకుంటూ పరిష్కారాలకై జవాబుదారిగా పని చేయాలనీ అభివృద్ధి సంక్షేమంలోనే కాక నిధులు మంజూరు వంటి అన్నిరకాలుగా అండగా ఉంటానని భువనగిరి ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి భరోసా ఇచ్చారు. సోమవారం పోచంపల్లి పట్టణ మున్సిపల్ కోఆప్షన్ సభ్యుల ప్రమాణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 4 కో ఆప్షన్ మెంబర్ల ఎన్నికలో దరఖాస్తు చేసుకున్న వారిలో ఇద్దరు ఉపసంహరించుకోవడంతో నలుగురు మద్ది మధుసూదన్ రెడ్డి బోడ రమాదేవి సయ్యద్ ఎజాస్ మహమ్మద్ రసూల్ బి లను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి ప్రకటించారు. ఎంపికైన అభ్యర్థులకు ఎమ్మెల్యే ఎన్నిక పత్రాలు అందజేసీ ప్రమాణస్వీకారం చేయించి సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే పోచంపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికై రూ.49 కోట్లు మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. పోచంపల్లి పట్టణాన్ని అభివృద్ధి పరంగా ఆదర్శంగా నిలబెట్టేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు అధ్యక్షతన కమిషనర్ ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. పట్టణ అభివృద్ధి కోసం చేసిన ప్రతిపాదనలను కౌన్సిల్ ఆమోదించింది. మున్సిపల్ వైస్ చైర్మన్ కొయ్యడ రజిని శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు కొండమడుగు ఎల్లస్వామి శ్రీరామ, మంజుల లింగస్వామి, రావుల జంగయ్య యాదవ్, పెద్దల చక్రపాణి, బాత్క లింగస్వామి, కర్నాటి వరలక్ష్మి నరసింహ, రాపోలు కావ్య వేణు, దేవరాయ కుమార్, జింకల లావణ్య యాదగిరి ముదిరాజ్, కుడికాల అఖిల బలరాం, సూరేపల్లి రాధిక రమేష్, సీనియర్ అసిస్టెంట్ రాజేష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## విద్యార్థులకు ఎమ్మెల్యే భరోసా

- రూ.25లక్షల విలువైన నగదు ప్రోత్సాహకం అందజేత

**ప్రజాపక్షం/మిర్యాలగూడ :** ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తన పుట్టిన రోజు సందర్భంగా సోమవారం మిర్యాలగూడ నియోజకవర్గవ్యాప్తంగా ఇటీవల వెలువడిన పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ పాఠశాలల నుంచి 60 మంది విద్యార్థులను ఎంపిక చేసి రూ.25లక్షల నగదు ప్రోత్సహకాన్ని ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్యేకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి ఆయనతో కేక్ కట్ చేయించారు. అనంతరం ఎమ్మెల్యే ఎన్‌టీఆర్ మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. అదేవిధంగా బీఎల్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేసవి తాపాన్ని ప్రజలు తట్టుకునేలా ఉచిత పెరుగన్నం పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీటీడీ జేఈవో శరత్‌కుమార్, డీఎస్పీ రాజశేఖర్‌రాజు, డీసీసీ అధ్యక్షుడు పున్నా కైలాష్‌నేత, మున్సిపల్ చైర్పర్సన్ చిలుకూరి సుధాబాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీషనవీన్, నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

తూప్రాన్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ కీర్తన



**ప్రజాపక్షం/మనోహరాబాద్:** ఆయిల్ పామ్ సాగుతో రైతులకు అధిక లాభాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని తూప్రాన్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ కీర్తన విటల్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన మనోహరాబాద్ రైతు వేదికలో ఏర్పాటు చేసిన రైతు వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తూప్రాన్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ కీర్తన విటల్ రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగుతో రైతులకు వచ్చే లాభాల గురించి వివరించారు. అలాగే రైతులు వరి విణా వ్యవసాయ పొలంలో మట్టి నమూనా పరీక్షలు తప్పకుండా చేయించాలని, మట్టి పోషకాలు, లవణ పరీక్ష నమూనా గురించి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం వ్యవసాయ భూమి కలిగి ఉన్న ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే పిఎం కిసాన్‌తో పాటు ఇతర కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల లబ్ధికి ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకొని రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు అందవని స్పష్టం చేశారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకుని రైతులు ఈనెల 14వ తేదీ లోపు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు అనుష భాస్కర్ యాదవ్, కల్యాణ్ దాస్, వెంకటేశం, నాగరాజు, ఎంపీడీవో కృష్ణ మూర్తి, ఎంపీఓ శ్రీనివాసరెడ్డి, ఏఈఓ నరేందర్ గౌడ్, నాయకులు జావిద్ పాషా, శ్రీనివాస్ ముదిరాజ్, రైతులు,తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం సేకరణలో పకడ్బందీ చర్యలు

కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/మోర్తాడ్ :** కొనుగోలు కేంద్రాల ద్వారా వరి ధాన్యం సేకరణలో జాప్యానికి తావు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. సోమవారం నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. మండలంలోని దొన్పాల్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సైతం కలెక్టర్ పరిశీలించారు. రైతులు తరలించిన ధాన్యం నిల్వలను పరిశీలించారు. రైతుల నుండి ఇప్పటి వరకు సేకరించిన ధాన్యం నిల్వలు, మిల్లులకు తరలించిన ధాన్యం గురించి నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకొని రికార్డులను పరిశీలించారు. కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చిన రైతులను పలకరించి, కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా..? అని ఆరా తీశారు. ధాన్యం కొనుగోళ్లలో ఒకింత జాప్యం జరుగుతోందని, ట్రక్ షీట్ వివరాలు తమకు అందించడం లేదని రైతులు కలెక్టర్ దృష్టికి తేగా, మోర్తాడ్ సహకార సంఘం ధాన్యం కొనుగోలు కేంద్రం ఇన్‌ఛార్జి దిలీప్‌పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ, షోకాజ్ నోటీసు జారీ చేయాలని డీసీఓను ఆదేశించారు. పూర్తి పారదర్శకంగా పని చేస్తూ రైతులు నష్టపోకుండా చూడాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచనలు చేశారు. పంట సాగు చేసిన ప్రతిరైతు వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని, వరుస క్రమంలో రైతుల వివరాలు నమోదు చేసుకొని ఎఫ్ఏక్యూ ప్రమాణాలకు లోబడి ఉన్న ధాన్యాన్ని వెంటవెంటనే తూకం వేయించాలన్నారు. మిల్లుల వద్ద ధాన్యం వేగంగా దిగుమతి చేసుకొని, సత్వరం ట్రక్ షీట్లు అందించేలా చూడాలని ఈసందర్భంగా కృష్ణను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులు ఇబ్బందులు పడకూడదని కేంద్రాలకు ధాన్యం తెచ్చిన వెంటనే నాణ్యత ప్రమాణాలను పరిశీలించి తూకం జరిపించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి కేంద్రాన్ని సందర్శిస్తూ, ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాఫీగా జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలన్నారు. కాగా రైతులు నాణ్యత ప్రమాణాలకు లోబడి శుభ్రపరిచి బాగా ఆరబెట్టిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తేవాలని సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, డీఆర్డీఓ సాయన్న, డీఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, సివిల్ సప్లైయ్ డిఎం ప్రవీణ్, జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్, మోర్తాడ్ మండల వ్యవసాయ అధికారి హరీష్ కుమార్, మోర్తాడ్ సర్పంచ్ బోగ ఆనంద్, స్థానిక పంచాయతీ కార్యదర్శి సైపోద్దీన్, స్థానిక అధికారులు ఉన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు ఎప్పటికప్పుడు పరిష్కారం: కలెక్టర్ భవేశ్ మిశ్రా



**ప్రజాపక్షం / నిర్మల్ కలెక్టరేట్ :** ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి తక్షణమే స్పందించాలని సూచించారు. మండలాల వారిగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, ఫించన్లు, భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను జిల్లా కలెక్టకు సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఆర్‌డిఓ కార్యాలయం నిర్మల్ సబ్ కలెక్టర్ కార్యాలయం, భైంసాలో డివిజన్ వారిగా ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. మారుమూల గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే గణనలో భాగంగా నిర్వహిస్తున్న సెల్ఫ్ ఎన్యుమరేషన్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు, బి.వెంకటేశ్వర్లు, కిషోర్‌కుమార్, వివిద శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 103 ఫిర్యాదులు



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ప్రజావాణికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 103 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, డీఆర్‌డీఓ సాయన్న, జడ్పీ సీఈఓ సాయగౌడ్, డీపీఓ శ్రీనివాస్‌లకు విన్నవిస్తూ అర్జీలను సమర్పించారు. కాగా అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కాగా సబ్‌కలెక్టర్, ఆర్డీఓల నేతృత్వంలో డివిజన్ స్థా యిలో నిర్వహించే ప్రజావాణిలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అందరూ స్వీయ గణనలో పాల్గొనండి

ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు



**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** మంచిర్యాల నియోజకవర్గంలో ప్రతీ ఒక్కరు తమ వంతు బాధ్యతగా స్వీయ జనాభా గణనలో పాల్గొనాలని మంచిర్యాల శాసనసభ్యుడు కొక్కిరాల ప్రేంసాగర్‌రావు కోరారు. ఎమ్మెల్యే ఆయన నివాసంలో జనాభా లెక్కల స్వీయ గణనలో స్వయంగా తన మొబైల్‌లో నమోదు చేసుకున్నారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆధ్వర్యంలో తన నివాసంలో నమోదు చేసుకున్న సందర్భంగా మాట్లాడుతూ, భారతదేశ జనాభా లెక్కలు 2027 కు సంబంధించిన తెలంగాణ రాష్ట్రంలో 2026 ఏప్రిల్ 26 నుండి స్వీయ గణన అధికారికంగా ప్రారంభమైందని ఈ సౌకర్యం మే 10వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. దేశ అభివృద్ధిలో జనాభా లెక్కలకు అత్యధిక ప్రాముఖ్యత ఉంటుందని, తాను కూడా ఇందులో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలంతా ఈ ప్రక్రియలో పాల్గొని ఖచ్చితమైన సమాచారం ఇవ్వాలని తెలిపారు. అధికారిక వెబ్‌సైట్‌లో స్వీయ గణన ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రణాళికా రచన, సవుపరిపాలన, సమానాభివృద్ధికి జనాభా లెక్కలు ఒక పునాది రాయి వంటిదని, స్వీయగణన సమగ్ర సమాచార సేకరణకు బలమైన పునాది అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పాపయ్య, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డివైఎస్‌ఓ రాజేందర్ పాల్గొన్నారు.

## విద్య, వైద్యం, వ్యవసాయంపై దృష్టి

ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



**ప్రజాపక్షం/ ఉట్నూర్:** ఇంద్రవెల్లి మండలం వాల్గొండ రైతు వేదికలో సోమవారం నిర్వహించిన రైతు వార్షికోత్సవంలో కలెక్టర్ రాజర్షి షాతో కలిసి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి అధికారులు విద్యా, వైద్యం, వ్యవసాయ రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, ఇందిరమ్మ ఇళ్లు, దేవాలయాల షెడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశామన్నారు. ముత్నూర్ ఆస్పత్రిని ఇంద్రవెల్లికి తరలించాలని, వడగావ్ చెరువు నిర్మాణంపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలని, సేంద్రియ ఎరువులతో సాగు చేయాలని రైతులకు పిలుపునిచ్చారు. ఈ నెలలో ముఖ్యమంత్రి పర్యటన ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ, కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## స్వీయ జనగణనలో భాగస్వాములు కావాలి

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్, మహ్మద్‌నగర్ మండలాల ప్రజలు స్వీయ జనగణనలో భాగస్వాములు కావాలని ఇరు మండలాల అధికారులు సోమవారం ఒక పత్రికా ప్రకటనలో కోరారు. ఇందులో భాగంగా వారి సూచనల ప్రకారం ప్రజాప్రతినిధులు, విద్యావంతులకు, ఉద్యోగస్థులు భారత ప్రభుత్వం తలపెట్టిన జనాభా గణన 2026కు సంబందించి మీ మీ కుటుంబం వివరాలను స్వీయ గణనలో సూచించిన లింక్ ద్వారా నమోదు చేసుకోవాలని కోరారు. ఇందుకు మొబైల్ నెంబర్ ఓటీపీ, ఇంటి పెద్ద పేరు, పిన్‌కోడ్, వివరాలను ఇంటర్‌నెట్ కలిగిన మొబైల్, లేదా ల్యాప్‌టాప్ ద్వారా నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. ఇందులో ఇంటి పెద్ద పేరు, మొబైల్ నెంబర్, ఓటీపీ వెరిఫై తర్వాత భాష, లొకేషన్ సెలక్ట్ చేసుకుని, జిల్లా, మండలం, ల్యాండ్ మార్క్‌లో లొకేషన్ యాడ్ చేసి అందులో అడిగిన ప్రశ్నలకు సమాధానాలు పూర్తిచేయాలన్నారు. అనంతరం ఇంటి వివరాలు, సౌకర్యాలు, ఆస్తులు, తదితర అన్ని వివరాలు నమోదు చేసి స్క్రీన్‌షాట్ తీసుకోవాలని, మే 16 నుండి జూన్ 14 మధ్య ఎన్యుమరేటర్ ఇంటికి వచ్చినప్పుడు ఎస్ఈ ఐడీ చెప్తే ఆయన వెరిఫై చేసి వెళ్తారన్నారు. ఏదైనా సందేహం వస్తే టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ 1855కి కాల్ చేయాలని తెలిపారు. ఈ ప్రక్రియ మొత్తం 15 నిమిషాల్లో పూర్తి అవుతుందన్నారు.

## మొక్కజొన్న పంట దగ్ధం



**ప్రజాపక్షం / కౌటాల:** ప్రమాదవశాత్తు రెండు ఎకరాల మొక్కజొన్న పంట అగ్నికి ఆహుతై రైతుకు భారీ నష్టం వాటిల్లింది. కౌటాల మండలంలోని నాగెపల్లి గ్రామానికి చెందిన రైతు గుర్లే బిక్కుకు చెందిన చేనులో ఈ ఘటన చోటుచేసుకుంది. చేతికి వచ్చిన పంట కళ్లముందే బూడిద కావడంతో బాధిత రైతు కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. గుర్లే బిక్కు తనకున్న రెండు ఎకరాల్లో అప్పులు చేసి మొక్కజొన్న సాగు చేశాడు. పంట కోతకు వచ్చే సమయంలో ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని చేను మొత్తం వ్యాపించింది. రైతు పొలానికి వెళ్లి చూసేసరికి పంట పూర్తిగా దగ్ధమైంది. అప్పులు చేసి సాగు చేసిన పంట అగ్నిపాలవడంతో ఏం చేయాలో తెలియక బాధితుడు కన్నీరు మున్నీరవుతున్నాడు. ప్రభుత్వం వెంటనే స్పందించి, క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

## ధాన్యాన్ని త్వరగా ఆరబెట్టి మిల్లులకు తరలించాలి

కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం/ మందమర్రి/ నస్పూర్:** ఇటీవల కురిసిన వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టి త్వరగా మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని మందమర్రి మండలం సారంగపల్లి, బొక్కలగుట్ట ప్రాంతాలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో ఒక భాగంగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి మద్దతు ధర చెల్లించి వరి ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు తడిచిన ధాన్యాన్ని ఆరబెట్టి కేటాయించిన మిల్లులకు త్వరగా తరలించాలని నిర్వాహకులకు సూచించారు. ప్రభుత్వం చేపట్టిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. రైతులు ధాన్యాన్ని నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, రైతుల సౌకర్యార్థం కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, నీడ, తూకం యంత్రాలు, ప్యాడి క్లీనర్లు ఇతర సదుపాయాలు కల్పించాలని తెలిపారు. రైతు వివరాలను సిస్టం లో నమోదు చేసి ఆధార్ కార్డు ద్వారా వారి గుర్తింపును దృవీకరించాలని, రైతు భూమి విస్తీర్ణం, పండించిన ధాన్యం వివరాలను సరి చూడాలని, ధాన్యం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండే విధంగా పరిశీలించాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రైతుల బ్యాంకు ఖాతాలలో నగదు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లాలోని బాసర పోలీస్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న వెంకట రమణ అనే హోం గార్డు కొన్ని రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో దురదృష్టవశాత్తు మృతి చెందారు. ఈ సందర్భంగా యాక్సిడెంటల్ బెనిఫిట్ స్కీం కింద మృతుడి కుటుంబానికి రూ. 30 లక్షల చెక్కును జిల్లా ఎస్‌పి డా.జి. జానకి షర్మిల తన చేతల మీదుగా కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది సంక్షేమం పట్ల ప్రభుత్వం మరియు పోలీసుశాఖ ఎల్లప్పుడు కట్టుబడి ఉంటుందని తెలిపారు. మృతుడి కుటుంబానికి ఈ ఆర్థిక సహాయం కొంతమేరకు ఆదరణగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## బాలికపై అఘాయిత్యం.. నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

**ప్రజాపక్షం / బెల్లంపల్లి:** ఆరేళ్ల మైనర్ బాలికపై అఘాయిత్యానికి ఒడిగట్టిన నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష పడింది. బెల్లంపల్లి ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 2020లో జరిగిన ఈ ఘటనపై విచారణ చేపట్టిన మంచిర్యాల ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు జడ్జి లాల్ సింగ్ శ్రీనివాస నాయక్ సోమవారం తీర్పు వెల్లడించారు. శిక్షతో పాటు 10 వేల రూపాయల జరిమానా విధిస్తూ, బాధితురాలికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డిఎల్ఎస్ఏ) ద్వారా రెండు లక్షల రూపాయల పరిహారం అందించాలని ఉత్తర్వులు జారీ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బెల్లంపల్లి బాబు క్యాంప్ ప్రాంతానికి చెందిన బండ సాయికృష్ణ (44) కిరాణా షాపు నిర్వహిస్తున్నాడు. 2020 అక్టోబర్ 21న తన అమ్మమ్మ ఇంటికి వచ్చిన ఆరేళ్ల బాలిక ఆడుకోవడానికి నిందితుడి ఇంటికి వెళ్లింది. ఆ సమయంలో నిందితుడు బాలికను గదిలోకి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించగా, భయపడిన బాధితురాలు ఇంటికి వచ్చి తల్లికి వివరించింది. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు అప్పటి ఇన్స్పెక్టర్ బి. రాజు కేసు నమోదు చేయగా, ఎసిపి ఎం.ఎ. రహమాన్ దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ ఏ. రాంభావో కోర్టులో 19 మంది సాక్షులను ప్రవేశపెట్టి నేరాన్ని నిరూపించారు. నేరం రుజువు కావడంతో కోర్టు నిందితుడికి శిక్ష ఖరారు చేసింది. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన డిసిపి ఏగ్గడి భాస్కర్, ఎసిపి కిరణ్ కుమార్, ఇన్స్పెక్టర్ కె. శ్రీనివాస రావు, కోర్టు సిడిఓ సరోజ, లైజన్ ఆఫీసర్లు గోవిందరావు, వెంకటేశ్వర్లు, సునీల్, భరోసా బృందాన్ని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందించారు.

## జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/ఆదిలాబాద్ అర్బన్:** జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే పాయల్ శంకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. షెడ్యూల్ ప్రకారం రైతులందరి నుండి జొన్న పంటను కొనుగోలు చేస్తామని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## లోన్ల దరఖాస్తుదారులకు 7న ఇంటర్వ్యూలు

**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎస్‌సి నిరుపేద నిరుద్యోగ యువతీయువకులు స్వయం ఉపాధి కల్పన కొరకు అన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న వారికి ఈ నెల 7వ తేదీ ఉదయం పది గంటలకు ఇంటర్వ్యూలు నిర్వలహిస్తున్నట్లు మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ లోన్లను వివిధ రకాల వ్యాపారాల కొరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు దరఖాస్తు ఫారముతో పాటు సూచించిన ధృవపత్రాలతో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు. ఇంటర్వ్యూకు వచ్చే వారు తన ఆన్‌లైన్ చేసిన అప్లికేషన్ ఫారం, దరఖాస్తు ప్రతంపై ఫోటో అంటించాలని, ఆధార్ కార్డు జిరాక్సు, ఆదాయ ధృవీకరణ పత్రం, కుల ధృవీకరణ పత్రం జిరాక్స్, వాహనము కొరకు దరఖాస్తు చేసుకున్న వారు డ్రైవింగ్‌లైసెన్స్, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్‌లతో హాజరు కావాలని కమిషనర్ కోరారు.


## రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి

ఆర్‌డిఓ రామకృష్ణ



**ప్రజాపక్షం/నర్సాపూర్:** రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని నర్సాపూర్ ఆర్‌డిఓ రామకృష్ణ అన్నారు. సోమవారం నర్సాపూర్ పట్టణంలో. అదేవిధంగా లింగాపూర్ గ్రామంలో రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు వారోత్సవాలు నిర్వహించారు. ఈ వారోత్సవాలకు ము ఖ్య అతిథులుగా ఆర్‌డిఓ రామకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి రాజు యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్‌డిఓ మాట్లాడుతూ, రైతులు వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలైన కుసుమలు, ఆయిల్ పామ్ పంటలు సాగు చేసి అధిక లాభాలు పొందాలని సూచించారు. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు రైతులు పంటలను సాగు చేయాలని తెలిపారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి రాజు యాదవ్ మాట్లాడుతూ, రైతుల సంక్షే మం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని అన్నారు. రైతులు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగపరచుకొని పంటలు సాగు చేసి అధిక లాభాలు పొందాలని సూచించారు. వ్యవసాయ మండలాధికారి దీపిక మాట్లాడుతూ రైతు వారోత్సవాల్లో భాగంగా మొదటి రోజు సోమవారం రైతులకు శాస్త్రీయ పద్ధతుల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. నేల ఆరోగ్య సంరక్షణపై ప్రతిజ్ఞ చే యించి, మట్టి నమూనా సేకరించే విధానం, మట్టి పరీక్ష యొక్క లాభాల కోసం వివరించడం జరిగిందన్నారు. మట్టి ఆరోగ్య కార్డులు రైతులకు అందించి ఫలితాలను బట్టి రైతులు పంటలకు ఎరువులు వే యాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసా య సహాయ సంచారకులు సంధ్యా రాణి హార్టికల్చర్ ఆఫీసర్ రచన, వ్యవసాయ విస్తరణ లుఅధికారి మోహన్ దుర్గ ప్రసాద్, ఉప సర్పంచ్ రవి నాయక్, కౌన్సిలర్ సుధీర్ గౌడ్ రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులను అభినందించిన కలెక్టర్



**ప్రజాపక్షం/నిజామాబాద్:** ఇటీవల వెలువడిన పదవ తరగతి ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన సిరికొండ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులను కలెక్టర్ ఇలా త్రిపాఠి అభినందించారు. 582 మార్కులు సాధించిన సుదీప్తినితో పాటు 550 పై మార్కులు సాధించిన విద్యార్థులు సోమవారం సమీకృత జిల్లా కార్యాలయా ల సముదాయంలో కలెక్టర్‌ను కలువగా వారిని అభినందిస్తూ భవిష్యత్తులో మీరు ఏమి కావాలని కోరుకుంటున్నారని, వారి లక్ష్యాలపై అడిగి తెలుసుకున్నారు. ఇదే స్ఫూర్తితో ఉన్నత విద్యనభ్యసించాలని వారికి హితవు పలికా రు. జిల్లాలో 107 ప్రభుత్వ పాఠశాలల్లో నూటికి నూరు శా తం ఉత్తీర్ణత నమోదైందని ఈ సందర్భంగా కలెక్టర్ వెల్లడించా రు. ప్రభుత్వ పాఠశాలలు చాలా బాగా నడుస్తున్నాని, ఉపాధ్యాయులు అంకిత భావంతో బోధన విధులు నిర్వహిస్తున్నారని పదవ తరగతి ఫలితాలే ఇందుకు నిదర్శనమన్నారు. దీని ని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కలెక్టర్ విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించా రు. కార్యక్రమంలో పీఆర్‌టీయుఎస్ జిల్లా అధ్యక్షులు మోహన్‌రెడ్డి, జడ్పీహెచ్ఎస్ సిరికొండ గెజిటెడ్ హెచ్ఎం సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

## అక్రమ పశువుల రవాణా అడ్డుకోవాలి

ఎస్‌పి అఖిల్ మహాజన్

**ప్రజాపక్షం/ఆదిలాబాద్ అర్బన్ :** బక్రీద్ పండుగ నేపథ్యంలో జిల్లాలో పశువుల అక్రమ రవాణాను అరికట్టడానికి ఏడు చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు ఎస్‌పి అఖిల్ మహాజన్ తెలిపారు. సోమవారం పోలీసు సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. 24 గంటల పాటు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, అక్రమంగా తరలించే పశువులను వెంటనే గోశాలలకు తరలించాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా ప్రతిక్షణము అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జీవన్ రెడ్డి, సీఐలు సునీల్ కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం అస్తవ్యస్తం

జిల్లా కలెక్టర్‌కు ఆమ్ ఆద్మీ పార్టీ ఫిర్యాదు



**ప్రజాపక్షం / నిర్మల్ రూరల్ :** నిర్మల్ జిల్లాలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి జిజిహెచ్, భైంసా ఏరియా ఆసుపత్రుల్లో వైద్య సేవలు పూర్తిగా అస్తవ్యస్తంగా తయారయ్యాయని, దీనిపై తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆమ్ ఆద్మీపార్టీ తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ సయ్యద్ హైదర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రిలో సీటి స్కాన్ యంత్రం గత కొన్ని నెలలుగా మరమ్మత్తులకు గురై మూలాన పడిందని, దీనివల్ల నిరుపేద రోగులు ప్రైవేటు స్కానింగ్ సెంటర్లకు వెళ్లి వేల రూపాయలు వెచ్చించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. భైంసా ఏరియా ఆసుపత్రిలో వైద్యులు సమయపాలన పాటించడం లేదని ఉదయం 11.30 గంటలకే ఓపి విభాగాలు ఖాళీ అవతున్నాయని విమర్శించారు. ముఖ్యంగా డెంటల్, రేడియాలజీ వంటి విభాగాల్లో వైద్యులు లేక గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు చికిత్స అందించకుండా, కావాలనే ప్రైవేటు ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారని , ఈ అనైతిక చర్యలపై సమగ్ర విచారణ జరిపించాలని ఆయన కోరారు. నిర్మల్ ఆసుపత్రిలోని సీటి స్కాన్ యంత్రాన్ని యుద్ధ ప్రాతిపదికన బాగు చేయించాలి. విధులకు గైర్హాజరవుతున్న భైంసా ఆసుపత్రి వైద్యులపై చర్యలు తీసుకోవాలి. ప్రైవేటు ఆసుపత్రులకు రోగులను రిఫర్ చేసే విధానంపై విచారణ చేపట్టాలి. జిల్లాలోని ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి. పేద ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న వైద్య ఆరోగ్య శాఖ వైఫల్యాలపై కలెక్టర్ గారు స్పందించి, నాణ్యమైన వైద్యం అందేలా చూడాలని సయ్యద్ హైదర్ విజ్ఞప్తి చేశారు.

## అంబేద్కర్ స్ఫూర్తి ఆదర్శణీయం: జోగురామన్న

**ప్రజాపక్షం/ఆదిలాబాద్ అర్బన్:** అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని మాజీ మంత్రి జోగు రామన్న పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని గాంధీ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ.. అన్ని వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ చేసిన సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, నాయకులు ప్రజ్ఞకుమార్, రమేశ్వర్, మహేందర్ పాల్గొన్నారు.

“విజయ్ ఆంటోని, శశి దర్శకత్వంలో వచ్చిన ‘బిచ్చగాడు’, సినిమాలోని అమ్మ పాటకు ఉన్న క్రేజ్ అందరికీ తెలిసిందే. మళ్లీ అలాంటి ఓ ఎమోషనల్ మదర్ సాంగ్‌తో విజయ్ ఆంటోని, శశి ఆడియెన్స్ ముందుకు వచ్చారు. వీరి కాంబోలో ‘బిచ్చగాడు’ తరువాత ‘వంద దేవుళ్ళు’ అనే సినిమా రాబోతోంది.”



## ‘విశ్వాంభర’లో త్రిషా పోస్టర్ విడుదల

చిరంజీవి హీరోగా నటించిన చిత్రం విశ్వాంభర. ఈ చిత్రం షూటింగ్ పూర్తయి దాదాపు రెండేళ్లు అవుతోంది. ఈ సినిమాలో చిరంజీవి సరసన త్రిష హీరోయిన్‌గా నటించింది. వశిష్ఠ దర్శకత్వం వహించిన ఈ సినిమాను గ్రాఫిక్స్ ప్రధానంగా తెరకెక్కించారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వచ్చిన మన శంకర వర ప్రసాద్‌గారు సినిమా కోసం విశ్వాంభర సినిమాను ఇంత కాలం రిలీజ్ చేయకుండా ఆపేశారు. సోమవారం త్రిషా బర్త్ డే సందర్భంగా విశ్వాంభర టీమ్ త్రిషాకు విష్‌శేష్ చెప్తూ పోస్టర్ విడుదల చేశారు. చిరంజీవి కూడా తన సోషల్ మీడియా ఎక్స్ ద్వారా త్రిషాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సినిమాలో త్రిషా అవని అనే పాత్రను పోషించారు. విశ్వాంభంర సినిమాను ఇక రిలీజ్‌కు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. జూన్‌లో రామ్ చరణ్ పెద్ది సినిమా విడుదల అనంతరం ఒక మంచి రోజు చూసి విశ్వాంభర సినిమాను విడుదల చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. యు వి క్రియేషన్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించింది.

## నెలాఖరులో రానున్న ‘వంద దేవుళ్ళు’

విజయ్ ఆంటోని, శశి దర్శకత్వంలో వచ్చిన ‘బిచ్చగాడు’, సినిమాలోని అమ్మ పాటకు ఉన్న క్రేజ్ అందరికీ తెలిసిందే. మళ్లీ అలాంటి ఓ ఎమోషనల్ మదర్ సాంగ్‌తో విజయ్ ఆంటోని, శశి ఆడియెన్స్ ముందుకు వచ్చారు. వీరి కాంబోలో ‘బిచ్చగాడు’ తరువాత ‘వంద దేవుళ్ళు’ అనే సినిమా రాబోతోంది. తాజాగా ‘వంద దేవుళ్ళు’ నుంచి ‘అమ్మ అమ్మేగా’ అంటూ అమ్మ గొప్పదనం గురించి చెప్పే పాటను విడుదల చేశారు. వంద దేవుళ్లే దిగివచ్చినా అని భాష్యశ్రీ ఎలాంటి సంచలనాలు క్రియేట్ చేశారో.. మళ్లీ ఇప్పుడు ‘అమ్మ అమ్మేగా’ అని అందరినీ



మెప్పించేందుకు వచ్చారు. ‘అమ్మ అమ్మేగా’ అనే ఈ పాటకి భాష్యశ్రీ సాహిత్యం, బాలాజీ శ్రీరామ్ బాణీ, శ్రీకాంత్ హరిహరణ్ గాత్రం అన్నీ అద్భుతంగా కుదిరాయి. ఈ పాటను వింటే అమ్మ విలువ ఏంటో అర్థం అవుతుంది. విజయ్ ఆంటోని ఫిల్మ్ కార్పోరేషన్, ఫాతిమా విజయ్ ఆంటోనీ సమర్పణలో.. సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్ మీద రామంజనేయులు జవ్వాజి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమాలో విజయ్ ఆంటోని, స్వాసిక, అజయ్, కావ్య, శక్తి, పదిని, కర్నాన్, బాలాజీ శక్తివేల్, దివాకర్, అరుళ్ దాస్, బక్స్, వినోదిని, మునిష్ కాంత్, కొడంగి వడివేలు తదితరులు ముఖ్య పాత్రల్ని పోషించారు. ఈ సినిమాకి ఎస్. బి. దర్శన్ కిర్లోష్ కెమెరామెన్‌గా, బాలాజీ శ్రీరామ్ సంగీత దర్శకుడిగా పని చేశారు. హరిష్ యువరాజ్ ఎడిటర్‌గా, భాష్య శ్రీ డైలాగ్ రైటర్‌గా వర్క్ చేశారు. ఈ మూవీని సమ్మర్ కానుకగా మే నెలలో గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నారు. విజయ్ ఆంటోని సరసన స్వాసిక, అజయ్, కావ్య నటించారు.

## ఆకలితో మొదలయ్యే ఆట ‘మటన్’

పుష్ప ఫేమ్ జగదీష్ ప్రతాప్ బండారి లీడ్ రోల్‌లో నటిస్తున్న మూవీ ‘మటన్’. ఈ చిత్రాన్ని డైస్ ఆర్ట్ ఫిలిమ్స్ బ్యానర్‌పై యువ దర్శకుడు హర్షా డైస్ నిర్మిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు. పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా రూపొందుతున్న ‘మటన్‘ మూవీ త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ చిత్రానికి ‘రక్తం.. రణం.. ప్రతీకారం..’ అనే ట్యాగ్‌లైన్. ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్ రిలీజ్ చేశారు. మోషన్ పోస్టర్‌లో ‘ఆకలితో మొదలయ్యే ఆట, రక్తంతో ముగుస్తుంది...’ అనే క్యాప్షన్ క్యూరియాసిటీ క్రియేట్ చేస్తోంది. ఈ చిత్రంలో జగదీష్ ప్రతాప్ బండారి పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్నారు.




## ‘మారణహోమం–1990’

### టీజర్ విడుదల చేసిన శ్రీకాంత్



ఎన్.కె.ఎస్. ఫిలిమ్స్ పతాకంపై సమన్విత ప్రెసెంట్స్‌లో బంధు నరేష్ దర్శకత్వంలో బంధు నాగమణి నిర్మిస్తున్న చిత్రం 'మారణ హోమం 1990'. ఈ చిత్ర టీజర్, ఫస్ట్ లుక్ ప్రముఖ నటుడు శ్రీకాంత్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ ‘మారణహోమం 1990 టీజర్ చాలా అద్భుతంగా ఉంది. దర్శకుడు మంచి స్టైల్‌లో, బలమైన కంటెంట్ ఉన్న కథను ఎంచుకున్నారు. మేకింగ్ విజువల్స్ ఎక్స్‌ట్రార్డినరీగా ఉన్నాయి. చిత్ర హీరో హీరోయిన్లు, ఇతర నటీనటులు తమ పాత్రల్లో ఒదిగిపోయారు. తప్పకుండా ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని నమ్ముతున్నాను అని చెప్పారు. చిత్ర హీరో బంధు నరేష్ మాట్లాడుతూ... ప్రస్తుతం షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉన్న '1990s' చిత్రం అతి త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుందని అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర హీరో బంధు నరేష్, హీరోయిన్ బంధు నాగమణి, దీప్తి రెడ్డి లౌక్య, భాను,పివి రెడ్డి, శ్యామ్ సుందర్, వట్టం. రవి, ఎ. కిరణ్, ఎ. నర్సయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి సంగీతం : నవనీత్ చారి, ఆర్మన్, డిఓపి : రాఘవేందర్ రెడ్డి (రఘు).

## ‘స్పిరిట్’ షూటింగ్ పూర్తి

యెత్ వండర్ సినిమా బ్యానర్‌పై రవిబాబు సత్య ప్రకాష్, చిత్రం శీను, గడ్డర నవీన్, జూనియర్ రాజశేఖర్, సుజాత, మయూరి, డాలి నటీనటులుగా సిహెచ్ రవీంద్రనాథ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా స్పిరిట్.
గొర్రెలు కాచుకునే భార్య భర్తలు అయిన చిన్నబోయిన రైతు నర్సమ్మ వెంకటేశ్వర్లు కలిసి నిర్మించిన చిత్రం ఇది. వీరికి చదువు రాకపోయినా ఆర్టిస్టలను పెట్టుకుని తన కొడుకుతో తీసిన ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ సందర్భంగా చిత్రం ఆడియో వేడుకను హైదరాబాదులో ఘనంగా విడుదల చేశారు ఈ వేడుకకు ప్రముఖ దర్శకులు వి.సముద్ర, నటులు నిర్మాత అశోక్ కుమార్, నిర్మాత రామ్ దాస్ తదితరులు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. అనంతరం చిత్ర నిర్మాతలు చిన్నబోయిన రైతు నర్సమ్మ, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నేను ఇక్కడికి రావడానికి చాలా కష్టపడ్డాను నాకున్న గొర్రెలను అన్ని అమ్ముకొని సినిమా తీశాము.అందరూ నన్ను ఎగతాళి చేసినా కూడా నేను పట్టించుకోలేదు. నా కష్టం చూసిన వారు మాత్రం నాకు సపోర్ట్ చేశారు. ఇది నా ఒక్కరిది కాదు అందరి సినిమా. మనం అందరూ చూసి ఆదరించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని అన్నారు. చిత్ర దర్శకుడు సి. హెచ్. రవీంద్రనాథ్ మాట్లాడుతూ. అందరికీ తల్లిదండ్రులు జన్మనిస్తే నాకు మాత్రం జన్మతో పాటు మా పెద్దలు జీవితాన్ని కూడా ఇచ్చారు అది నేను జీవితాంతం మర్చిపోలేను ఈ సినిమా చాలా బాగా వచ్చింది అందరూ మా సినిమాను ఆదరించి ఆశీర్వదించాలని మన స్ఫూర్తిగా కోరుకుంటున్నామన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ : ఎస్ ఎస్ వెంకటేష్, సంతోష్ కావాలా, ఎడిటర్ : రాజారావు కలుపు రెడ్డి, డిఓపి : రాజ్ కమల్ పి భరత్ , సింగర్స్ : కౌసల్య మాళవిక.



## సైకలాజికల్ థ్రిల్లర్ ‘డోంట్ స్లీప్’

మమ్ముట్టి నటించిన ‘స్ట్రీట్ లైట్స్’కి దర్శకత్వం వహించిన సినిమాటోగ్రాఫర్ షామ్‌దత్, ‘చౌర్య పాఠం’లో ఆకట్టుకున్న ఇంద్ర రామ్ హీరోగా సైకలాజికల్ థ్రిల్లర్ ‘డోంట్ స్లీప్’ సినిమా చేస్తున్నారు. వి. చూడామణి ఈ చిత్రాన్ని వి డ్రీమ్ ఫిలమ్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెం 2 గా నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో రవీంద్ర విజయ్ ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సందర్భం గా రవీంద్ర విజయ్ ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేశారు. ఫస్ట్ లుక్‌లో రవీంద్ర విజ య్ స్టైలిష్ లుక్‌లో ఆకట్టుకున్నారు. ఇంటె న్స్ వైబ్‌తో ఉన్న ఈ ఫస్ట్ లుక్ ఆయన పాత్రలో వున్న సస్పెన్స్, థ్రిల్ ఎలిమెంట్స్ ప్రజెంట్ చేస్తోంది. పుష్ప: ది రైజ్’ చిత్రానికి పనిచేసిన మోనికారామకృష్ణ ప్రొడక్షన్ డిజైన్‌ను నిర్వహిస్తున్నారు. సంగీతాన్ని గోకుల్ హర్షన్ అందించారు. స్టేట్ అవార్డు గ్రహీత అయిన మనోజ్ ఎడిటింగ్ చేశారు. గతంలో దుల్కర్ సల్మాన్ నటించిన ఐయామ్ గేమ్ చిత్రాలకు పనిచేసిన సజీర్, లూనా కథను అందించారు. ఇంద్ర రామ్, రవీంద్ర విజయ్, తబా రీమా, జ్యోతి బెనర్జీ, సునీల్ థాపా, ఆడుకలం నరేన్, కల్పలత, అనీష్ కురువిల్లా, వెన్నెల కిషోర్, నాగి జబర్దస్త్, డాక్టర్ భద్రమ్, రఘుబాబు, తదితరులు. నటిస్తున్నారు. ఈ చిత్రానికి డిజిపి : షామ్‌దత్, సంగీతం: గోకుల్ హర్షన్.



## రేపు రాష్ట్రవ్యాప్త నిరసనలు

(మొదటి పేజీ తరువాయి)

తీవ్ర ఇబ్బందులకు గురైతున్నారని, కొరత లేదని పాలకులు ప్రకటిస్తున్నప్పటికీ ఆచరణలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు. 5 రాష్ట్రాల ఎన్నికలు ముగియగానే కేంద్ర ప్రభుత్వం వాణిజ్య సిలెండర్ల ధరలను రూ. 993 పెంచడంతో అది కాస్తా రూ.3100కు చేరిందని, అలాగే డీజిల్, పెట్రోల్ మీద లీటరు రూ. 5 లు గృహవసరాల గ్యాస్ సిలిండర్ల పై రూ.50 పెంచడానికి ఆయిల్ కంపెనీలు ప్రతిపాదనలు పంపించాయని, వీటిని కూడ కేంద్రప్రభుత్వం పెంచే ప్రమాదం ఉన్నందున ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమించి తిప్పికొట్టాలని కోరారు. అమెరికా సామ్రాజ్యవాద విధానాలను మోదీ ప్రభుత్వం వ్యతిరేకించకపోవడంతో యుద్ధం కంటే ముందు బ్యారెల్ ముడి చమురు ధర 72 డాలర్లు ఉంటే, ఇప్పుడు 126 డాలర్లకు చేరుకున్నదని గుర్తు చేశారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ సిలిండర్ ధరల వల్ల హోటల్స్, రెస్టారెంట్లు, చిన్న పెద్ద ఆహార వ్యాపారాల మీద ఇప్పటికే భారం పడిందని, పెట్రోల్, డీజీల్ ధరలు సైతం పెరిగితే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ద్రవ్యోల్బణం పెరిగి ప్రజలపై మరింత ఆర్థిక భారం పడునుందన్నారు. అమెరికా, ఇరాన్ యుద్ధం వల్ల భారతదేశానికి ఎలాంటి ప్రమాదం లేదని, చమురు, గ్యాస్ నిల్వలు ఉన్నాయని చెబుతున్న కేంద్ర ప్రభుత్వం ఎందుకు గ్యాస్ ధరలు పెంచుతున్నట్లు, పెట్రోల్ బంక్ ల వద్ద ఎందుకు ప్రజలు బారులు తీరుతున్ననే దానికి ప్రభుత్వం ఇచ్చే సమాధానానికి వాస్తవానికి పొంతన లేదన్నారు. ఈ తరుణంలో ఈ నెల 6వ తేదీన సిపిఐ ఆధ్వర్యంలో గ్యాస్ సిలిండర్లు, ఖాళీ క్యాన్స్‌తో రాష్ట్ర వ్యాపితంగా అన్ని జిల్లా, మండల, గ్రామ,బస్తీ శాఖలలో నిరసన ధర్నాలు చేపట్టాలని కూనంనేని సాంబశివరావు ప్రజలకు, పార్టీ శ్రేణులకు సోమవారం ఓ ప్రకటనలో కోరారు.

## పరిశ్రమలే ముందుకు రావాలి

### ఇంజనీర్లకు శిక్షణపై మంత్రి శ్రీధర్ బాబు పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లో యువ ఇంజనీర్ల భవిష్యత్తుపై కీలక వ్యాఖ్యలు చేశారు ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు. రాష్ట్రంలో ప్రతి ఏడాది ఇంజనీరింగ్ పూర్తి చేస్తున్న సుమారు 2 లక్షల మంది గ్రాడ్యుయేట్లకు పరిశ్రమలే శిక్షణ బాధ్యత తీసుకుని ఉద్యోగాలకు సిద్ధం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బేగంపేటలోని వివాంతా హోటల్‌లో సోమవారం నిర్వహించిన పిఎస్ ఆర్ టెక్ హబ్ పదేళ్ల వార్షికోత్సవ కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. యూనివర్సిటీ విద్య, పరిశ్రమల అవసరాల మధ్య పెరుగుతున్న అంతరాన్ని తగ్గించేందుకు సంస్థలు ప్రత్యక్షంగా శిక్షణ కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. టెక్నాలజీ రంగంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తూ పిఎస్ ఆర్ టెక్ హబ్ సంస్థ రూ.120 కోట్ల స్థాయికి ఎదగడం అభినందనీయమని అన్నారు. కరోనా సమయంలో అనేక సంస్థలు నష్టపోయిన సందర్భంలో కూడా ఈ సంస్థ నిలదొక్కుకుని 250 మందికి ఉపాధి కల్పించడం విశేషమని కొనియాడారు. ఇక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, ఇంజనీర్ల నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి వెల్లడించారు. ‘ఏఐ హబ్’ పేరుతో ప్రత్యేక శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, వచ్చే రెండు నెలల్లో రీస్కిల్లింగ్ కార్యక్రమాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ పి. నమ్యుత మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ప్రముఖ నగరాల్లో సేవలు అందిస్తున్న పిఎస్ ఆర్ టెక్ హబ్, వచ్చే మూడేళ్లలో విదేశాల్లోనూ విస్తరణ చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. ఉద్యోగుల సంఖ్యను 1,000కు పెంచడంతో పాటు, కొత్తగా ఉత్తీర్ణులైన ఇంజనీర్లకు శిక్షణ ఇచ్చి ప్రతిభావంతులకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉద్యోగులు, క్లయింట్లు, పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.



## టిటిఐ అధికారిపై దాడికి పాల్పడ్డ కండక్టర్ సస్పెన్షన్

### ఆర్‌టిసి సిబ్బంది గీత దాటితే కఠిన చర్యలు: ఎండి వై.నాగిరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నారాయణఖేడ్ డిపోకు చెందిన ఓ బస్సు కండక్టర్ దేవ్‌సోత్ వసంత్ తనిఖీ అధికారులపై దాడి చేయడాన్ని సంస్థ తీవ్రంగా పరిగణించింది. క్రమశిక్షణారాహిత్యానికి పాల్పడిన సదరు కండక్టర్‌ను విధుల నుంచి తొలగిస్తూ (సస్పెండ్) ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆర్‌టిసి ఎండి వై.నాగిరెడ్డి వెల్లడించారు. ‘మే 1వ తేదీన మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజిబిఎస్) నుంచి నారాయణఖేడ్ వెళ్తున్న బస్సును రాయికోడ్ సమీపంలో టికెట్ తనిఖీ బృందం (టిటిఐ) తనిఖీ చేసింది. ఈ క్రమంలో తనిఖీ అధికారుల విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా, కండక్టర్ వసంత్ వారిపై భౌతిక దాడికి దిగారు. ఈ సంఘటనపై రంగంలోకి దిగిన ఆర్‌టిసి ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టారు.

## ఆన్‌లైన్ వేధింపుల నివారణకు ‘డిజిటల్ హుందాతనం’ కీలకం

### డిజి చారు సిన్హా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** డిజిటల్ మాధ్యమాల్లో పెరుగుతున్న వేధింపులకు అడ్డుకట్ట వేయాలంటే ప్రతి ఒక్కరూ ‘డిజిటల్ హుందాతనం’ పాటించాల్సిన అవసరం ఉందని మహిళా భద్రతా విభాగం డిజి చారు సిన్హా అన్నారు. మహిళలు, చిన్నారుల భద్రతను ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని తెలంగాణ మహిళా భద్రతా విభాగం చేపట్టిన ‘స్టాండ విత్ హర్’ ప్రచారంలో భాగంగా సోమవారం లక్డీకాపూల్‌లోని డిజి కార్యాలయంలో డిజిటల్ హుందాతనం–గౌరవం అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆన్‌లైన్‌లో ప్రతి వ్యక్తి బాధ్యతాయుతంగా వ్యవహరించడం అత్యవసరమని, ఎదుటి వారి గోప్యత, అంగీకారాన్ని గౌరవించడమే నిజమైన డిజిటల్ హుందాతనమని పేర్కొన్నారు. మనం చేసే పోస్టులు, వ్యాఖ్యలు ఇతరుల మనోభావాలపై ఎలా ప్రభావం చూపుతాయో గ్రహించడం ‘డిజిటల్ సానుభూతి’ అని వివరించారు. సైబర్ స్టాకింగ్, ట్రోలింగ్, బుల్లీయింగ్, డాక్సింగ్ వంటి వేధింపుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియాను సానుకూల వేదికగా మలచాలని పిలుపునిచ్చారు. ఆన్‌లైన్ వేధింపులపై మౌనంగా ఉండటం నేరస్తులకు ప్రోత్సాహం కల్పించినట్లేనని, బాధితులకు అండగా నిలవడం సమాజపు బాధ్యత అని స్పష్టం చేశారు. వేధింపులకు గురైనప్పుడు వెనుకాడకుండా సైబర్ క్రైమ్ పోర్టల్స్ లేదా పోలీస్ హెల్ప్‌లైన్‌లకు ఫిర్యాదు చేయాలని సూచించిన డిజి, బాధితులకు చట్టపరమైన రక్షణ అందుబాటులో ఉందని భరోసా ఇచ్చారు. సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో సైబర్ భద్రత, చట్టపరమైన అంశాలపై అధికారులు సందేహాలను నివృత్తి చేశారు. యువతలో డిజిటల్ భద్రతపై అవగాహన పెంచేందుకు తమ విభాగం నిరంతరం కృషి చేస్తుందని చారు సిన్హా తెలిపారు.



## ‘పిఎస్ఎస్ స్కీంలో చేర్చాలి’

(మొదటి పేజీ తరువాయి)

చేయడంతో రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోందని వివరించారు.సెంట్రల్ పూల్‌లో కేంద్ర నోడల్ సంస్థ ద్వారా శనగ పంటను 29,860 మెట్రిక్ టన్నులు (మొత్తం ఉత్పత్తిలో 25శాతం) కొనుగోలు చేయడానికి, అలాగే పొద్దుతిరుగుడు కొనుగోలు పరిమితిని 3690 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయడానికి కేంద్రం అనుమతించిందని, దీంతో కొనుగోలు గత వారమే పూర్తయ్యాయని అన్నారు. రైతుల పంటలను మార్కెట్లకు తీసుకువస్తున్న నేపథ్యంలో శనగ పంటల కొనుగోలు పరిమితిని 1,12,077 మెట్రిక్ టన్నులు , పొద్దుతిరుగుడు పంటల కొనుగోళ్లను 10,839 మెట్రిక్ టన్నులకు పెంచాలని మంత్రి కోరారు. తెలంగాణలో విస్తృతంగా పండే మొక్కజొన్న, జొన్న పంటను కేంద్రం పిఎస్ఎస్ స్కీంలో చేర్చి, కేంద్ర నోడల్ ఏజెన్సీల ద్వారా కొనుగోలు చేపట్టాలని మంత్రిగారు డిమాండ్ చేశారు. ఈ రబీ సీజన్ లో 11.21 లక్షల ఎకరాలలో మొక్కజొన్న సాగు చేయగాఎకరానికి 26.57 క్వింటాళ్ల దిగుబడి రాగా, జొన్న కూడా 3.68 లక్షల ఎకరాలలో సాగు చేయగా ఎకరానికి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా ఉందన్నారు. అయితే మార్కెట్లో గిట్టుబాటు ధర రానందున రాష్ట్ర ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోళ్ల కోసం 246 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, ప్రస్తుత రబీ సీజన్‌లో సుమారు 3.99 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను మద్దతు ధరకు కొనుగోలు చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకుని ధర మద్దతు పథకం (పిఎస్ఎస్)లో మొక్కజొన్న, జొన్న పంటలను చేర్చాలని అన్నారు. మొక్కజొన్న పంటను కేంద్ర నోడల్ ఏజెన్సీల ద్వారా 14.89 లక్షల మెట్రిక్ టన్నుల (1,48,99,520 క్వింటాళ్లు) కొనుగోలు చేసేందుకు, 2.76 లక్షల మెట్రిక్ టన్నుల (2,76,277 క్వింటాళ్లు) జొన్న పంటను కొనుగోలు చేసేందుకు అనుమతి ఇవ్వాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

## హోర్ముజ్‌లో ‘ప్రాజెక్ట్ ఫ్రీడమ్’

(మొదటి పేజీ తరువాయి)

వెళ్ళిపోయేందుకు మార్గదర్శనం చేస్తామని చెప్పారు. అమెరికా సెంట్ కామ్ ఒక ప్రకటన చేస్తూ, ప్రాజెక్ట్ లిబర్టీ కోసం 15,000 మంది అమెరికా సైన్యాన్ని, క్షిపణి విధ్వంసక ఆయుధాలను, గగనతల వ్యవస్థలను, 100 యుద్ధ విమానాలను మోహరించినట్లు పేర్కొంది. తమ ఆపరేషన్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నం చేస్తే, బలప్రయోగంతో అణచివేస్తామని, తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరించారు. జలసంధి దాటకుండా స్తంభించిపోయిన నౌకలను విముక్తిచేసి మానవతా దృక్పథంతో సురక్షింగా మహాసముద్రంలోకి వెళ్ళిపోయేందుకు,కంపెనీలకు న్యాయం చేయడంలో ఎలాంటి తప్పులేదని అన్నారు. ఈ ప్రకటనపై ఇరాన్ నావికాదళం తీవ్రంగా స్పందించింది. హోర్ముజ్ జలసంధిలో కాలుపెడితే దాడులు చేస్తామని హెచ్చరించింది. ఆ తర్వాత, హోర్ముజ్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నం చేసిన అమెరికా యుద్ధనౌకపై నౌకపై రెండు క్షిపణులతో దాడులు చేసినట్లు సోమవారం మధ్యాహ్నం ప్రకటించింది. తమ నౌకలపై ఎలాంటి దాడులు జరగలేదని అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. ఇరాన్ నావికాదళం ప్రకటనను తోసిపుచ్చింది. హోర్ముజ్ జలసంధి పూర్తిగా తమ అధీనంలోనే ఉందని ఇరాన్ ప్రకటించినప్పటికీ, అమెరికా జెండాలు ఉన్న రెండు నౌకలు సురక్షితంగా జలసంధిని దాటి మహాసముద్రంలోకి ప్రవేశించాయని కూడా సెంట్‌కామ్ ప్రకటించింది. హోర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకల రాకపోకలు సజావుగా సాగేందుకు ట్రంప్ చర్యలు తీసుకుంటున్నారన్న వార్త గుప్పుమనడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు గణనీయంగా తగ్గాయి.

### కొత్త ప్రతిపాదనపై

అమెరికా ప్రతిస్పందనను పరిశీలిస్తున్న ఇరాన్ ఇరాన్ కొత్తగా అమెరికాకు ప్రతిపాదించిన 14 అంశాలతో కూడిన ప్రణాళికపై ట్రంప్ ప్రతిస్పందన సందేశాన్ని ఇరాన్ నాయకత్వం పరిశీలిస్తోంది. యుద్ధం ముగించేందుకు ఆదివారం ఇరాన్ మరో కొత్త ప్రతిపాదనను మధ్యవర్తి పాకిస్థాన్ ద్వారా పంపించింది. దీనిపై తక్షణ ట్రంప్ స్పందనగా, తనకు అంగీకారయోగ్యంకాని విషయాలను ఇరాన్ అడుగుతోందని చెప్పారు. అమెరికాకు ఇరాన్ పంపించిన కొత్త ప్రతిపాదనల్లో అణు చర్చల అంశం లేదు. తక్షణం హోర్ముజ్‌లో నౌకల రాకపోకలను పునరుద్ధరించడం, 30 రోజుల వ్యవధిలో శాశ్వత ప్రాతిపదికపై లెబనాన్‌తో సహా అన్ని రంగాల్లో యుద్ధాన్ని ముగించడం, ఇరాన్ ఆస్తులను విడుదల చేయడం, మళ్ళీ దాడులు చేయబోమని భద్రతా భరోసా ఇవ్వడం వంటి అంశాలున్నాయి. ప్రస్తుత దశలో అణ్వాయుధం, యురేనియం అంశాలపై ఎలాంటి సంప్రదింపులను తాము కోరడంలేదని ఇరాన్ విదేశీ వ్యవహారాల అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయీ సోమవారం చెప్పారు. అణుకార్యక్రమం, యురేనియం శుద్ధి అంశం దీర్ఘకాలిక సమస్యగా ఉందన్నారు. ఈ సమస్యను చివరి ప్రాధాన్యతాంశంగా చూస్తున్నామని అన్నారు. ఏప్రిల్ ఎనిమిదోతేదీన రెండు దేశాలమధ్యా కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చింది. ఏప్రిల్ 13 నుండి హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ ఓడరేవుల నుండి నౌకల రాకపోకలు సాగకుండా దిగ్బంధనాన్ని అమెరికా సెంట్‌కామ్ అమలు చేస్తోంది. ఇప్పటివరకూ 49 వాణిజ్య నౌకలను జలసంధి దాటకుండా వెనక్కు తరిమికొట్టినట్లు సెంట్‌కామ్ ప్రకటించింది. ఇరాన్ ఇక తన చమురు బావుల్ని మూసేసుకోవాల్సిందేనని, వారికి నిల్వ సామర్థ్యం లేదని అమెరికా ఆర్థికమంత్రి స్కాట్ బెస్సెంట్ సోమవారం ఫాక్స్‌న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. వారు ఆర్థికంగా తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నారన్నారు.

## తండ్రీకొడుకులు

(మొదటి పేజీ తరువాయి)

మరికొంత మందిని వీరు మోసం చేశారు. హైదరాబాద్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసు ప్రకారం మెడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లాకు చెందిన వ్యాపారి శ్రీనివాసులు రెడ్డి అనే వ్యక్తిని హర్ష సంగీ, గోపాల్ సంగీ అనే తండ్రీకొడుకులు మోసం చేసినట్లు వెలుగులోకి వచ్చింది. బాబు ఖాన్ మాల్‌లో ‘నీలం చాంది సన్స్‘ పేరుతో దుకాణం నిర్వహిస్తున్నామని చెప్పి నమ్మకం పొందిన వీరు, తక్కువ ధరకు బంగారం, వెండి సరఫరా చేస్తామని ఆశ చూపారు. కొన్ని రోజులపాటు పరిచయం పెంచుకున్న తరువాత, తక్షణం డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయాలని ఒత్తిడి తెచ్చి, వివిధ బ్యాంక్ ఖాతాల్లోకి మొత్తం రూ.50 లక్షలు జమ చేయించుకున్నారు. డబ్బులు పంపిన వెంటనే మరుసటి రోజు సరుకు ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే, మరుసటి రోజు బాధితుడు షాప్‌కి వెళ్లగా అది మూసి ఉండడం, ఇద్దరు నిందితులు గల్లంతవ్వడం అనుమానాలకు తావిచ్చింది. ఫోన్ ద్వారా సంప్రదించేందుకు ప్రయత్నించినా స్పందన లేకపోవడంతో మోసం జరిగినట్లు స్పష్టమైంది. తర్వాత సంప్రదించినప్పుడు కూడా డబ్బులు తిరిగి ఇవ్వబోమని స్పష్టం చేసినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. దర్యాప్తులో భాగంగా, ఇదే విధంగా మరికొంతమందిని కూడా మోసం చేసి కోట్లకు పైగా దోచుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి, తరువాత సిసిఎస్ ఇఒడబ్ల్యూ విభాగానికి కేసును బదిలీ చేశారు. నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టగా, ఇలాంటి మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. భారీ మొత్తాల్లో డబ్బులు పెట్టుబడి పెట్టే ముందు వ్యాపారుల నమ్మకతను పూర్తిగా నిర్ధారించుకోవాలని హెచ్చరించారు.ఈ ఘటన నగరంలో వ్యాపార వర్గాల్లో ఆందోళన కలిగిస్తోంది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com